www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 25-5-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 39 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి మ.3.52 తదుపరి చతుర్దశి, నక్షత్రం: అశ్విని ఉ.11.12 తదుపరి భరణి, వర్జ్యం: ఉ.7.38-9.03, రా.7.40-9.05, దుర్ముహూర్తం: సా.4.56-5.48, అమృతఘడియలు: తె.4.09-5.34, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.39 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కలిసికట్టుగా సాధిద్దాం

వికసిత భారతాన

స్వర్ణాంధ్ర సాధన

2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా ఏపీ

పీ-4 అమలుతో ఆ లక్ష్యాన్ని అందుకుంటాం

అమరావతి, తిరుపతి, కర్నూలుకు విశాఖ మోడల్!

టెక్నాలజీ అభివృద్ధికి శీఘ్రగతిన ప్రణాళికలు

డిజిటల్ మౌలిక కల్పనల్లో ఆదర్శంగా నిలిచాం

కుటుంబానికో పారిశ్రామికవేత్త.. మా నినాదం

2047నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ

నీతీ ఆయోగ్ సమావేశంలో చంద్రబాబు వెల్లడి

సీఎం బ్లూప్రింట్ ప్రజంటేషన్‌కు మోదీ ప్రశంస



నీతీ ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం వద్ద ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు కరచాలనం. పక్కన తమిళనాడు సీఎం స్టాలిన్

"కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, అమరావతి రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ, విశాఖపట్నంలో బయోమెడికల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ద్వారా టెక్నాలజీ ఆధారిత అభివృద్ధికి ఏపీ బాటలు వేస్తోంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేస్తున్నాం. విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలి."

- చంద్రబాబు

న్యూఢిల్లీ, మే 24 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తి చేసుకునేనాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా నడిచేందుకు... ఇందులో దేశానికే మార్గదర్శకంగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ద్వారా ఆవిష్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో జాతీయ అభివృద్ధికి ఏపీ దోహద పడుతుందని తెలిపారు. 'వికసిత్ భారత్ 2047' సాకార పథంలో ఆంధ్రప్రదేశ్ ముందుందని పేర్కొన్నారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పీ 4 ద్వారా ఈ లక్ష్యాన్ని అందుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలోని 'భారత మండపం'లో శనివారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన నీతీ ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు ఏపీ అభివృద్ధిపై నివేదిక సమర్పించారు. వృద్ధిరేటు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి,

మిగతా 13వ పేజీలో...

కలిసి పనిచేద్దాం

టీమిండియా స్ఫూర్తి చాటుదాం

'నీతి' భేటీలో రాష్ట్రాలకు మోదీ పిలుపు 2

నిధుల కోసం దేబిరించాలా?: స్టాలిన్

చిత్రసీమ 'రిటర్న్ గిఫ్ట్'కు థ్యాంక్స్!



కూటమి ప్రభుత్వం పరిశ్రమకు గౌరవం ఇచ్చింది 10

కానీ కనీస మర్యాదగా కూడా సినీ పెద్దలు సీఎంను కలవలేదు

గత ప్రభుత్వం అగ్రనటులను ఎలా ఛీత్కరించిందో మరిచినట్లున్నారు

ప్రభుత్వంతో వ్యక్తిగత చర్చలు ఉండవు.. సంఘాల ప్రతినిధులు రావాల్సిందే

థియేటర్ల బంద్‌పై డిప్యూటీ సీఎం కార్యాలయం ఘాటు ప్రకటన

థియేటర్ల బంద్ లేదు.. సమస్యల పరిష్కారానికి కమిటీ

కేరళను తాకిన నైరుతి



16 ఏళ్ల తర్వాత 8 రోజులు ముందుగా దేశంలోకి వచ్చిన రుతుపవనాలు.. 2-3 రోజుల్లో రాష్ట్రానికి

నేడు, రేపు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు 12

అన్నాచెల్లెళ్ల వార్!



ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబంలో చెలరేగిన కలహాలను ఇప్పటిదాకా చూశాం.. చూస్తున్నాం. తెలంగాణ రాజకీయాలలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంలో అదే సీన్ రిపీట్ కాబోతున్నది. తండ్రుల వల్ల సంక్రమించిన అధికారం, సంపదలో కుమార్తెలకు వాటా దక్కకపోవడం ఆ చెల్లెళ్ల ఆగ్రహానికి కారణమైంది.

తన తండ్రి దేవుడు అని, అయితే ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని కవిత ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆ దెయ్యాలు ఎవరో ఇప్పుడు తేలాల్సి ఉంది. కేసీఆర్‌ను అంటిపెట్టుకొని ఉంటున్నవారు కేటీఆర్, సంతోష్‌రావు మాత్రమే.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో షర్మిల ఒక విఫల ప్రయోగంగా నిలిచారు. తెలంగాణలో రాజకీయ పార్టీ ప్రారంభించి రాజీ పడకుండా పాదయాత్ర చేసినా ఆమెకు ఆదరణ లభించలేదు. దీంతో అన్న జగన్ రెడ్డిపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఆమె ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ బాధ్యతలు చేపట్టారు. షర్మిలతో పోలిస్తే కవితది భిన్నమైన నేపథ్యం.

మద్యం స్కాంలో దర్యాప్తు వేగం అందుకుంటున్న కొద్దీ జగన్మోహన్ రెడ్డి కలవరం చెందుతున్నారు. నేరంతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న వారిని అరెస్టు చేస్తున్నారు. బాలాజీ గోవిందప్ప, ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అరెస్టులతో జగన్ ఉలిక్కిపడుతున్నారు.

నీటి ప్రాజెక్టులతో పాటు ఇతరత్రా వ్యవహారాల్లో కమీషన్లుగా వచ్చిన సొమ్ములో కొంత భాగాన్ని ఐఏఎస్ అధికారులకు వారి వాటాగా రాజశేఖర రెడ్డి పంపేవారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అక్రమ సొమ్ము సమీకరణ బాధ్యతలను ఏకంగా అధికారులకే అప్పగించారు.

నాడు గానీ, నేడు గానీ అధికారులు కేసుల్లో ఇరుక్కోవడానికి కారణం ఎవరు? జగన్ రెడ్డి కారణంగానే వీరంతా హద్దు మీరి కష్టాలు కొని తెచ్చుకోలేదా? అధికారం శాశ్వతమని తాను నమ్మడమే కాకుండా ఊడిగం చేయడానికి సిద్ధపడ్డ అధికారులనూ భ్రమల్లోకి నెట్టింది జగన్ రెడ్డి కాదా? అధికారంలో ఉన్నప్పుడు ఎడాపెడా దోచుకొని ఇప్పుడు చంద్రబాబే స్కాంలకు పాల్పడ్డారని చెప్పగలుగుతున్నారంటే అది జగన్ విపరీత మనస్తత్వానికి నిదర్శనం.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

ఫైనల్‌గా ఏ 'ప్యాలెస్'కు?



మద్యం ముడుపుల రూటు కనిపెట్టిన 'సిట్'

హైదరాబాద్ 'రియల్'లో భారీగా పెట్టుబడులు

బెంగళూరులో పదులకొద్దీ ఎకరాల కొనుగోలు

వాటి విక్రేతలు, మధ్యవర్తుల గుర్తింపు

ముంబై బులియన్‌లో క్వింటాళ్లకొద్దీ 'గోల్డ్'

జీఎస్టీ చెల్లించి ఇన్వాయిస్‌ల 'కొనుగోలు'

బంగారు వ్యాపారుల నుంచి ఆరా తీస్తున్న సిట్

వివిధ మార్గాల్లో అంతిమ లబ్ధిదారుకు ముడుపులు!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

క్యాష్ కొట్టు... ఆర్డర్ పట్టు!

వైఎస్ జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం తీరిది! అలా తెచ్చుకున్న నగదంతా ఎక్కడికి వెళ్లింది? ఏ నగరాలను చుట్టింది? ఏ దేశాలకు వెళ్లి... మళ్లీ హవాలా ద్వారా తిరిగి ఇక్కడికి చేరుకుంది? ఇలా అత్యంత కీలకమైన వివరాలను పసిగట్టడంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ముందడుగు వేసినట్లు తెలుస్తోంది. సాక్షుల వాంగ్మూలాలు, నిందితులు చెప్పిన వివరాలు, సాంకేతిక ఆధారాలకు తోడు... ఇతర రాష్ట్రాలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన సమాచారంతో 'సిట్' పక్కాగా తీగలాగుతోంది. జగన్ హయాంలో లిక్కర్ మాఫియా రూ.3200 కోట్లు పోగేసుకున్నట్లు సిట్ నిర్ధారించింది. లిక్కర్ పాలసీ రూపకల్పన నుంచి ముడుపుల వసూళ్ల వరకూ జరిగిన అన్ని అక్రమాలనూ ఆధారాలతో సహా తేల్చిన సిట్ అధికారులు... అంతిమంగా డబ్బులు ఎక్కడికి చేరాయనే సమాచారం సేకరించడానికి

మిగతా 12వ పేజీలో...

రాష్ట్రంలో మరో కరోనా కేసు

2



65 ఏళ్ల వృద్ధుడికి పాజిటివ్ నిర్ధారణ

బాధితుడు కోనసీమ జిల్లా వాసి

సముచిత ప్రాధాన్యమిస్తే సరే..

కాదంటే కొత్త పార్టీ



తండ్రి కేసీఆర్‌తో తేల్చుకోవాలనుకుంటున్న కవిత

లేఖ లీకేజీపై ఆగ్రహంగా కేసీఆర్ తనయ

లీకువీరులెవరో తేలే వరకూ పార్టీకి దూరం

పార్టీ పెడితే తెలంగాణ జాగృతే? 13

టీమిండియా టెస్ట్ కొత్త కెప్టెన్ గిల్



ఎంపిక చేసిన బీసీసీఐ.. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు జట్టు ప్రకటన 11

స్వదేశాలకు పంపే సొమ్ముపై పన్ను 3.5%

రెమిటెన్స్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను కాస్త తగ్గించిన ట్రంప్

భారత సంతతి వారికి స్వల్ప ఊరట 2

అందాల పోటీల్లో వేశ్యలా..



మిల్లా మాగీ

నన్ను అలాగే చూసినట్లు అనిపించింది

పురుష స్పాన్సర్లతో కలిసి ఉండాలన్నారు

24 గంటల పాటు మేకప్‌లో ఉండాలని బాల్ గౌన్లు ధరించాలని ఒత్తిడి చేశారు 2

మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ ఆరోపణలు

పోటీ నుంచి తప్పుకొన్నట్లు ప్రకటన

స్వదేశాలకు పంపే సొమ్ముపై పన్ను 3.5 శాతానికి తగ్గింపు

» రెమిటెన్స్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను తగ్గించిన ట్రంప్ సర్కారు



వాషింగ్టన్, మే 24: విదేశీయులు అమెరికాలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసి స్వదేశాలకు పంపే సొమ్ము(రెమిటెన్సు)పై విధించిన పన్నులో ట్రంప్ సర్కారు స్వల్ప ఊరట నిచ్చింది. 'ఎక్సైజ్ ట్యాక్స్ ఆన్ రెమిటెన్స్ ట్రాన్స్‌ఫర్స్'గా పేర్కొంటున్న ఈ పన్నును తొలుత 5శాతంగా ప్రతిపాదించగా.. ఇప్పుడు 3.5 శాతానికి తగ్గించారు. అంటే ఉదాహరణకు రూ.లక్ష స్వదేశానికి పంపితే.. తొలి ప్రతిపాదన ప్రకారం రూ.5 వేలు పన్ను కింద చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడది రూ.3,500కు తగ్గింది. అమెరికా నుంచి విదేశాలకు సొమ్మును బదిలీ చేసే బ్యాంకులు, మనీ ట్రాన్స్‌ఫర్ సంస్థలే.. ఈ మేరకు పన్ను వసూలు చేసి, ప్రభుత్వానికి అందజేస్తాయి. 'వన్ బిగ్ బ్యూటిఫుల్ యాక్ట్' పేరిట రూపొందించిన ఈ పన్నుల చట్టం బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ కేవలం ఒక్క ఓటు మెజారిటీతో (అనుకూలంగా 215 ఓట్లు, వ్యతిరేకంగా 214 ఓట్లు) ఆమోదం తెలపడం గమనార్హం.

సామ్‌సంగ్‌పైనా దిగుమతి సుంకం: ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్, మే 24: అమెరికాలో అమ్మే ఐఫోన్లను ఇక్కడే తయారు చేయకుంటే వాటిపై 25% దిగుమతి సుంకం విధిస్తామని యాపిల్ కంపెనీని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇదేవిధంగా సామ్‌సంగ్‌ను కూడా హెచ్చరించారు. అమెరికాలో తన ఫోన్లను తయారు చేయకుంటే సామ్‌సంగ్ కూడా 25% దిగుమతి సుంకాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

మళ్లీ కరోనా కలకలం..కొత్తగా 257 కేసులు

న్యూఢిల్లీ, మే 24: ఢిల్లీతోపాటు మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ నెలలో కొత్త కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కొత్తగా ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లు వెలుగు చూశాయని ఇండియన్ సార్స్-కోవ్-2 జినోమిక్స్ కన్సార్టియం(ఐఎన్ఎస్ఏసీఓజీ) శుక్రవారం తెలిపింది. ఢిల్లీలో 23 మందికి కొవిడ్ సోకినట్లు తేలింది. ఇది ఇన్‌ఫ్లూయెంజా వంటి జ్వరం మాత్రమేనని ప్రజలు ఆందోళనకు గురి కావద్దని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి పంకజ్ సింగ్ చెప్పారు.

రాష్ట్రంలో మరో కరోనా కేసు

జీజీహెచ్ (కాకినాడ) మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా మళ్లీ కరవరపెడుతోంది. శనివారం కాకినాడ జీజీహెచ్‌లో ఒక కొవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ ఏడాది ఇదే మొదటి కేసు. కోనసీమ జిల్లా కె. గంగవరం మండలం సత్యవాడ గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధుడు జ్వరం, నిరంతరంగా ముక్కు కారడం సమస్యలతో బాధపడుతుండడంతో కుటుంబసభ్యులు శుక్రవారం రాత్రి ద్రాక్షారామంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వృద్ధుడికి కొవిడ్ పాజిటివ్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో కుటుంబసభ్యులు ఆ వృద్ధుడ్ని శనివారం జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారించారు. ప్రత్యేక కొవిడ్ వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

సుప్రీం కొలీజియం సభ్యురాలిగా జస్టిస్ నాగరత్న



న్యూఢిల్లీ, మే 24: సుప్రీంకోర్టు కొలీజియం సభ్యురాలిగా జస్టిస్ బి.వి.నాగరత్న నియమితులయ్యారు. ఈ నియామకం ఆదివారం నుంచి అమల్లోకి వస్తుంది. ఇంతవరకు కొలీజియంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ అభయ్ ఎస్ ఓకా పదవీ విరమణ చేయడంతో సీనియార్టీలో అయిదో స్థానంలో ఉన్న జస్టిస్ నాగరత్న నియమితులయ్యారు. ప్రస్తుతం కొలీజియంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రం నాథ్, జస్టిస్ కె.జి.మహేశ్వరి, జస్టిస్ నాగరత్న సభ్యులుగా ఉన్నారు. నూతన కొలీజియం ప్రథమ సమావేశం సోమవారం జరిగే అవకాశం ఉంది.

ఈపీఎఫ్‌పై 8.25% వడ్డీ రేటుకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ, మే 24: ఈపీఎఫ్‌పై 2024-25 ఆర్థిక సంవత్సరానికి 8.25 శాతం వడ్డీ రేటు ఇచ్చేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటునే కొనసాగించాలని ఫిబ్రవరి 28న ఈపీఎఫ్‌వో నిర్ణయించింది. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం.. వడ్డీ మొత్తాన్ని 7కోట్లకు పైగా ఈపీఎఫ్‌వో చందాదారుల ఖాతాల్లో జమచేయనున్నారు.

ఘనంగా మిస్ వరల్డ్ ఫ్యాషన్ ఫినాలే

» ఆసియా-ఓషియానా విజేతగా నందిని గుప్తా



హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ వేదికపై తెలంగాణ చేనేత వస్త్రాలు తళుక్కున మెరిశాయి. శనివారం ట్రైడెంట్ హోటల్‌లో జరిగిన వరల్డ్ ఫ్యాషన్ ఫినాలేలో ప్రపంచ సుందరి పోటీదారులంతా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన పోచంపల్లి, గద్వాల్ చేనేత వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. సంప్రదాయబద్ధమైన దుస్తుల్లో అలరించారు. అమెరికా, కరేబియన్ దేశాల సుందరీమణులు చేనేత వస్త్రాలు ధరించి.. యూరోప్, ఏషియా, ఓషియానా అందగత్తెలు గొల్లభామ చేనేత చీరలతో అలరించారు. మిస్ ఇండియా నందిని గుప్తా ఎరుపు రంగు పటోలా లెహంగాలో తళుక్కుమన్నారు. అనంతరం.. ప్రపంచ ప్రఖ్యాత డిజైనర్లు రూపొందించిన ఆధునిక ఫ్యాషన్ వస్త్రాలతో అందాల భామలు ర్యాంప్ వాక్ చేశారు. తెలంగాణ చేనేత వస్త్రాల కార్యక్రమానికి సంబంధించి.. ఏషియా-ఓషియానా విభాగంలో టాప్ మోడల్ ఫైనల్ టైటిల్‌ను నందినీ గుప్తా సాధించారు.

అందాల పోటీల్లో వేశ్యలా..: మిస్ ఇంగ్లండ్ మిల్లా

హైదరాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ సుందరి పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ సంచలన ఆరోపణలు చేశారు. మిస్ వరల్డ్ పోటీలు గతంలోలాగా కాకుండా భిన్నంగా ఉంటాయని అనుకున్నానని.. కానీ కోతుల ప్రదర్శనలా కూర్చోవాల్సి వచ్చిందన్నారు. పోటీలకు స్పాన్సర్ చేస్తున్న మధ్య వయసు పురుషులతో కలివిడిగా మెలగాలని, వారితో కూర్చొని మాట్లాడాలని పోటీల నిర్వాహకులు ఒత్తిడి తెచ్చారని.. తనను వేశ్యలా చూస్తున్నట్టు అనిపించిందని వ్యాఖ్యానించారు. అందుకే మిస్ వరల్డ్ పోటీ నుంచి తప్పుకొన్నానని పేర్కొన్నారు. బ్రిటన్‌కు చెందిన 'ది సన్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ ఆరోపణలు చేశారు. "నిజానికి నేను మంచి చేయాలని, మార్పు తీసుకురావాలని పోటీల్లో పాల్గొనడానికి వెళ్లాను. రొటీన్‌కు కాస్త భిన్నంగా ఉండాలనుకున్నాను. కానీ ఇక్కడ అలాంటిది జరగలేదు. మేం ప్రదర్శనలో కోతుల్లా కూర్చోవాల్సి వచ్చింది. ఈ పోటీ ఇంకా పాతకాలంలోనే ఉండిపోయింది. నైతికంగా ఇలాంటి వాటిలో నేను భాగస్వామ్యం కాలేను. నేను వినోదాన్ని పంచడానికి రాలేదు. పోటీదారులంతా 24 గంటల పాటు మేకప్‌లో ఉండాలని, రోజంతా బాల్ గౌన్‌లను ధరించే ఉండాలని నిర్వాహకులు చెప్పారు. ఉదయం అల్పాహారం సమయంలోనూ అలాగే ఉండాలన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు స్పాన్సర్ చేసిన మధ్య వయసు పురుషులకు కృతజ్ఞత చూపాలని, వారితో కలివిడిగా ఉండాలని చెప్పారు. ఒక్కో టేబుల్ వద్ద ఆరుగురు అతిథులతో ఇద్దరు చొప్పున పోటీదారులను కూర్చోబెట్టారు. గంటలకు గంటలు వారిని అలరిస్తూ కూర్చోవాలి. ముమ్మాటికీ అది తప్పుడు విధానం. నన్ను ఒక వేశ్యలా చూస్తున్నట్టు అనిపించింది." అని మాగీ పేర్కొన్నారు. కాగా, ఈ ఆరోపణలను మిస్ వరల్డ్ సంస్థ ఛైర్‌పర్సన్ జూలియా మోర్లే ఖండించారు. తన తల్లి ఆరోగ్యం బాగోలేదంటూ మాగీ పోటీల నుంచి విరమించుకున్నారని చెప్పారు.



నీతి ఆయోగ్‌పాలక మండలి 10వ భేటీలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీఎంలతో ప్రధాని మోదీ

కలిసి పనిచేద్దాం!

టీమిండియా స్ఫూర్తి చాటుదాం.. సాధ్యంకాని లక్ష్యమంటూ ఉండదు

» పెట్టుబడులకు పెద్దపీట వేయండి
» వికసిత భారత్ ప్రతి ఒక్కరి లక్ష్యం
» రాష్ట్రాల అభివృద్ధితోనే ఇది సాధ్యం
» నీతి ఆయోగ్ భేటీలో రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ, మే 24: "రండి.. కలిసి పనిచేద్దాం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీమిండియా' స్ఫూర్తితో పనిచేస్తే సాధ్యం కాని లక్ష్యమంటూ ఏమీ ఉండదు." అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. శనివారం ఢిల్లీలో ప్రధాని అధ్యక్షతన 10వ నీతి ఆయోగ్ పాలక సమావేశం జరిగింది. 'వికసిత్ భారత్ 2047 కోసం వికసిత రాష్ట్రాలు' అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో మరింత వేగం పుంజుకోవాల్సి ఉందన్నారు. "అభివృద్ధి పనుల వేగం మరింత పెరగాల్సి ఉంది. కేంద్రం, అన్ని రాష్ట్రాలు టీమిండియా స్ఫూర్తితో కలిసి పనిచేస్తే అసాధ్యమంటూ ఏమీ ఉండదు." అని వ్యాఖ్యానించారు. "వికసిత భారత్.. అనేది ప్రతి భారతీయుడి లక్ష్యం. ఈ క్రమంలో ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందినప్పుడే.. భారతదేశం అభివృద్ధి చెందుతుంది. ఇది 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్ష." అని ప్రధాని ఉద్ఘాటించారు. ప్రతి రాష్ట్రం, ప్రతి నగరం, ప్రతి నగరపాలక సంస్థ, ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనేది ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ లక్ష్యసాధనకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే 'వికసిత భారత్' కోసం 2047 వరకు వేచి చూడాల్సిన అవసరం ఉండదని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు, సౌకర్యాలు, మౌలిక వసతులతో ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రధాని సూచించారు. "ఒక రాష్ట్రం-ఒక ప్రపంచ గమ్యస్థానం.. స్ఫూర్తిని అందిపుచ్చుకుని అభివృద్ధి చేస్తే పొరుగున ఉన్న నగరాలు కూడా అభివృద్ధి చెందుతాయి." అని చెప్పారు. దేశంలో శరవేగంగా పట్టణీకరణ జరుగుతోందని, 'ఫ్యూచర్ రెడీ సిటీస్' దిశగా కలిసి పనిచేయాల్సి ఉందని తెలిపారు. వృద్ధి, సృజనాత్మకత, సుస్థిరత అభివృద్ధికి చోదక శక్తులని ప్రధాని చెప్పారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో మహిళల పాత్రను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పెట్టుబడులకు మార్గం సుగమం చేయాలని రాష్ట్రాలను ప్రధాని కోరారు. విధానపరమైన అడ్డంకులను తొలగించడం ద్వారా.. పెట్టుబడులకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మెరుగు పరిచేందుకు రెడ్ కార్పెట్ పరవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా విద్య, వ్యవసాయం, ప్రజారోగ్యంపై రాష్ట్రాలు ప్రధానంగా దృష్టిసారించాలని ప్రధాని సూచించారు. కాగా, 'ఆపరేషన్ సిందూర్' తర్వాత అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో ప్రధాని భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక శాఖ మంత్రులు, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆ సీఎంలు దూరం

ప్రధాని అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి పలువురు ముఖ్యమంత్రులు గైర్హాజరయ్యారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య.. బిజీగా ఉన్న కారణంగా హాజరుకాలేదు. అయితే, ఆయన తన సందేశాన్ని లిఖిత పూర్వకంగా పంపించారు. కేరళ సీఎం పినరయి విజయన్ కూడా హాజరుకాలేదు. తనబదులుగా రాష్ట్ర ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్‌ను పంపించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొనసాగుతున్న పుదుచ్చేరి సీఎం రంగస్వామి, బిహార్ సీఎం నీతీశ్‌లు గైర్హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమత కూడా ఈ సమావేశానికి హాజరుకాలేదు.

ఇదో.. వంచన: కాంగ్రెస్

నీతి ఆయోగ్ పాలకమండలిపై కాంగ్రెస్ పార్టీ నిశిత విమర్శలు చేసింది. దీనిని 'అయోగ్యమండలి'గా అభివర్ణించింది. అంతేకాదు.. ఈ సమావేశాన్ని 'వంచన, దారిమళ్లింపు' భేటీగా దుయ్యబట్టింది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. "వికసిత భారత్ కోసం ప్రధాని అధ్యక్షతన భేటీ అయ్యారు. కానీ, అధికారంలో ఉన్నవారే తమ మాటలు, చేతల ద్వారా సామాజిక సామరస్యాన్ని ధ్వంసం చేస్తుంటే.. వికసిత భారత్ ఎలా సాధ్యమవుతుంది?." అని జైరాం రమేశ్ 'ఎక్స్'లో ప్రశ్నించారు. "కొందరి దగ్గరే సంపద పోగుపడుతోంది. ఆర్థిక అసమానతలు మరింత పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో వికసిత భారత్ సాధ్యమేనా?" అని నిలదీశారు. "నేడు సమావేశమైన నీతి ఆయోగ్ మండలి.. ఓ అయోగ్య మండలి" అని జైరాం వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ పతనానికి జైరాం చాలు: బీజేపీ

నీతి ఆయోగ్ భేటీపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. టీమిండియా స్ఫూర్తిని చాటేలా నిర్వహించిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలోనూ ఆయన తప్పులు వెతకడం, వివాదాలు సృష్టించడం దారుణమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ షహన్వాజ్ హుస్సేన్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ పతనానికి జైరాం ఒక్కరు చాలని వ్యాఖ్యానించారు. కాగా, పంజాబ్ సీఎం భగవంత్ మాట్లాడుతూ.. హరియాణాతో జల వివాదాన్ని ప్రస్తావించారు. భాక్రా-నంగల్ డ్యామ్ నుంచి నీటిని ఇచ్చేందుకు అసలు తమ వద్ద నీరు ఉంటేనే కదా? అని ప్రశ్నించారు.

పన్నులో వాటా 50 శాతం: స్టాలిన్

నీతి ఆయోగ్ పాలక మండలి భేటీలో పాల్గొన్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. రాష్ట్రాలకు ఇచ్చే కేంద్ర పన్నుల వాటాలపై ప్రశ్నించారు. "చట్టబద్ధంగా రాష్ట్రాలకు రావాల్సిన నిధుల కోసం పోరాటం చేయాల్సి రావడం, వ్యాజ్యాలకు దిగడం, ఏం బాగోలేదు. భారత దేశం వంటి సమాఖ్య ప్రజాస్వామ్యంలో రాష్ట్రాలు ఈ విధంగా దేబిరించాలా?. ఇలా చేయడం వల్ల రాష్ట్రాలే కాదు.. దేశ అభివృద్ధికి కూడా విఘాతం ఏర్పడుతుంది' అని వ్యాఖ్యానించారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 50% కేటాయించాలని డిమాండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన 41% మేరకైనా పన్నులు తమకు తిరిగి ఇవ్వడం లేదని.. కేవలం 33.16 శాతం మేరకే విదిలిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. "ఒక వైపు రాష్ట్రానికి ఇవ్వాల్సిన పన్నుల వాటాల్లో కోత పెడుతున్నారు. మరోవైపు.. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రాల వాటాను భారీగా పెంచుతున్నారు. ఇది రాష్ట్రాలపై మోపుతున్న అదనపు భారం కాదా?!" అని స్టాలిన్ ప్రశ్నించారు.

లోకం తీరు




హోటళ్లు తమ అతిథుల గోప్యతను కాపాడాలి

వివాహేతర సంబంధం కేసులో సీసీ పుటేజీ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించిన కేసులో ఢిల్లీకోర్టు

న్యూఢిల్లీ, మే 24: ఒక వివాహేతర సంబంధం కేసులో హోటల్ సీసీటీవీ ఫుటేజీ కోసం చేసిన అభ్యర్థనను ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. హోటల్లో ఉన్నట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న జంటకు గోప్యతా హక్కు ఉందని నొక్కి చెప్పింది. ఈ మేరకు ఇద్దరు ఆర్మీ మేజర్ అధికారుల కేసులో తీర్పు వెలువరించింది. తన భార్య మరో ఆర్మీ మేజర్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉందని ఆరోపిస్తూ, ఆ ఇద్దరు హోటల్ గదిలో ఉన్నప్పటి సీసీటీవీ ఫుటేజీని ఇవ్వాలంటూ సైన్యంలోని ఓ మేజర్, పిటిషన్ దాఖలు చేశారు. ఈ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. తమ అతిథుల గోప్యతను హోటళ్లు కాపాడాలని సివిల్ జడ్జి జస్టిస్ వైభవ్ ప్రతాప్ సింగ్ పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న జంటకు హోటల్లో 'ప్రైవసీ హక్కు' ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. "ఇలాంటి ప్రైవేటు సమాచారం సదరు వ్యక్తుల అనుమతి లేకుండా విడుదల చేయడం వారి గోప్యత, సహజ న్యాయ హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది. వారి ప్రతిష్ఠకు భంగకరం కూడా" అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ప్రైవేటు వివాదాలకు సంబంధించి న్యాయస్థానాలు దర్యాప్తు సంస్థలు కావు అని, అంతర్గత విచారణలో సాక్షాలను సేకరించే ఆధారంగానూ కోర్టులను భావించొద్దని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా అడల్టరీపై 2018లో సుప్రీంకోర్టు వెలువరించిన కేసును ఉత్తర్వుల్లో కోర్టు ఉటంకించింది. ఒక వ్యక్తి, మరొక వ్యక్తి భార్య ప్రేమను 'దొంగిలించవచ్చు' అనే భావనను సుప్రీంకోర్టు తిరస్కరించిందని గుర్తుచేశారు. ఫిర్యాదుదారుడు ఆర్మీ చట్టం (1950), అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం పరిష్కారం పొందాలని సూచించారు.

'సింధు' స్ఫూర్తికి పాక్ తూట్లు!

» ఐక్యరాజసమితిలో గర్జించిన భారత్



యునైటెడ్‌నేషన్స్, మే 24: దాయాది దేశం పాకిస్థాన్ కుటిలత్వంపై ఐక్యరాజ్యసమితి(ఐరాస)లో భారత్ గర్జించింది. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంపై పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టింది. "65 ఏళ్ల కిందట ఒక మంచి సదుద్దేశంతో, చిత్తశుద్ధితో సింధు జలాల ఒప్పందం చేసుకున్నాం." అని వెల్లడించిన భారత్.. మూడు యుద్ధాలు చేయడం ద్వారా, వేలాది సార్లు ఉగ్రమూకలను భారత్‌పై ఉసిగొల్పడం ద్వారా సింధు జలాల స్ఫూర్తిని పాక్ ఉల్లంఘించిందని స్పష్టం చేసింది. "సింధు జలాలపై పాక్ ప్రతినిధులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎగువ నదీజలాల దేశంగా ఉన్న భారత్.. సింధు విషయంలో ఎప్పుడూ బాధ్యతగానే వ్యవహరించింది. అసలు ఈ ఒప్పందంలోని ప్రవేశిక.. 'సద్భావన, స్నేహస్ఫూర్తి'ని చాటుతుంది. కానీ, ఈ స్ఫూర్తిని పాక్ మంటగలిపింది." అని ఐరాసలో శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ నిప్పులు చెరిగారు. సింధు జలాల ఒప్పందాన్ని దాయాది దేశమే అన్ని రూపాల్లోనూ ఉల్లంఘిస్తోందని ఆయన తేల్చి చెప్పారు. "ఉగ్రదాడుల కారణంగా గత నాలుగు దశాబ్దాల్లో 20 వేల మందికిపైగా భారత పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల పహల్గాంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని అత్యంత దారుణానికి ఒడిగట్టారు. అయినా.. భారత్ అసాధారణ సహనాన్ని, ఉదారతను చాటుకుంది. పాక్ ప్రాయోజిత ఉగ్రవాదం.. భారత్‌లోని పౌరుల జీవితాలను, మత సామరస్యాన్ని, ఆర్థిక స్థిరత్వాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నిస్తోంది." అని హరీశ్ చెప్పారు.

కశ్మీర్‌లో రాహుల్ పర్యటన

పాకిస్థాన్ దాడుల బాధిత కుటుంబాలకు భరోసా



పాకిస్థాన్ షెల్లింగ్‌లో దెబ్బతిన్న ఇల్లును పరిశీలిస్తున్న రాహుల్

న్యూఢిల్లీ, మే 24: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో పర్యటించారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ బలగాలు చేసిన షెల్లింగ్ దాడుల ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఏ మూల చూసినా ధ్వంసమైన ఇళ్లలు, తడిబారిన కళ్లు, ప్రియమైన వారిని కోల్పోయిన బాధాతప్త హృదయాలే కనిపించాయని పేర్కొన్నారు. బాధితుల ఆందోళనలు, సమస్యలను జాతీయ స్థాయిలో లేవనెత్తుతానని వారికి భరోసా ఇచ్చారు. శనివారం ఉదయం ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్న రాహుల్ గాంధీ.. ఈనెల 8, 10వ తేదీల మధ్య పాక్ జరిపిన దాడుల్లో దెబ్బతిన్న ఇంటింటికీ తిరిగారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. షెల్లింగ్‌లో గాయపడిన వారిని ఆస్పత్రుల్లో పరామర్శించారు. స్థానికంగా ఉన్న ఒక పాఠశాలను కూడా సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు.

తడిబారిన కళ్లు... బాధాకర స్టోరీలు

బాధిత కుటుంబాలను కలిసిన అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. 'ఇది ఒక పెద్ద విషాదం. చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. నష్టం కూడా భారీగా జరిగింది. ఈ అంశాన్ని జాతీయ స్థాయిలో లేవనెత్తాలని వారు కోరారు. నేను ఆ పని చేస్తాను' అని పేర్కొన్నారు. ఈ దేశభక్తి కుటుంబాలు ప్రతిసారీ ధైర్యం, గౌరవంతో యుద్ధ భారాన్ని మోస్తాయని, వారి ధైర్యానికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ బలగాల ఆర్టిలరీ, మోర్టార్ షెల్లింగ్, క్షిపణులు, డ్రోన్ దాడుల్లో పూంచ్ సెక్టార్ ఎక్కువగా ప్రభావితమైంది. మొత్తం 28 మంది మరణించగా, పూంచ్ జిల్లాలోనే 13 మంది మృతిచెందారు. జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా 70 మందికి పైగా గాయపడ్డారు. కాగా, రాహుల్ గాంధీ అంతకుముందు పహల్గాం దాడి తర్వాత ఏప్రిల్ 25న శ్రీనగర్‌లో పర్యటించారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలోని ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌ను రాహుల్ గాంధీ శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

పరువునష్టం కేసులో.. రాహుల్ గాంధీకి నాన్-బెయిలబుల్ వారెంట్

» జారీ చేసిన ఝార్ఖండ్ కోర్టు

రాంచీ, మే 24: లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఝార్ఖండ్‌లోని ప్రజాప్రతినిధుల(ఎంపీ, ఎమ్మెల్యే) కేసుల ప్రత్యేక కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. 2018లో ఝార్ఖండ్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సందర్భంగా రాహుల్‌గాంధీ అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు(ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి) అమిత్‌షాపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "హత్య కేసులో ఉన్నవారు కూడా బీజేపీ అధ్యక్షుడు కావొచ్చు" అని వ్యాఖ్యానించారు. దీనిపై ఝార్ఖండ్ బీజేపీ నేత ప్రతాప్ కతియార్ 2018 జూలై 9న చాయ్‌బాసాలోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్(సీజేఎం) కోర్టులో పరువునష్టం దావా వేశారు. 2020లో ఝార్ఖండ్ హైకోర్టు ఈ కేసును రాంచీలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీచేసింది. కేసు విచారణను ప్రారంభించిన ప్రజాప్రతినిధుల కోర్టు.. రాహుల్‌గాంధీకి సమన్లు జారీ చేసినా.. ఆయన విచారణకు హాజరవ్వకపోవడంతో తొలుత బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. దీనిపై రాహుల్ ఝార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ ఏడాది మార్చి 20న పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో.. ప్రజాప్రతినిధుల కోర్టు తాజాగా నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. వచ్చేనెల 26న జరిగే తదుపరి విచారణకు ప్రత్యక్షంగా హాజరుకావాలని రాహుల్ గాంధీని ఆదేశించింది.

భిన్న ధ్రువాలు ఒకే జట్టులో

» సౌదీ వెళ్లిన ఎంపీల బృందంలో అసద్, దూబే
» ఇది ప్రజాస్వామ్య విశిష్టత అన్న నిశికాంత్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



ఒవైసీతో బహ్రెయిన్‌లోని తెలుగు కళా సమితి అధ్యక్షుడు జగదీశ్

రాజకీయంగా భిన్నమైన అభిప్రాయాలను కలిగిన ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ నేత నిశికాంత్ దూబేలు ఒక అంశంలో కలిసి పనిచేయాల్సి రావడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. భిన్న ధ్రువాలుగా ఉండే ఈ ఎంపీలు పాకిస్తాన్ ఉగ్రవాద ఉన్మాదాన్ని ఎండగట్టేందుకు బయలుదేరిన జట్టులో ఉండటం ఆసక్తిని రేపుతోంది. పాక్ దుర్మార్గాలను వివరించేందుకు సౌదీ అరేబియాతో పాటు కువైట్, బహ్రెయిన్ దేశాల పర్యటనకు ఒడిశా బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలో వచ్చిన ఏడుగురు సభ్యుల బృందం శనివారం బహ్రెయిన్‌కు చేరుకుంది. ఇందులో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేలు ఉన్నారు. తాను, ఒవైసీ ఒకే విధానాన్ని అంతర్జాతీయంగా చెప్పడానికి ఉద్దేశించిన బృందంలో సహచరులు కావడం ప్రజాస్వామ్య విశిష్టత అని దూబే అన్నారు. కేంద్ర మాజీ మంత్రి గులాం నబీ ఆజాద్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగాలు కూడా ఈ బృందంలో ఉన్నారు. బహ్రెయిన్‌లో రెండు రోజుల పాటు సమావేశమైన అనంతరం వీరు కువైట్ వెళతారు. అక్కడి నుండి 27న రాత్రి సౌదీ అరేబియాకు, అక్కడి నుండి అల్జీరియాకు వెళతారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ తనయ సుప్రియా సూలే నేతృత్వంలోని బృందం శనివారం రాత్రి ఖతర్ చేరుకుంది. ఈ బృందంలో తెలుగుదేశం ఎంపీ లావు కృష్ణదేవరాయలతో పాటు విదేశీ మాజీ మంత్రులు మురళీధరన్, మనీశ్ తివారీ, తెలుగువారైన మాజీ దౌత్యవేత్త సయ్యద్ అక్బరుద్దీన్ ఉన్నారు. ఖతర్ అనంతరం ఈజిప్టు, ఇథియోపియా, దక్షిణాఫ్రికాలో ఈ బృందం పర్యటిస్తుంది. మహారాష్ట్ర మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండే తనయుడు శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని బృందం యూఏఈ పర్యటనను ముగించుకుని శనివారం తిరిగి వెళ్లింది. ఇదిలా ఉండగా, ఉగ్రవాదం నుంచి తనను తాను కాపాడుకునే హక్కు భారతదేశానికి ఉందని జర్మనీ గుర్తించినట్టు విదేశాంగ మంత్రి జైశంకర్ చెప్పారు. జర్మనీ పర్యటనలో ఉన్న ఆయన శనివారం బెర్లిన్‌లోని విదేశీ వ్యవహారాల జర్మన్ కౌన్సిల్‌లో ముఖాముఖిలో పాల్గొన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్, అంతర్జాతీయ సమాజం నుంచి ప్రత్యేకించి జర్మనీ నుంచి భారత్‌కు లభిస్తున్న బలమైన మద్దతును ఈ సందర్భంగా జైశంకర్ ప్రస్తావించారు.

విమానాల టేకాఫ్ సమయంలో ఫొటోలు, వీడియోలపై నిషేధం

» పౌర విమాన సంస్థలకు డీజీసీఏ ఉత్తర్వు

న్యూఢిల్లీ, మే 24: పలు విమానాశ్రయాల్లో ఫొటోలు, వీడియోలు తీయడాన్ని నిషేధిస్తూ పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) ఉత్తర్వులు జారీ చేసింది. కిటికీ షేడ్స్ మూసే ఉంచాలంటూ పేర్కొంది. రక్షణ శాఖ విమానాశ్రాయాల నుంచి... ప్రధానంగా పశ్చిమ సరిహద్దుల్లోని విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించే క్రమంలో ఈ నిబంధనలను తూచాతప్పకుండా అమలు చేయాలని స్పష్టం చేసింది. విమానం బయలుదేరి, 10 వేల అడుగుల ఎత్తుకు చేరే వరకూ ప్రయాణికులు తమ కిటికీ షేడ్స్ మూసి ఉంచాలని పేర్కొంది. అలాగే విమానం దిగేక్రమంలో 10 వేల అడుగుల ఎత్తు నుంచి విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యి ప్రయాణికుల టెర్మినల్‌ను చేరే వరకూ 'షేడ్స్' తెరవకూడదని స్పష్టం చేసింది. అలాగే టెర్మినల్‌లో ఉన్నప్పుడు, రన్‌వైపై ట్యాక్సీలో ప్రయాణిస్తున్నప్పుడు, విమానం ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ఫొటోలు, వీడియోలు తీయకూడదని పేర్కొంది.

ప్రణాళికబద్ధంగా తిరుమల అభివృద్ధి

» టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల, మే24(ఆంధ్రజ్యోతి): తిరుమలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం అనంతరం ఆయన అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి మీడియాతో మాట్లాడారు. తిరుమలలో భవనాలు, రోడ్లు వంటి ఏ నిర్మాణాలు చేపట్టినా టౌన్‌ప్లానింగ్ ప్రకారమే జరగాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టీటీడీలో టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు ప్రభుత్వ అనుమతి కూడా వచ్చిందని, త్వరలో డైరెక్టర్, డిప్యూటీ సిటీప్లానర్, అసోసియేట్ ప్లానర్ వంటి ఆరు పోస్టులను భర్తీ చేస్తామన్నారు. దీంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఆర్కిటెక్చర్ కన్సల్టెన్సీల ద్వారా టీటీడీలోని అన్ని ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గోమాతసేవను ప్రారంభిస్తామని, తిరుమలలోని బిగ్, జనతా క్యాంటీన్లను బ్రాండెడ్ సంస్థలకు కేటాయించేలా త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. వాట్సాప్ ఇ-గవర్నెన్స్‌లో ఇప్పటికే 14 టీటీడీ సేవలను జత చేశామని ఈవో తెలిపారు.

చెన్నైవాసిని నమాజ్ చేసేందుకు కొందరు ప్రోత్సహించారు

తిరుమలలో నమాజ్ చేసేందుకు అన్యమతానికి చెందిన వ్యక్తిని కొందరు ప్రోత్సహించినట్టు పోలీసుల విచారణలో తెలిసిందని ఈవో శ్యామలరావు వెల్లడించారు. ఎండోమెంట్ యాక్ట్‌ప్రకారం ఇలాంటివి చేయకూడదనే నిబంధన ఉందన్నారు. దీనిపై న్యాయపరమైన సలహాలు తీసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. అన్యమతానికి చెందిన ఆ వ్యక్తిని కొందరు మిస్‌లీడ్ చేశారని, నమాజ్ చేస్తుండగా వీడియో తీసి దాని ద్వారా లబ్ధి పొందవచ్చని అలా వ్యవహరించారన్నారు. వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక, మద్యం సేవించి తిరుమలకు వచ్చిన ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల వ్యవహారంపై స్పందిస్తూ, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా అలిపిరిలో నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. అలిపిరి చెక్‌పాయింట్‌లో ఎప్పుడో ఏర్పాటు చేసిన స్కానర్లు, కంప్యూటర్లు ఉన్నాయని, వాటిని మార్చడంతో పాటు కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందన్నారు.

ఆరోగ్యవరప్రసాదినికి రూ.10 లక్షల విరాళం

టీటీడీ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందాయి. బెంగళూరుకు చెందిన అలెన్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ వైస్ ప్రెసిడెంట్ మహేష్ యాదవ్ ఇందుకు సంబంధించిన డీడీని తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, మే 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. వారాంతం కావడంతో శుక్రవారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. శనివారం కూడా అదే తరహాలో తిరుమల క్షేత్రంలో రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్కులోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కిలోమీటరు మేర శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది.

ఇతర బోర్డుల ఇంటర్ విద్యార్థులు 30లోపు మార్కులను అప్‌లోడ్ చేయాలి

» ఏపీ ఈఏపీసెట్ చైర్మన్ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, మే 24 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఏపీవోఎస్ఎస్, ఎన్ఐవోఎస్, డిప్లొమా, ఇతర బోర్డులకు చెందిన 10+2 విద్యార్థులు తమ మార్కులను ఈఏపీసెట్ వెబ్‌సైట్ ద్వారా డిక్లరేషన్ ఫారంలో ఈ నెల 30వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని సెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ర్యాంకుల ప్రక్రియలో మార్కులకు 25శాతం వెయిటేజీ ఉన్నందున తప్పనిసరిగా మార్కులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఏపీఈఏపీసెట్ ఇంజనీరింగ్ విభాగం ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని, 28,075 మంది విద్యార్థులకు 26,608 మంది హాజరయ్యారని, 94.77 శాతం హాజరు నమోదైందని తెలిపారు.

అధైర్యం వద్దు అండగా ఉంటాం

» బర్లీ పొగాకు రైతులకు మంత్రి అచ్చెన్నాయుడు హామీ



సూరవరపుపల్లె గ్రామంలో పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్న

బాపట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): "అన్నదాతలూ అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దు...ప్రభుత్వం అండగా ఉంటుంది. పొగాకు కంపెనీలు కథలు చెప్పడం మాని బర్లీ పొగాకు కొనేందుకు బాధ్యత తీసుకోవాల్సిందే. ఈ విషయంపై ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నారు. కొనుగోళ్ల విషయంలో క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపెట్టాల్సిందే" అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బాపట్ల జిల్లా మార్టూరులోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో శనివారం బర్లీ పొగాకు రైతులతో నిర్వహించిన ముఖాముఖికి ఆయన హాజరయ్యారు. రైతులు తమ ఆవేదనను మంత్రి ముందుంచారు. కంపెనీలు తమను సాగు చేసేలా ప్రేరేపించి ఇప్పుడు వంచించాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఇప్పుడు డిమాండ్ లేకపోతే పొగాకును ప్రాసెసింగ్ చేసి నిల్వ ఉంచుకోవాలని కంపెనీలకు సూచించారు. ప్రాసెసింగ్‌కు ఖర్చు తామే భరిస్తామన్నారు. బర్లీలో రెండు రకాలుగా కొనుగోళ్లు జరగాలని...అందులో లో గ్రేడ్ రకానికి రూ.5,000 నుంచి రూ.6,000 వరకు, మీడియం, హై క్వాలిటీ రకాలకు రూ.12,000లు ధర క్వింటాలుకు చెల్లించాల్సిందేనని కంపెనీలకు తేల్చిచెప్పారు.

వాట్సాప్‌లో రైస్‌కార్డు సేవలు

» కార్డులో మార్పుచేర్పులకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు

» మొత్తం ఎనిమిది రకాల సేవలు అందుబాటులోకి

అమరావతి, మే 24 (ఆంధ్రజ్యోతి): రైస్ కార్డులో మార్పుచేర్పులు, ఇతర సేవలకు దరఖాస్తు చేసుకునేందుకు మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) సేవలు శనివారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఇందులో ఎనిమిది రకాల సేవలు ఉన్నప్పటికీ, ప్రధానంగా కొత్త రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే ఆప్షన్ లేకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇలా దరఖాస్తు చేయాలి...

మొబైల్ ఫోనులో 'మనమిత్ర' వాట్సాప్ చాట్‌లోకి వెళ్లి 'హాయ్' అని టైప్ చేస్తే 'సేవను ఎంచుకోండి' అని వస్తుంది. దానిని క్లిక్ చేస్తే 'పౌర సేవను ఎంచుకోండి' అనే బాక్స్‌లో 'సివిల్ సప్లయిస్ సేవలు'పై క్లిక్ చేయాలి. 'దీపం' స్థితి, రైస్ డ్రా స్థితి, రైస్ ఈకేవైసీ స్థితి, రైస్ కార్డు సమర్పణ, రైస్ కార్డులో సభ్యులను జోడించడం, రైస్ కార్డులో సభ్యులను తొలగించడం, తప్పుగా జోడించిన ఆధార్ సీడింగ్ సవరణ, రేషన్ కార్డ్ విభజన దరఖాస్తు.. అనే 8 రకాల సేవలు కనిపిస్తాయి. వీటిలో మీకు అవసరమైన సేవను ఎంపిక చేసుకుని.. వివరాలను పూరించి, వాట్సాప్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చు.

జాప్యాన్ని నివారించడానికే...

కొత్త రైస్ కార్డులతో పాటు ఇతర సేవల కోసం ఈ నెల 7నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే భారీసంఖ్యలో దరఖాస్తులు వచ్చిపడుతుండటంతో ఒత్తిడి పెరిగి సర్వర్లు డౌన్ అయిపోవడం, ఇతర సాంకేతిక సమస్యలతో వాటిని ఆన్‌లైన్ చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. దీంతో దరఖాస్తుదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో రైస్ కార్డు దరఖాస్తులు సమర్పించడానికి వీలుగా 'మనమిత్ర' (వాట్సాప్ గవర్నెన్స్) సేవలను ఈ నెల 15 నుంచే అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాంకేతికపరమైన కారణాలతో ఈ సేవలను ప్రకటించిన సమయానికి అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. ఎట్టకేలకు శనివారం నుంచి వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా దరఖాస్తుదారులకు కొంత వెసులుబాటు కల్పించారు. అయితే ఇందులో కొత్త రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడంతో ఇలాంటి వారంతా తప్పనిసరిగా సచివాలయాలకు వెళ్లాల్సిందే. కాగా, ఈ నెల 7 నుంచి 24 వరకు మొత్తం 7,21,827 దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

అన్నాచెల్లెళ్ల వార్!

కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే నెల 4వ తేదీన వెన్నుపోటు దినంగా పాటించబోతున్నట్టు జగన్‌రెడ్డి ప్రకటించారు. గత ఏడాది జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ప్రజలు ఆయనను 11 సీట్లకే పరిమితం చేస్తూ తీర్పు ఇచ్చారు. ఫలితాలు వెల్లడైన రోజునే ఆయన ఎంచుకున్నారంటే ప్రజలు తనకు వెన్నుపోటు పొడిచారని జగన్ భావిస్తున్నారేమో తెలియదు! బటన్లు నొక్కి డబ్బులు పంచినా ప్రజలు తనను ఓడించడం అంటే వెన్నుపోటు పొడవడమేనని ఆయన అనుకుంటున్నట్టుగా ఉంది. ప్రజలు ఆయనకు వెన్నుపోటు పొడిచారా? ఆయనే ప్రజలకు వెన్నుపోటు పొడిచారా? అన్నది సుస్పష్టం. రాజశేఖరరెడ్డి వేరు.. జగన్మోహన్‌రెడ్డి వేరు అని ప్రజలు గ్రహించారు కనుకనే ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. జగన్‌రెడ్డి నిర్వహించాల్సింది వెన్నుపోటు దినాలు కాదు. ప్రాయశ్చిత్త దినాలు జరుపుకోవాలి.

అనగనగా రాజకీయాల్లో ఇద్దరు అన్నలు.. వారికి చెరో చెల్లి ఉన్నారు. ఆ ఇద్దరు అన్నల తండ్రులు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. షరా మామూలే.. తండ్రుల అధికారాన్ని అడ్డు పెట్టుకొని సంపదను పోగేసుకున్నారు. సహజంగానే సంపద కోసం అన్నాచెల్లెళ్ల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. రక్తం పంచుకు పుట్టిన వాళ్లు బద్ధశత్రువులయ్యారు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. తెలుగునాట వర్తమాన రాజకీయాలలో ఇదొక రసవత్తర ఘట్టం. ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంలో చెలరేగిన కలహాలను ఇప్పటిదాకా చూశాం.. చూస్తున్నాం. తెలంగాణ రాజకీయాలలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంలో అదే సీన్ రిపీట్ కాబోతున్నది. తండ్రుల వల్ల సంక్రమించిన అధికారం, సంపదలో కుమార్తెలకు వాటా దక్కకపోవడం ఆ చెల్లెళ్ల ఆగ్రహానికి కారణమైంది. ఎన్టీఆర్ హయాంలో ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది. తండ్రులు అధికారంలో ఉన్నప్పుడు అన్నల చేతికి రాఖీలు కట్టి తమ మధ్య ఉన్న రక్త సంబంధాన్ని చాటి చెప్పినవాళ్లే ఇప్పుడు ఆ అన్నల ద్రోహాన్ని బయటపెడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆస్తుల పంపకంలో తనకు అన్యాయం చేస్తున్నారనీ, కోరుకున్న రాజ్యసభ సీటు కూడా ఇవ్వకుండా నిరాదరణకు గురిచేశారంటూ షర్మిల తిరుగుబాటు చేయడం చూశాం. ఈ ఆస్తుల గొడవలో తల్లి విజయలక్ష్మి కుమార్తె షర్మిలకు అండగా నిలవడం, వివాదాలు న్యాయస్థానాలకు చేరడం చూశాం. ఇప్పుడు తెలంగాణలో కేసీఆర్ కుటుంబంలో కూడా అంతఃపుర కలహాలు వీధికెక్కాయి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ వ్యవహారాల్లో అన్న కేటీఆర్‌కు ఇచ్చిన ప్రాధాన్యం తనకు ఇవ్వడంలేదన్న అసంతృప్తి చెల్లి కవితలో ఎప్పటి నుంచో ఉంది. పుండు మీద కారం రాసినట్టుగా కేటీఆర్‌కు తోడు, అప్పటి ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు పార్టీలో ప్రాధాన్యం పెరిగిపోవడాన్ని కవిత జీర్ణించుకోలేక పోయారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఒక దశలో కేసీఆర్ తలపోశారు. రేపో మాపో తాను ముఖ్యమంత్రిని కాబోతున్నానని కేటీఆర్ కూడా చెప్పుకొన్నారు. దీంతో అన్నపై పైచేయి సాధించడం ఎలా? అని కవిత అంతర్మథనం చెందారు. భారత రాష్ట్ర సమితిలో కీలక నాయకుడిగా ఉన్న హరీశ్‌రావును తనతో చేయి కలపవలసిందిగా కవిత ఒక సందర్భంలో కోరారు. అయితే ఈ విజ్ఞప్తిని అప్పట్లోనే హరీశ్‌రావు సున్నితంగా తిరస్కరించారు. మేనమామ కేసీఆర్‌ను ధిక్కరించే సాహసాన్ని హరీశ్‌రావు చేయలేరు అని పలు సందర్భాలలో రుజువైంది. తాజాగా పార్టీలో తన ప్రాధాన్యం తగ్గిపోయి కేటీఆర్ అంతా తానై వ్యవహరించడం హరీశ్‌రావుకు రుచించలేదు. 'కిం కర్తవ్యం' ఏమిటా అని ఆయన కొన్ని రోజులుగా మథనపడుతున్నారు. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకత్వం నుంచి హరీశ్‌రావుకు ఆఫర్లు వచ్చాయి. అయినా ఆయన తొందరపడకుండా మౌనాన్ని ఆశ్రయించారు. కేసీఆర్ అపాయింట్‌మెంట్ కూడా హరీశ్‌రావుకు లభించని పరిస్థితి. దీంతో ఆయన బీఆర్‌ఎస్‌ను వీడతారని, బీజేపీ తీర్థం పుచ్చుకుంటారని ప్రచారం జరిగింది. ఫలితంగా కేటీఆర్ ఒక మెట్టు దిగి హరీశ్‌రావు ఇంటికి వెళ్లి రాజీ కుదుర్చుకున్నారు. బావ–బావమరుదుల మధ్య తాత్కాలికంగా సఖ్యత కుదిరింది. ఎర్రవల్లి ఫాంహౌజ్ గేట్లు కూడా హరీశ్‌రావుకు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో తండ్రి కేసీఆర్‌కు తనయ కవిత రాసిన లేఖ లీకై కలకలం సృష్టిస్తోంది. శుక్రవారం రాత్రి అమెరికా నుంచి తిరిగి వచ్చిన కవిత ఆ లేఖ తానే రాశానని ధ్రువీకరించారు. తాను రాసిన లేఖ లీకైందంటే పార్టీలో పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చునని అన్నారు. తన తండ్రి దేవుడు అని, అయితే ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. కవిత చెబుతున్న ఆ దెయ్యాలు ఎవరో ఇప్పుడు తేలాల్సి ఉంది. కేసీఆర్‌ను అంటిపెట్టుకొని ఉంటున్నవారు కేటీఆర్, సంతోష్ కుమార్ మాత్రమే. ఈ ఇరువురు కాకుండా కొంత మంది ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో అంటకాగుతూనే ఉంటారు. అయితే రక్తం పంచుకు పుట్టిన కవిత కంటే వారి మాటలకు కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తారని భావించలేం. కేసీఆర్‌కు సన్నిహితంగా మెలిగిన బయటివారు అనతికాలంలోనే ఆయనకు దూరమవడం పరిపాటే. ఈ కారణంగా కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలు కేటీఆర్, సంతోష్‌కుమార్ అని భావించాల్సి ఉంటుంది. అధికారంలో ఉన్నప్పుడు.. ముఖ్యంగా చివరి రెండు సంవత్సరాలు పార్టీలో, ప్రభుత్వంలో అంతా తానే అన్నట్టుగా సంతోష్‌కుమార్ వ్యవహరించారు. ఈ పరిణామాన్ని ఒక దశలో కేటీఆర్ కూడా జీర్ణించుకోలేకపోయారు. రాజీ పడటానికి అలవాటుపడిన హరీశ్‌రావు ఈ పరిణామాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అయితే కవిత మాత్రం అప్పట్లోనే తన అసంతృప్తిని దాచుకోలేకపోయారు. ఈ దశలో ఎన్నికలు జరగడం, బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోవడం జరిగింది. ఆ తర్వాత అటు తండ్రి వద్ద, ఇటు పార్టీలో కేటీఆర్ ప్రాధాన్యం పెరిగింది. సరిగ్గా ఈ దశలోనే ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కవిత పేరు వెల్లడి కావడం, ఈడీ అధికారులు ఆమెను అరెస్టు చేసి జైలుకు పంపడం జరిగిపోయింది. కుమార్తెను జైలు నుంచి బెయిలుపై విడిపించుకోవడానికి అప్పట్లో కేసీఆర్ చేయని ప్రయత్నం లేదు. కేటీఆర్, హరీశ్‌రావులను ఢిల్లీలో మకాం చేయించి భారతీయ జనతా పార్టీ పెద్దల వద్దకు రాయబారాలు నెరిపించారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి సిద్ధమని కూడా ఆఫర్లు ఇచ్చారు. అయితే బీజేపీ పెద్దల నుంచి సానుకూల స్పందన రాలేదు. తెలంగాణ ఏర్పాటు సమయంలో అప్పటి టీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని నమ్మబలికిన కేసీఆర్, రాష్ట్ర ఏర్పాటు తర్వాత కాంగ్రెస్‌కు జెల్ల కొట్టడం బీజేపీ పెద్దలకు గుర్తుకొచ్చి ఉంటుంది. బీజేపీతో రాజీ ప్రయత్నాలు ఫలించకపోయినా మిగతా నిందితులతో పాటు కవితకు కూడా బెయిల్ వచ్చింది. ఆ తర్వాత కవిత కొంత కాలం పాటు పార్టీకి దూరంగా ఉండిపోయారు. ఇటీవలి కాలంలోనే ఆమె తిరిగి ప్రజల్లోకి వెళుతున్నారు. అయితే పార్టీలో తనకు పూర్వం లభించిన ప్రాధాన్యం కరువైంది. కేసీఆర్ కూడా ఆమెను పట్టించుకోలేదు. వరంగల్‌లో భారీగా ఖర్చు చేసి నిర్వహించిన రజతోత్సవ సభలో కూడా ఆమెకు ప్రాధాన్యం దక్కలేదు. అప్పుడు హరీశ్‌రావు కూడా రజతోత్సవ సభకు దూరంగానే ఉండిపోగా కేటీఆర్ సర్వం తానై వ్యవహరించారు. అదే సమయంలో పార్టీలో కవిత రీఎంట్రీని ప్రజలు హర్షించడం లేదని ప్రచారం చేశారు. దీంతో పార్టీలో తనకు చోటు లేదన్న అభిప్రాయానికి కవిత వచ్చారు. పార్టీ పగ్గాలు సోదరుడు కేటీఆర్ చేతికి చిక్కితే తన పరిస్థితి ఏమిటి? అని మథనపడ్డారు. ఈ నేపథ్యంలోనే కవిత సొంత పార్టీ ఏర్పాటు ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరిగింది. ఈ దశలో తన కుమారుడు గ్రాడ్యుయేషన్ పట్టా అందుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని కవిత అమెరికా వెళ్లారు. అదే సమయంలో బీఆర్‌ఎస్ రజతోత్సవాలను అమెరికాలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఈ ఉత్సవాలలో పాల్గొనడానికి కేటీఆర్ అమెరికా వెళ్లబోతున్నారు. అయితే అప్పటికే అమెరికాలో ఉన్న కవితను ఈ ఉత్సవాల గురించి ఎవరూ సంప్రదించలేదు. అమెరికాలో నివసిస్తున్న తెలంగాణ వారు కూడా ఆమెను పట్టించుకోలేదు. అదే సమయంలో రజతోత్సవ సభ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి కేటీఆర్ తరఫున మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అమెరికా వెళ్లారు. సుమన్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కూడా తనకు ఇవ్వకపోవడంపై కవిత ఆగ్రహంగా ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే వరంగల్ సభ తర్వాత తండ్రి కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ గురువారం బయటకు పొక్కింది. కవిత అమెరికా నుంచి తిరిగి రావడానికి ఒక రోజు ముందు ఈ లేఖ లీక్ కావడం యాదృచ్ఛికం కాకపోవచ్చు. ఈ లేఖను ఎవరు లీక్ చేశారన్నది ఇప్పుడు తేలవలసి ఉంది. కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలు ఈ లేఖను లీక్ చేశాయా? లేక కవితనే తన రాకకు ఒక రోజు ముందు వ్యూహాత్మకంగా లీక్ చేశారా? అన్నది తేలాల్సి ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం తమదేనని బీఆర్‌ఎస్ నాయకులు ఆశల పల్లకిలో విహరిస్తున్న వేళ చోటుచేసుకున్న ఈ పరిణామాలు ఆ పార్టీ శ్రేణులను నివ్వెరపోయేలా చేశాయి. ఇప్పుడు కవిత అడుగులు ఎటు? అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. కవిత వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని బీఆర్‌ఎస్ నాయకులు అనుమానిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా చెల్లి షర్మిల వెనుక చంద్రబాబు ఉన్నారని జగన్మోహన్ రెడ్డి ఆరోపించడం విన్నాం. ఇప్పుడు తెలంగాణలో కవిత వెనుక ఫలానా వారు ఉన్నారని బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టంగా చెప్పడం లేదు. ఈ మొత్తం వ్యవహారంలో కేసీఆర్ వైఖరి ఎలా ఉండబోతున్నదో తెలియకుండా మాట్లాడితే తమకే మంచిది కాదన్న ఉద్దేశంతో బీఆర్‌ఎస్ నాయకులు మౌనాన్ని ఆశ్రయించారు.

మా చెడ్డ అధికారం!

అధికారం మహా చెడ్డది. అయినవాళ్ల మధ్య కూడా దూరం పెంచుతుంది. తండ్రి కేసీఆర్‌కు ఎదురు నిలిచి ధిక్కరించే

> **తండ్రుల వల్ల సంక్రమించిన అధికారం, సంపదలో కుమార్తెలకు వాటా దక్కకపోవడం జగన్, కేటీఆర్ చెల్లెళ్ల ఆగ్రహానికి కారణమైంది. ఎన్టీఆర్ హయాంలో ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది.**

సాహసం ఇప్పటివరకు కేటీఆర్ గానీ, కవిత గానీ చేయలేదు. అలాంటిది ఇప్పుడు కవిత హఠాత్తుగా తండ్రికి ఇబ్బందులు సృష్టించే పనిచేయడం సహజంగానే ఆశ్చర్యం కలిగిస్తోంది. కవిత తిరుగుబాటు స్వరం టీ కప్పులో తుఫానులా చల్లబడుతుందా? లేక బీఆర్‌ఎస్ పుట్టి ముంచుతుందా? అన్నది ఇప్పుడే చెప్పలేం. కేసీఆర్‌ను కలిసి అన్ని విషయాలూ మాట్లాడతానని కవిత అంటున్నందున కేసీఆర్ తన కుమార్తెకు సర్దిచెబుతారా? లేక ఆమెను పార్టీ నుంచి బయటకు పంపుతారా? అన్నది



స్పష్టమవుతుంది. కేసీఆర్ ఆగ్రహానికి గురైతే కవిత పరిస్థితి ఏమిటి? కార్యకర్తల మద్దతు గానీ, ప్రజల మద్దతు గానీ ఆమెకు లభించే పరిస్థితులు కనిపించడం లేదు. విమానాశ్రయం వద్ద కవితకు స్వాగతం పలకడానికి జాగృతి కార్యకర్తలు వచ్చి ఉండవచ్చును గానీ చివరి వరకు వారంతా ఆమె వెంట నిలబడకపోవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో షర్మిల ఒక విఫల ప్రయోగంగా నిలిచారు. తెలంగాణలో రాజకీయ పార్టీ ప్రారంభించి రాజీ పడకుండా పాదయాత్ర చేసినా ఆమెకు ఆదరణ లభించలేదు. దీంతో అన్న జగన్‌రెడ్డిపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఆమె ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ బాధ్యతలు చేపట్టారు. రాజకీయాల్లో నిలదొక్కుకోవాలంటే పగలనకా రాత్రనకా కష్టపడాలి. అవరోధాలను ఓర్పుగా అధిగమించాలి. ఈ లక్షణాలు షర్మిలలో లేకపోవడం వల్ల ఆమె రాజకీయంగా నిలదొక్కుకోలేక పోతున్నారు. షర్మిలతో పోలిస్తే కవితది భిన్నమైన నేపథ్యం. తెలంగాణ ఉద్యమంలో కవిత చురుగ్గా

> **ఇటీవలి కాలంలోనే కవిత తిరిగి ప్రజల్లోకి వెళుతున్నారు. అయితే పార్టీలో తనకు పూర్వం లభించిన ప్రాధాన్యం కరువైంది. కేసీఆర్ కూడా ఆమెను పట్టించుకోలేదు. వరంగల్‌లో భారీగా ఖర్చు చేసి నిర్వహించిన రజతోత్సవ సభలో కూడా ఆమెకు ప్రాధాన్యం దక్కలేదు. అప్పుడు హరీశ్‌రావు కూడా రజతోత్సవ సభకు దూరంగానే ఉండిపోగా కేటీఆర్ సర్వం తానై వ్యవహరించారు. అదే సమయంలో పార్టీలో కవిత రీఎంట్రీని ప్రజలు హర్షించడం లేదని ప్రచారం చేశారు. దీంతో పార్టీలో తనకు చోటు లేదన్న అభిప్రాయానికి కవిత వచ్చారు. పార్టీ పగ్గాలు సోదరుడు కేటీఆర్ చేతికి చిక్కితే తన పరిస్థితి ఏమిటి? అని మథనపడ్డారు. వరంగల్ సభ తర్వాత తండ్రి కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ గురువారం బయటకు పొక్కింది. ఈ లేఖను ఎవరు లీక్ చేశారన్నది ఇప్పుడు తేలవలసి ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం తమదేనని బీఆర్‌ఎస్ నాయకులు ఆశల పల్లకిలో విహరిస్తున్న వేళ చోటుచేసుకున్న ఈ పరిణామాలు ఆ పార్టీ శ్రేణులను నివ్వెరపోయేలా చేశాయి. ఇప్పుడు కవిత అడుగులు ఎటు? అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది.**

పాల్గొన్నారు.. తెలంగాణ జాగృతి పేరిట తనకంటూ ప్రత్యేకంగా ఒక వేదికను ఏర్పాటు చేసుకున్నారు. కింది స్థాయి కార్యకర్తలతో కూడా ఆమెకు పరిచయాలు ఉన్నాయి. వైఎస్ రాజశేఖర రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందినందున జగన్–షర్మిల మధ్య ఏర్పడిన వివాదాల పరిష్కారానికి ఆ కుటుంబంలో పెద్ద దిక్కు లేకుండా పోయింది. తల్లి విజయలక్ష్మి కుమారుడు, కుమార్తె మధ్య నలిగిపోవడం మినహా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కేసీఆర్ కుటుంబంలో ఈ పరిస్థితి లేదు. ఇటు పార్టీని, అటు కుటుంబాన్ని కంటి సైగతో శాసించగల కేసీఆర్ ఉన్నారు. ఆయన గీసిన గీత కవిత దాటుతారా? లేదా? అన్నదే ఇప్పుడు ప్రశ్న. తండ్రి నాయకత్వంలోనే పనిచేస్తానని కవిత స్పష్టం చేశారు. కేసీఆర్‌ను ధిక్కరించి రాజకీయంగా నిలదొక్కుకోవడం దాదాపు అసాధ్యం అన్న విషయం తెలుసుకోలేనంత అమాయకురాలు కాదు కవిత. పార్టీలో తన స్థానం ఏమిటో స్పష్టం చేయాలని ఆమె తండ్రి వద్ద మారాం చేయవచ్చు. అయితే తాజా పరిణామాలతో కేసీఆర్ కుటుంబం కూడా రాజశేఖరరెడ్డి కుటుంబం వలె బజారున పడింది. అర్ధాంతరంగా చనిపోవడం వల్ల తన కుటుంబ కలహాలు చూసి బాధపడే దౌర్భాగ్యం రాజశేఖర రెడ్డికి తప్పింది. కేసీఆర్ విషయంలో ఆయన కళ్ల ముందే కుటుంబ కలహాలు వీధిన పడ్డాయి. ఈ సమస్యను ఆయన ఎలా పరిష్కరించుకుంటారో వేచి చూద్దాం. కవిత వ్యాఖ్యలు, లేఖ వ్యవహారాన్ని తేలికగా తీసిపారేయడానికి కేటీఆర్ శుక్రవారం విలేకరుల సమావేశంలో ప్రయత్నించారు. అయితే 'దాల్ మే కుచ్ కాలా హై..' అని అర్థమవుతోంది.

జరుపుకోవాల్సింది ప్రాయశ్చిత్త దినం!

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు వద్దాం. మద్యం కుంభకోణంలో దర్యాప్తు వేగం అందుకుంటున్న కొద్దీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కలవరం చెందుతున్నారు. ఈ వ్యవహారంలో సిట్ అధికారులు నేరంతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న వారిని అరెస్టు చేస్తున్నారు. బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టులతో జగన్ ఉలిక్కి పడుతున్నారు. ఇటు లిక్కర్ కుంభకోణంలో, అటు జెత్వానీ కేసుతో పాటు ఇతర కేసుల్లో అధికారులు అరెస్టయ్యారు. దీంతో కూటమి ప్రభుత్వాన్ని జగన్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అరెస్టు చేయడం ఏమిటి? వాళ్లంతా మంచివాళ్లు అని ఆయన చెప్పుకొనే ప్రయత్నం చేశారు. తెలుగునాట ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జైలుకు వెళ్లాల్సి రావడానికి అప్పుడు ఇప్పుడు కూడా జగన్‌రెడ్డి కారణం కావడం గమనార్హం? రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాక ముందు ఉమ్మడి రాష్ట్రంలో ఈ పరిస్థితి లేదు. నీటి ప్రాజెక్టులతో పాటు ఇతరత్రా వ్యవహారాల్లో కమీషన్లుగా వచ్చిన సొమ్ములో కొంత భాగాన్ని ఐఏఎస్ అధికారులకు వారి వాటాగా రాజశేఖరరెడ్డి పంపేవారు. ఈ దశలో జగన్మోహన్‌రెడ్డి ధన దాహం తోడవడంతో ఐఏఎస్ అధికారులు తప్పులు చేశారు. సీబీఐ కేసులలో పలువురు అధికారులు విచారణను ఎదుర్కొన్నారు. బీపీ ఆచార్య, శ్రీలక్ష్మి వంటి ఐఏఎస్ అధికారులు జైలుకు వెళ్లి వచ్చారు. అధికారులకు వారి వాటాను రాజశేఖరరెడ్డి హయాంలో పంచడం మాత్రమే చేయగా, జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అక్రమ సొమ్ము సమీకరణ బాధ్యతలను ఏకంగా అధికారులకే అప్పగించారు. లిక్కర్ కుంభకోణంలో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి వంటి వారు జగన్మోహన్ రెడ్డికి రావాల్సిన వాటాను వసూలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. అధికారులను అలా కూడా ఉపయోగించుకోవచ్చునని జగన్‌రెడ్డి మొదటిసారిగా రుజువు చేశారు. ఇక జగన్‌రెడ్డి ప్రస్తావించిన ఐపీఎస్ అధికారుల విషయానికి వద్దాం. ప్రస్తుతం జైల్లో ఉన్న పీఎస్ఆర్ ఆంజనేయులు చేయని అరాచకం లేదు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2014–2019 మధ్య ఆయన విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. అప్పుడొక మహిళా డాక్టర్‌ను లైంగికంగా వేధిస్తున్నారని ప్రస్తుతం అదే జైల్లో ఉన్న వల్లభనేని వంశీ ఫిర్యాదు చేశారు. ఈ ఉదంతంపై విచారణ చేయడానికి కోడె దుర్గాప్రసాద్‌ను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించారు. ఆయన విచారణ జరిపి పీఎస్ఆర్ ఆంజనేయులు తప్పు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినా చంద్రబాబు ఆ నివేదికను పక్కన బెట్టారు. డీజీపీ స్థాయి అధికారిని అరెస్టు చేసి జైలుకు పంపుతారా? అని ఇప్పుడు బోలెడంత ఆశ్చర్యపోతున్న వారికి ఈ విషయం తెలియకపోవచ్చు. డీజీపీ స్థాయి అధికారి ఏమి ఖర్మ.. ముఖ్యమంత్రులుగా ఉన్నవారిని కూడా అరెస్టు చేసి జైలుకు పంపిన ఉదంతాలు మన దేశంలో ఎన్నో ఉన్నాయి. కేంద్ర మంత్రులుగా ఉన్న వారు కూడా జైలుకు వెళ్లారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక డిప్యుటేషన్ నుంచి రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఆంజనేయులు అధికారిగా అన్ని పరిధులూ అతిక్రమించారు. ముఖ్యమంత్రి మెప్పు కోసం ఎన్నో అకృత్యాలకు పాల్పడ్డారు. సీఐడీ విభాగం అధిపతులుగా పనిచేసిన సునీల్ కుమార్, సంజయ్‌లు ఎలా వ్యవహరించారో తెలిసిందే. కాంతి రాణా టాటా, విశాల్ గున్ని వంటి వారు కూడా ఈ కోవలోకే వస్తారు. ఈ అధికారులకు వత్తాసు పలుకుతున్న జగన్‌రెడ్డి కానీ, ఇతరులు కానీ ఒక విషయం తెలుసుకోవాలి. నాడు గానీ, నేడు గానీ అధికారులు కేసుల్లో ఇరుక్కోవడానికి కారణం ఎవరు? జగన్‌రెడ్డి కారణంగానే వీరంతా హద్దు మీరి వ్యవహరించి కష్టాలు కొని తెచ్చుకోలేదా? అధికారం శాశ్వతం అని తాను నమ్మడమే కాకుండా తనకు ఊడిగం చేయడానికి సిద్ధపడిన అధికారులను కూడా భ్రమల్లోకి నెట్టింది జగన్‌రెడ్డి కాదా? జనం అంటే వెర్రిబాగులోళ్లు అని జగన్‌రెడ్డి బలంగా నమ్ముతున్నట్టు ఉంది. రాజ్య హింసను ప్రోత్సహించిన జగన్‌రెడ్డి ఇప్పుడు తన ఏలుబడిలో ఏం జరిగిందో జనానికి గుర్తు లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చి అందరికీ సినిమా చూపిస్తాను అనడం ద్వారా ఆయన ఇప్పటికీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం ఆశ్చర్యంగా ఉంది. 'మొగుడ్ని కొట్టి మొగసాలకు ఎక్కినట్టు'గా అధికారంలో ఉన్నప్పుడు ఎడాపెడా దోచుకొని ఇప్పుడు చంద్రబాబే కుంభకోణాలకు పాల్పడ్డారని చెప్పగలుగుతున్నారంటే అది ఆయన విపరీత మనస్తత్వానికి నిదర్శనం. మద్యం కుంభకోణంలో అరెస్టయిన నిందితుల్లో పలువురిని.. ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఎందుకు ఓడిపోయారని మీరు భావిస్తున్నారని సిట్ అధికారులు ప్రశ్నించగా, నాసిరకం మద్యం సరఫరా చేయడం ప్రధాన కారణం అని పేర్కొనడం నిజం కాదా? అయినా తన ఓటమికి కారణాలను తెలుసుకోవడానికి ఇష్టపడని జగన్‌రెడ్డి.. ఇతర మీడియా సంస్థలపై పడి ఏడుస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఆయన చూపించిన సినిమా వారి స్మృతిపథం నుంచి తొలగక ముందే మళ్లీ వస్తే సినిమా చూపిస్తానని గుర్తుచేస్తున్నారు. జగన్ రాజకీయ జీవితం అంతా నయవంచనే అనడానికి రాజధాని విషయంలో ఆయన చేసిన ప్రకటనలే నిదర్శనం. 2014–2019 మధ్య ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 'రాజధాని ఎక్కడైనా ఏర్పాటు చేయండి, అయితే కనీసం 30 వేల ఎకరాలు అందుబాటులో ఉండేలా చూడండి' అని కోరిన పెద్దమనిషే ముఖ్యమంత్రి అయ్యాక మూడు రాజధానుల కథ వినిపించారు. ఇప్పుడు తాజాగా రాజధానికి ఎంత కావాలి? 500 ఎకరాలు చాలవా? నాగార్జున యూనివర్సిటీకి చెందిన భూమి నుంచి 500 ఎకరాలు తీసుకొని కట్టండి అంటున్నారు. ఈ మూడు ప్రకటనల మధ్య పొంతన ఉందా? యూనివర్సిటీలకు వందల ఎకరాలు కేటాయించిన గత పాలకులు పిచ్చివాళ్లా? నిన్నగాక మొన్న హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో ఏం జరిగిందో చూశాం. 500 ఎకరాల్లో రాజధాని ఏర్పాటు చేస్తే యూనివర్సిటీలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కేటాయించడానికి భూములు ఎక్కడి నుంచి వస్తాయి? రాజధానికి 500 ఎకరాలు చాలవా? అంటున్న పెద్ద మనిషికి ఇడుపులపాయ, హైదరాబాద్ లోటస్ పాండ్, బెంగళూరులోని ఎలహంక, తాడేపల్లి ప్యాలెస్‌లు ఎందుకు? జగన్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు. వారిరువురూ విదేశాల్లో ఉంటున్నారు. కేవలం ఇద్దరు మాత్రమే ఉండే జగన్‌రెడ్డి దంపతులకు ఇన్ని ప్యాలెస్‌లు అవసరమా? ఈ ప్రశ్నకు ఆయన ఏం సమాధానం చెబుతారు? ఇవి కాకుండా విశాఖలో రుషికొండపై వందల కోట్ల ప్రభుత్వ సొమ్ముతో మరో ప్యాలెస్ నిర్మింపజేశారు. చదరపు అడుగుకు 30 వేలకు పైగా ఖర్చు చేయించారు. ఆయనే ఇప్పుడు రాజధానిలో చదరపు అడుగుకు తొమ్మిది వేలు ఖర్చు చేయడం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి గత ఎన్నికల్లో ఆయనను ఓడించారు గానీ.. లేనిపక్షంలో రుషికొండ ప్యాలెస్‌లో ఆయన కొలువుదీరి ఉండేవారు. మన దేశ రాజకీయాలలో బహుశా మరే ఇతర నాయకుడికీ ఇన్ని నగరాలలో ఇంత విశాలవంతమైన ప్యాలెస్‌లు లేవు. తాను నమ్మే జీసస్‌పై ప్రమాణం చేసి తాను నిర్మించుకున్న ప్యాలెస్‌లు, ఏర్పాటు చేసుకున్న వ్యాపార సామ్రాజ్యం కష్టపడి సంపాదించుకున్నానని జగన్‌రెడ్డి చెప్పగలరా? కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే నెల 4వ తేదీన వెన్నుపోటు దినంగా పాటించబోతున్నట్టు ఆయన ప్రకటించారు. గత ఏడాది జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ప్రజలు ఆయనను 11 సీట్లకే పరిమితం చేస్తూ తీర్పు ఇచ్చారు. ఫలితాలు వెల్లడైన రోజునే ఆయన ఎంచుకున్నారంటే ప్రజలు తనకు వెన్నుపోటు పొడిచారని జగన్ భావిస్తున్నారేమో తెలియదు! బటన్లు నొక్కి డబ్బులు పంచినా ప్రజలు తనను ఓడించడం అంటే వెన్నుపోటు పొడవడమేనని ఆయన అనుకుంటున్నట్టుగా ఉంది. ప్రజలు ఆయనకు వెన్నుపోటు పొడిచారా? ఆయనే ప్రజలకు వెన్నుపోటు పొడిచారా? అన్నది సుస్పష్టం. రాజశేఖరరెడ్డి వేరు.. జగన్మోహన్‌రెడ్డి వేరు అని ప్రజలు గ్రహించారు కనుకనే ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. జగన్‌రెడ్డి నిర్వహించాల్సింది వెన్నుపోటు దినాలు కాదు. ప్రాయశ్చిత్త దినాలు జరుపుకోవాలి. అప్పుడైనా ప్రజలకు ఆయనపై భయాలు తొలగిపోతాయేమో చూడాలి!


విశ్వ శోధకుడు, వైజ్ఞానిక భావుకుడు

జయంత్ విష్ణు నార్లికర్ అచ్చమైన రోల్ మోడల్‌గా నిలిచే శాస్త్రవేత్త. అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతుడైన ఈ వైజ్ఞానికుడు జటిల శాస్త్ర విషయాలను సామాన్యుడికి సులువుగా బోధపడేలా చెప్పగలిగిన భావుకుడు. పత్రికలు, రేడియో, టెలివిజన్ వంటి జనమాధ్యమాల ద్వారా ఒకవైపు పాపులర్ సైన్స్, మరోవైపు సైన్స్ ఫిక్షన్ సృజించిన ప్రతిభాశాలి.

ఖగోళ భౌతిక శాస్త్రవేత్త అయిన నార్లికర్ 1938 జూలై 19న కొల్హాపూర్‌లో జన్మించారు. తండ్రి విష్ణు వాసుదేవ్ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో గణిత, సైద్ధాంతిక భౌతిక శాస్త్రాలలో ఆచార్యుడు. తల్లి సుమతి సంస్కృత విదుషీమణి. మేనమామ వి.ఎస్. హుజూర్ బజార్ పేరు గాంచిన సాంఖ్యాక శాస్త్రవేత్త. బాల్యం నుంచి విశేష ప్రతిభ కనబరిచిన నార్లికర్ పాఠశాల, కళాశాల ప్రథముడిగా రాణిస్తూ వచ్చారు. గణిత, ఖగోళ భౌతిక శాస్త్రాలు సబ్జెక్టులుగా 1957లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ ఆనర్స్ పట్టా పొందారు.

కుటుంబ ప్రోత్సాహంతో ప్రతిష్ఠాత్మక కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించారు. అక్కడ Fred Hoyle పుస్తకం 'Frontiers of Astronomy' చదివిన తర్వాత ఆయన విద్యాసక్తి ఖగోళ భౌతికశాస్త్రం వైపు మొగ్గింది. విశ్వ నిర్మాణం, పరిణామాన్ని వివరించే 'కాస్మాలజీ'లో ఫ్రెడ్ హోయిల్ పర్యవేక్షణలో పరిశోధన ప్రారంభించారు. గురుత్వాకర్షణ సిద్ధాంతాలపై పిహెచ్.డి పట్టా 1963లో పొందారు. మహా విస్ఫోటనం కారణంగా ఈ జగత్తు ఒక్కుదుటున ఉద్భవించిందని చెప్పే 'బిగ్ బ్యాంగ్ థియరి' అప్పటికి బహుళ ప్రచారంలో ఉంది. దానిని విభేదించే రీతిలో ప్రత్యామ్నాయ సిద్ధాంతంగా 'హోయిల్–నార్లికర్ థియరీ ఆఫ్ గ్రావిటీ' (కన్ఫార్మల్ గ్రావిటీగా పేరు గాంచినది) ప్రతిపాదించి ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. 1964లో చేసిన ఈ ప్రతిపాదన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ సాధారణ సాపేక్షతా సిద్ధాంతానికి కొనసాగింపు లేదా మెరుగైన జోడింపుగా మారింది. విశ్వంలోని ప్రతి వస్తువు ద్రవ్యరాశి, ఆ వస్తువు మిగతా వాటితో కలిగి ఉన్న సంబంధం, చర్య బట్టి ప్రభావితం అవుతుందనే 'మ్యాక్ ప్రిన్సిపుల్' వీరి సిద్ధాంతంలో ఆయువుపట్టు. ఐన్‌స్టీన్ ఈ సూత్రం గురించి చర్చించినా, దానిని తన సిద్ధాంతంలో అంతర్భాగంగా చేయలేదు. విశ్వం ఒక్కసారిగా కాకుండా, క్రమంగా విస్తరిస్తూ పోతోందనే సిద్ధాంతం (స్టెడి స్టేట్ థియరీ) ఫలితంగా నార్లికర్, ఆయన గురువు ఫ్రెడ్ హోయిల్‌లు ఒక్కసారిగా ప్రపంచ ప్రఖ్యాతులయ్యారు.


> **1989లో యూజీసీ ఆహ్వానంపై పూణేలో తాను వ్యవస్థాపించిన ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐ.యు.సి.ఎ.ఎ.) సంస్థకు 2003లో పదవీ విరమణ చేసే దాకా నార్లికర్ నేతృత్వం వహించారు. తద్వారా విశ్వవిద్యాలయాలలో ఖగోళ, ఖగోళ భౌతికశాస్త్ర పరిశోధనలకు పథ నిర్దేశక దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో జన సామాన్యంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఆయన విశేష కృషి చేశారు.**



1964లో యువ నార్లికర్ పేరు భారతదేశంలో విపరీతంగా ప్రచారంలోకి వచ్చి ఆయనను స్వదేశానికి ఆహ్వానించాలని పెద్ద ఎత్తున చర్చలు జరగడం చరిత్ర. 1965లో నార్లికర్ 26 ఏళ్ల వయసులో భారత ప్రభుత్వం నుంచి పద్మభూషణ్ పురస్కారాన్ని పొందారు. ఫ్రెడ్ హోయిల్ 1966లో కేంబ్రిడ్జిలో 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ థియరిటికల్ ఆస్ట్రానమీ'ని ప్రారంభించినప్పుడు నార్లికర్‌ను భాగస్వామిగా చేశారు. జీవితకాలపు స్నేహితులుగా మారిన వారిరువురు 'యాక్షన్ అట్ ఎ డిస్టెన్స్ ఇన్ ఫిజిక్స్ అండ్ కాస్మాలజీ' (1974), 'ఎ డిఫరెంట్ అప్రోచ్ టు కాస్మాలజీ' (2000) వంటి శాస్త్ర రచనలు చేశారు. 1972లో భారతదేశం తిరిగి వచ్చిన నార్లికర్ బొంబాయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో ప్రొఫెసర్‌గా చేరారు. 1989 దాకా ఈ సంస్థలో బోధిస్తూ, పరిశోధన చేస్తూ; చేయిస్తూ, మరోవైపు మూఢ నమ్మకాలను పెకలించే రీతిలో ప్రసంగాలు, రచనలు వెలువరిస్తూ ప్రజాజీవితంలో కూడా ప్రసిద్ధులయ్యారు. 1989లో యూజీసీ ఆహ్వానంపై పూణేలో ఆయన వ్యవస్థాపించిన ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐ.యు.సి.ఎ.ఎ.) సంస్థకు 2003లో పదవీవిరమణ చేసే దాకా నేతృత్వం వహించారు. తద్వారా విశ్వవిద్యాలయాలలో ఖగోళ, ఖగోళ భౌతిక శాస్త్ర పరిశోధనలకు పథ నిర్దేశక దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో జన సామాన్యంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి విశేష కృషి చేశారు. ఐ.యు.సి.ఎ.ఎ. వెబ్‌సైట్ చూస్తే ఆయన రచించిన 1200కు పైగా సైన్సు వ్యాసాలు, 140కు పైగా (ఆంగ్లం, హిందీ, మరాఠీ భాషల్లోనే కాకుండా ఇటాలియన్, రష్యన్, జపనీస్, స్పానిష్, గ్రీక్, ఇంకా తెలుగుతో పాటు పలు భారతీయ భాషలలోకి అనువాదమైన) పుస్తకాల వివరాలు విపులంగా తెలుస్తాయి.

నార్లికర్ రాసిన తొలి పాపులర్ వ్యాసం 'డిస్కవరీ' సైన్స్ మ్యాగజైన్‌లో 1960ల తొలినాళ్లలోనే ప్రచురితమయింది. 'న్యూ సైంటిస్ట్' పత్రిక కాస్మాలజీకి సంబంధించిన వ్యాసాలను నార్లికర్‌తో రాయించుకునేది. పరిశోధనలు చేయడం, పాపులర్ సైన్స్ వ్యాసాలు రాయడం మాత్రమే కాకుండా వీరు సైన్స్ విషయాల వక్తగా ఇంగ్లాండ్‌లో ప్రసిద్ధులయ్యారు. దాదాపు అదే కాలంలో వారి తొలి పుస్తకం కూడా అక్కడ నుంచే ప్రచురింపబడింది. మాతృభాష మరాఠీలోను, అలాగే తొలి రెండు దశాబ్దాల జీవితకాలం వారణాసిలో సాగడం వల్ల హిందీలోనూ మాత్రమే కాక ఆంగ్లంలో కూడా ఆయన మంచి రచయిత, వక్త. నార్లికర్ సైన్స్ ఫిక్షన్ నవల 'ధూమకేతు' సినిమాగా రూపొందింది. ఆత్మకథ 'My Tale of Four Cities' మరాఠీ మాతృకకు 2014లో సాహిత్య అకాడమీ అవార్డు పొందింది. ఆయన మంచి క్రీడాకారుడు. సతీమణి మంగళ గణితశాస్త్రవేత్త. కుమార్తెలు గీత, గిరిజ, లీలావతి వివిధ విజ్ఞానశాస్త్ర రంగాలలో నిష్ణాతులు. కన్నుమూయడానికి ముందు రోజున కూడా మూడు గంటల పాటు పుస్తక పఠనం చేసిన ఈ జిజ్ఞాసువు గత మంగళవారం ప్రాతఃకాలంలో అనంత లోకాలకు తరలిపోయారు.

▪ డా. నాగసూరి వేణుగోపాల్





ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శనివారం రాత్రి వర్షంతో పాటు మెరుపులు

డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌పై ఆశలు

ఇప్పటికే నందిగామ, జగ్గయ్యపేటలో భూముల పరిశీలన

- ఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రికి సీఎం చంద్రబాబు వివరణ
- సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి

6

కోస్తాతీరం వెంబడి 30 వరకు వర్షాలే..!

- కృష్ణాజిల్లా 23.6, ఎన్టీఆర్ జిల్లా 10.22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

8

విషాదం

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఆరుగురు దుర్మరణం

విద్యుదాఘాతానికి పటమటలో ముగ్గురు

- గొల్లపూడి వద్ద కృష్ణానదిలో ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు
- రెడ్డిగూడెం మండలంలో చేపల చెరువులో పడి ఓ బాలుడు

జిల్లాలో శనివారం జరిగిన వేర్వేరు ఘటనల్లో మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఒక ఘటనలో అన్నాచెల్లెలు, వారిని కాపాడే ప్రయత్నంలో అన్న భార్య చనిపోయారు. మరో ఘటనలో ఇద్దరు పదిహేనేళ్ల లోపు బాలురు మృతిచెందగా, ఇంకో ఘటనలో పదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదాలతో ఆ కుటుంబాల్లో విషాదం నెలకొంది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి



ఘటనాస్థలిలో మృతదేహాలు

ఒకరినొకరు రక్షించుకోబోయి..

ఒకరు తోబుట్టువు. మరొకరు జీవిత భాగస్వామి. ఇద్దరూ ఆయనకు రెండు కళ్లతో సమానం. విద్యుత్ షాక్ ఈ ముగ్గురిని ఒకేసారి తిరిగిరాని లోకాలకు చేర్చింది. పటమటలోని నారా చంద్రబాబునాయుడు కాలనీలో ఉన్న సాయి టవర్స్‌లో శనివారం జరిగిన విద్యుదాఘాతంలో రాజమహేంద్రవరానికి చెందిన సలాది ప్రసాద్, ఆయన భార్య ఊటుకూరి రాధాతో పాటు చెల్లెలు పరిమళ ముత్యావలి అక్కడికక్కడే చనిపోయారు. ఇనుప తీగపై ఆరేసిన దుస్తులను తీస్తుండగా, గోడల నుంచి ఇనుపరాడ్డుకు చేరిన విద్యుత్ ముత్యావలిని చుట్టేసింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో తడిచేతులతో ప్రసాద్ పట్టుకోవడంతో ఆయనా ప్రాణాలు కోల్పోయాడు. గుమ్మం బయట విద్యుత్ షాక్‌కు బలైపోతున్న భర్త, ఆడపడుచును రక్షించే ప్రయత్నంలో ప్రసాద్ భార్య రాధా వారితో పాటే ప్రాణాలు కోల్పోయింది.

ప్రాణం తీసిన ఈత సరదా

సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు బాలురు జలసమాధి అయ్యారు. ఈ ఘటన భవానీఘాట్‌లో శనివారం జరిగింది. గొల్లపూడి రామరాజ్యనగర్ మిల్క్‌కాలనీకి చెందిన రిత్విక్ (15) కొద్దిరోజుల క్రితం వచ్చిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడు. త్వరలో ప్రైవేట్ కాలేజీలో ఇంటర్

మిగతా 9లో..

బెదిరింపు కాల్స్ కలకలం

బీసెంట్‌రోడ్డు, రైల్వేస్టేషన్‌లో బాంబులున్నాయంటూ కాల్స్

- పరుగులు తీసిన పోలీసు యంత్రాంగం
- రెండు ప్రదేశాల్లో క్షుణ్ణంగా తనిఖీలు
- కేవలం బెదిరింపు కాల్సేనని నిర్ధారణ
- ఫోన్ చేసిన ఆకతాయి కోసం ఆరా



బీసెంట్‌రోడ్డులో తనిఖీలు చేస్తున్న స్క్వాడ్

విజయవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శనివారం బాంబు బెదిరింపు కాల్స్ కలకలం రేపాయి. బీసెంట్ రోడ్డు, రైల్వేస్టేషన్‌లో బాంబులు అమర్చినట్టు పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ కాల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీసులు తిరిగి ఆ నెంబరుకు ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ అని వచ్చింది. రెండు రోజుల క్రితం కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు కానూరులో 15 మంది బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలకు చెందిన రోహింగ్యాలను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బాంబు బెదిరింపు కాల్ రావడంతో పోలీసులు ఒక్కసారిగా పరుగులు తీశారు. అయితే, ఇది కేవలం ఆకతాయి పనేనని పోలీసులు నిర్ధారించారు. ఫోన్ చేసిన వ్యక్తి కోసం ఆరా తీస్తున్నారు.

కదలరు.. వదలరు..!

- రెవెన్యూ బదిలీల్లో రీసర్వే డీటీల పైరవీలు

6



ఢిల్లీలో పార్కులు సందర్శిస్తున్న ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి తదితర బృందం

ప్రకృతిధామంగా అమరావతి!

- తీర్చిదిద్దేందుకు ఏడీసీఎల్ అడుగులు
- ఢిల్లీలో అధికారుల బృందం పర్యటన
- ఆరావళి బయోడైవర్సిటీ, నెహ్రూ, ఆసియన్ పార్కులు, చాణక్యపురి ఎన్‌క్లేవ్‌లోని భారీ ఉద్యానవనం సందర్శన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):

అమరావతి రాజధానిని ప్రకృతిధామంగా తీర్చిదిద్దే దిశగా అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) అడుగులు వేస్తోంది. రాజధానిలో ఎటువంటి ఉద్యానవనాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందో పరిశీలించడానికి ఏడీసీఎల్ అధికారులు ఢిల్లీ బాట పట్టారు. శుక్ర, శనివారాల్లో అక్కడి ఉద్యానవనాలను వారు పరిశీలించారు. ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి స్వయంగా నెహ్రూ, ఆసియన్ పార్క్‌లతో పాటు ఆరావళి బయో డైవర్సిటీ పార్కులను సందర్శించారు. తొలి రోజున చాణక్యపురి డిప్లమాటిక్ ఎన్‌క్లేవ్‌లో 80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అతి పెద్ద ఉద్యానవనాన్ని సందర్శించారు. ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్న ఈ ఉద్యానవనంలో నిర్వాహకులు చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నడి వేసవిలోనూ శీతాకాలాన్ని తలపించేలా ఉద్యానవనం ఉండడంతో, నిర్వహణ తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రెండో రోజున వసంత్ విహార్ వాయువ్య ప్రాంతంలో ఉన్న ఆరావళి డైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. 699 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేశారు. ఆరావళి బయో డైవర్సిటీ పార్కు(ఏబీపీ) విద్యార్థులకు ప్రకృతి విద్యను నేర్పించటంతో పాటు, ప్రజల్లో పర్యావరణ అవగాహన కల్పించటంలో ఎంతగానో కృషి చేస్తోంది. ఆరావళి బయో డైవర్సిటీ తరహాలో అమరావతిలో కూడా బయోడైవర్సిటీ ఏర్పాటు చేయాలని ఏడీసీఎల్ భావిస్తోంది. ఈ పర్యటన లో ఏడీసీ ఉద్యానవన విభాగాధిపతి వీఎస్ ధర్మజ, ఆరావళి బయోడైవర్సిటీ పార్క్ సైంటిస్ట్ షా హుస్సేన్, ఫీల్డ్ బయాలజిస్టులు గిరీష్ చంద్ర పాఠక్, రిజ్వాన్ ఖాన్, దినేష్ ఆల్బర్ట్సన్, దుష్యంత్‌కుమార్, వన్య ప్రాణుల పర్యావరణ శాస్త్రవేత్త ఐషా సుల్తానా పాల్గొన్నారు.

ఒకే ఛత్రం కిందకు సహకార డెయిరీలన్నీ తేవడం శుభపరిణామం

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



చలసాని ఆంజనేయులుకు అవార్డు అందిస్తున్న సహకార భారతి ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ దీపక్ చౌరాసియా

విజయవాడ, మే 24(ఆంధ్రజ్యోతి): సహకార డెయిరీలన్నింటినీ ప్రధాని మోదీ ఒకే ఛత్రం కింద తీసుకురావడం శుభపరిణామమని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శనివారం గుజరాత్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా సహకార భారతి కాన్ఫరెన్స్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సహకార డెయిరీ రంగంలో కృష్ణా మిల్క్ యూనియన్ అగ్రగామిగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకార రంగం బలోపేతానికి ఇటీవల సమావేశం పెట్టి నాలుగు గంటల సేపు దిశానిర్దేశం చేశారని తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. కాన్ఫరెన్స్‌లో కృష్ణామిల్క్ యూనియన్ విజయగాథను ప్రదర్శించారని తెలిపారు. సహకార భారతి ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ దీపక్ చౌరాసియా, అఖిల భారత సంపర్క్ సహ ప్రముఖ్, ఆంధ్రప్రదేశ్ సహకార భారతి చైర్మన్ అడ్డూరి శ్రీనివాస్, అమూల్ సభరకాంత్ డెయిరీ ఛైర్మన్, గుజరాత్ విధాన సభ స్పీకర్ శంకర్‌సింగ్ చౌదరి, సహకార మంత్రి గుజరాత్ జగదీష్ విశ్వకర్మ, ఎన్‌డీడీబీ ఛైర్మన్ మీనష్ షా పాల్గొన్నారు.

తెలుగు భాష, సంస్కృతుల వికాసానికి పాటుపడదాం

- ప్రజలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపు



తెలుగు విజ్ఞాన సమితి మందిరాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, మే 24 (ఆంధ్రజ్యోతి): భాష అంతరిస్తే జాతి నశిస్తుందని, అందువల్ల తెలుగు భాష, సంస్కృతుల వికాసానికి ప్రతీ ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం బెంగుళూరులోని తెలుగు విజ్ఞాన సమితి మందిరాన్ని ఆయన సందర్శించారు. 1976లో ఉమ్మడి రాష్ట్ర విద్యా సాంస్కృతిక మంత్రిగా ఉన్న తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు తెలుగు విజ్ఞాన సమితి ప్రాంగణంలో పాఠశాల భవనాన్ని ప్రారంభించినప్పుడు, ఆయనతో కలిసి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. ఇప్పుడు బెంగళూరు సందర్శనకు విచ్చేసిన ఎమ్మెల్యే సమితి ప్రాంగణంలోని శ్రీ కృష్ణదేవరాయ కళామందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. తెలుగు రాష్ట్రాల్లో పరభాషా వ్యా మోహం ఒకింత పెరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమి తి పదాధికారులంతా మండలిని ఆత్మీయంగా సన్మానించారు. డాక్టర్ రాధాకృష్ణ రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- పమిడిముక్కల గ్రామస్థులకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హామీ



పమిడిముక్కలలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పమిడిముక్కల, మే 24 (ఆంధ్రజ్యోతి): అమ్మా బాగున్నారా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా..పెద్దమ్మా పెన్షన్ తీసుకుంటున్నావా అంటూ పమిడిముక్కల ప్రజలను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పలకరిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ప్రగతి పథంలో పామ ర్రు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి పమిడిముక్కలలో ఆయన పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నా రు. ఇళ్లలో తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులకు అందజేసి, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. నాదెళ్ల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ ఎ.వెంకటేశ్వరరావు, టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌పై ఆశలు

ఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రికి సీఎం చంద్రబాబు వివరణ

జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంపై జిల్లాలో హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటు గురించి చర్చించారు. జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల్లో వేలాది ఎకరాల భూమి అందుబాటులో ఉందని చెప్పారు. క్షిపణులు, మందుగుండు పరిరక్షణ కేంద్రంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దాల్సిందిగా సీఎం కోరగా, రక్షణ మంత్రి సానుకూలంగా స్పందించారు.

- సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి
- ఇప్పటికే నందిగామ, జగ్గయ్యపేటలో భూముల పరిశీలన



కంచికచర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతికి గేట్‌వే (ముఖద్వారం)గా ఉన్న జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఈనెల 13న 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఇండస్ట్రియల్ సెక్టార్‌తో పాటు ఐటీ, డిఫెన్స్ హబ్‌గా ఈ ప్రాంతాలను తీర్చిదిద్దాలని యోచిస్తున్న ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు.. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు సేకరించారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, కలెక్టర్ లక్ష్మీశ, ఇతర ఉన్నతాధికారులు భూములను పరిశీలించారు. 65వ నెంబరు జాతీయ రహదారికి, ప్రతిపాదిత ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)కు, రాజధాని అమరావతికి దగ్గరగా ఉండటం, కృష్ణా నది వల్ల నీటికి కొరత లేకపోవటం, సిమెంట్, ఇసుక, మెటల్ కూడా అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిపెట్టారు.

అందుబాటులో ప్రభుత్వ భూములు

జగ్గయ్యపేట మండలం జయంతిపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 94లో 498.56 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. సర్వే నెంబర్ 65లో 365 ఎకరాలు, వేదాద్రి వద్ద మరో 700 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. చుట్టుపక్కల ఉన్న మరో 300 ఎకరాల ప్రైవేట్ భూములు సేకరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నందిగామ మండలం పెద్దవరం గ్రామ రెవెన్యూ పరిధిలో 1,120 ఎకరాలు ఉన్నాయి. ఈ భూమిలో 515 ఎకరాలను దశాబ్దం కిందటే ఏపీఐఐసీకి కేటాయించగా, రూ.కోట్ల వ్యయంతో గుట్టలు, కొండలను చదునుచేసి, రోడ్లు, నీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు. రామన్నపేట (గుడిమెట్ల) పరిధిలో 250 నుంచి 300 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. అక్కడే ఉన్న మరో 300 ఎకరాల అటవీ భూవిని తీసుకునేందుకు డీనోటిఫై చేయాల్సి ఉంది.

డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు రాష్ట్ర అభివృద్ధికి కీలక మలుపు

- టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట-నందిగామ మధ్య 2 వేల ఎకరాల్లో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలపడం రాష్ట్ర అభివృద్ధికి కీలకమలుపు అవుతుందని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. క్లస్టర్ వల్ల యువతకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పడి, పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. జిల్లా ప్రజల తరఫున సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మారనున్న జగ్గయ్యపేట రూపురేఖలు

- నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది
- డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుపై తాతయ్య సంతోషం

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట-నందిగామ మధ్య డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రతిపాదనకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సంతోషం వ్యక్తం చేశారు. జగ్గయ్యపేటలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేయాలని 2015లో తొలిసారిగా ప్రతిపాదించడంతో ప్రభుత్వ భూ ములు సర్వే చేశారని తెలిపారు. శనివారం తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జగ్గయ్యపేటలో గతంలో ఇండస్ట్రియల్ హబ్ కోసం కేటాయించిన జయంతిపురం భూములపై వచ్చిన కోర్టు వివాదాన్ని రెండోసారి చంద్రబాబు ప్రభు త్వం రాగానే తాను, ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి ఏపీఐఐసీ చైర్మన్‌తో మాట్లాడి కోర్టు వివాదం ముగిసేలా చొరవ తీసుకున్నామని, ఆ భూములకు విముక్తి కల్పించామని ఆయన తెలిపారు. అసెంబ్లీ సమావేశంలోనూ జయంతిపురం భూముల అం శాన్ని ప్రస్తావించానని తెలిపారు. భూములకు క్లియరెన్స్ రాగానే ఎంపీ కేశినేని శివనాథ్ మళ్లీ సర్వే చేయించారని తెలిపారు. డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుతో జగ్గయ్యపేట ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. జగ్గయ్యపేట ప్రజల తరఫున ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎంపీ కేశినేనికి తాతయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ కేశినేని చిన్ని హర్షం

కంచికచర్ల: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో డిఫెన్స్ క్లస్టర్ హబ్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు 2 వేల ఎకరాలు కేటాయించటంపై ఎంపీ కేశినేని చిన్ని ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ హబ్ ఏర్పాటు కావడం వల్ల నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల అభివృద్ధే కాకుండా ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు యువతకు ఉద్యోగాలు కల్పించటం కోసం.. ముఖ్యంగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డిఫెన్స్ రంగంలోకి ఔత్సాహిక ఎంటర్‌ప్రెన్యూర్స్ అడుగుపెట్టేందుకు ఇది చక్కని అవకాశమని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతానికి ముగ్గురు బలి

- విజయవాడలో దుర్ఘటన



సలాది ప్రసాద్(ఫైల్) ఊటుకూరి రాధ(ఫైల్)

విజయవాడ, మే 24(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతం ముగ్గురిని బలి తీసుకుంది. బెంజిసర్కిల్ సమీపాన ఉన్న నారా చంద్రబాబునాయుడు కాలనీలో శనివారం ఈ ఘటన జరిగింది. ఐటీఐ విశ్రాంత ప్రిన్సిపాల్ పెరవళి రామకనక దుర్గాప్రసాద్ భార్య పెరవళి ముత్యావలి. నారా చంద్రబాబునాయుడు కాలనీలో సాయి టవర్స్ జీఎఫ్2 ఫ్లాట్‌లో ఉంటున్నారు. దుర్గాప్రసాద్ చేసిన అప్పులు తీర్చకపోవడంతో కోర్టు ఆ ఫ్లాట్‌ను జప్తు చేసింది. ఫ్లాట్ ఖాళీ చేయాల్సి రావడంతో ముత్యావలి అన్నయ్య, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన సలాది ప్రసాద్, ఆయన సతీమణి ఊటుకూరి రాధ కొద్ది రోజుల క్రితం ఇక్కడికి వచ్చారు. ఇంట్లోని సామాన్లు పార్శిల్ చేస్తున్నారు. శనివారం ఉదయం ప్రసాద్ కుళాయి వద్ద దుస్తులు ఉతుకుతుండగా, ముత్యావలి తీగపై వాటిని ఆరేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. ప్రసాద్ తన సోదరిని కాపాడే ప్రయత్నంలో ఆమెను పట్టుకున్నాడు. తడి చేతులతో పట్టుకోవడంతో ఆయన కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. భర్త ప్రసాద్ కేకలు విని, ఇంట్లో ఉన్న భార్య రాధ కూడా ఆయన్ను రక్షించే ప్రయత్నం చేయడంతో షాక్ తగిలింది. గుమ్మానికి ఎదురుగా ముత్యావలి, ప్రసాద్, కొద్దిదూరంలో రాధ పడిపోయారు. వీరి కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే ఫ్యూజులు లాగేశారు. అప్పటికే ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

ఇనుప రాడ్డే మృత్యువు

- విద్యుదాఘాతానికి ఇదే కారణం.. గోడ నుంచి ఇనుప రాడ్‌కు ప్రవహించిన విద్యుత్
- ముగ్గురి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి.. రాజమండ్రికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు

విజయవాడ, మే 24(ఆంధ్రజ్యోతి): మరో రెండు రోజులు ఆగితే ఆ ఇంటితో సంబంధమే తెగిపోతుంది. కోర్టు ఉత్తర్వులతో రుణం తీరిన ఆ ఇంటి నుంచి వెళ్లిపోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఇనుప రాడ్డు మృత్యువుగా మారింది. దాని ద్వారా ప్రవహించిన విద్యుత్ క్షణాల వ్యవధిలో ముగ్గురి ప్రాణాలను చుట్టేసింది. పటమటలోని నారా చంద్రబాబునాయుడు కాలనీ సాయి టవర్స్‌లో ముగ్గురు దుర్మరణానికి ఇనుప రాడ్డు కారణమని విద్యుత్ సిబ్బంది, పోలీసులు గుర్తించారు. సాయి టవర్స్‌లో జీఎఫ్ 2లో ఉంటున్న పరిమళ ముత్యావలి, ఆమె సోదరుడు సలాది ప్రసాద్, ఆయన భార్య ఊటుకూరి రాధా విద్యుదాఘాతంతో చనిపోయారు. పడమర వైపు ఉన్న గోడకు ఒక ఇనుపరాడ్డును దిగ్గొటారు. దానికి ఇనుప జియో తీగను గేటు వద్ద ఉన్న పిల్లర్‌కు బిగించారు. భవనం పాత పడిపోవడంతో గోడల నుంచి నీరు లీకవుతోంది. శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి గోడలన్నీ తడిసి ముద్దయ్యాయి. దీనితో వైరింగ్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. గోడలన్నీ తడిసిపోయి ఉండడంతో విద్యుత్ గోడకు ఉన్న ఇనుపరాడ్‌కు చేరింది. ముత్యావలి తీగపై ఉన్న దుస్తులను తీస్తుండగా ఆమెకు షాక్ తగిలింది. గేటు వద్ద దుస్తులు ఉతుకుతున్న ప్రసాద్ తడి నేలపై వెళ్లి ఆమెను పట్టుకోవడంతో ఆయన ప్రాణాలు కోల్పోయాడు. ప్రసాద్ భార్య రాధాది ఇదే పరిస్థితి. ముత్యావలికి విద్యుత్ షాక్ తగిలిన తర్వాత ప్రసాద్ వెంటనే పక్కన ఉన్న వాచ్‌మన్ కుమార్తె ప్రభావతిని పిలిచాడు. ఆమెపై అంతస్తుల్లో ఉన్న వారిని పిలిచే వరకు ప్రసాద్ ఆగలేదు. ఆయన కొన్ని నిమిషాలు ఆగి ఉంటే ప్రసాద్, ఆయన సతీమణి రాధా ప్రాణాలతో బయటపడేవారు. ఈ ముగ్గురి మృతదేహాలకు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేశారు. రాజమహేంద్రవరం నుంచి ప్రసాద్ పెద్దకుమార్తె అలేఖ్య, ఆమె మావయ్య మార్చురీ వద్దకు వచ్చారు. ముత్యావలీ ముందు భర్త కుమారుడు రాజమహేంద్రవరం నుంచి వచ్చాడు.

రాధా అల్లుడు వంశీ, కుమార్తె ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ ఇద్దరు అక్కడ శాంతినగర్‌లో ఉంటున్న హోటల్‌లో పనిచేస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న సలాది ప్రసా ద్ 2020వ సంవత్సరం నుంచి రాధాతో సహజీవనం చేస్తున్నాడు. ముత్యావలి ఐటీఐ విశ్రాంత ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్‌ను వివాహం చేసుకుని విజయవాడలో స్థిరపడ్డారు. కొద్దినెలలుగా వారి మధ్య వివాదాలు జరగడంతో దుర్గాప్రసాద్ పోరంకిలో వేరుగా ఉంటున్నారు. ఈ మూడు మృతదేహాలను వారి వారి కుటుంబ సభ్యులు వేర్వేరుగా రాజమండ్రికి తీసుకెళ్లారు.

కృష్ణానదిలో ఈతకెళ్లి ఇద్దరు బాలురు మృతి



రిత్విక్, గిరీశ్వర్ మృతదేహాలు

విద్యాధరపురం, మే 24(ఆంధ్రజ్యోతి): భవానీఘాట్ వద్ద కృష్ణానదిలో ఈత కొట్టేందుకు దిగిన ఇద్దరు బాలురిను మృత్యువు కబళించింది. భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం ఈ ఘటన జరిగింది. ఘటన వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. గొల్లపూడి పంచాయతీ పరిధి రామరాజ్యనగర్ మిల్క్‌కాలనీలో మీసాల కృష్ణకిషోర్, భార్య, ఇద్దరు కుమారులతో ఉంటున్నాడు. కబేళా ప్రాంతంలో రంగుల కంపెనీలో పనిచేస్తున్నాడు. అతని రెండో కుమారుడు రిత్విక్(15) భవానీపురంలోని ఓ ప్రైవేట్ స్కూలులో పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. శుక్రవారం తాను చదివే స్కూల్‌కు వెళ్లి టీసీ తీసుకున్నాడు. భవానీపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్‌లో సోమవారం చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి వద్ద నుంచి అదే ప్రాంతానికి చెందిన కనుమూరి చైతన్య ఇతని సోదరుడు ఏడో తరగతి చదువుతున్న గిరీశ్వర్(12) బొడ్డు భార్గవ్, కాకర్లపూడి లోహిత్, రాయప్ప వర్మతో కలిసి నడుచుకుంటూ భవానీఘాట్ వద్ద కృష్ణానది వద్దకు వెళ్లారు. చైతన్య, భార్గవ్, లోహిత్ నది ఒడ్డున ఉండగా, గిరీశ్వర్, రుత్విక్‌లు నదిలో ఈతకు దిగారు. కొద్దిదూరం వెళ్లి మరలా బయటకు వచ్చే మార్గంలో ఒక చోట లోతుగా ఉండడంతో గిరీశ్వర్ మునిగిపోతూ రుత్విక్‌ను పట్టుకున్నాడు. రుత్విక్‌కు ఈత వచ్చినప్పటికీ నీటి ప్రవాహం, గిరీశ్వర్ పట్టుకోవడం వంటి కారణాల వల్ల ఇద్దరూ నీటిలో మునిగారు. ఒడ్డున ఉన్న చైతన్య గమనించి తన తల్లికి సెల్ ఫోన్ ద్వారా సమాచారం తెలిపాడు. ఆమె వెంటనే తమ ఇంటి సమీపంలో ఉన్న కృష్ణ కిషోర్‌ను తీసుకుని భవానీఘాట్ వద్దకు వచ్చారు. అప్పటికే సమాచారం అందుకున్న ఎస్‌డీఆర్ఎఫ్, భవానీపురం పోలీసులు రంగంలోకి దిగి నదిలో మునిగి పోయిన ఇద్దరు బాలురు ఆచూకీ కోసం గాలించి, వారి మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. అనంతరం మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రిత్విక్ తండ్రి కృష్ణకిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గిరీశ్వర్ తండ్రి మోహనరావు గవర్నరుపేటలోని ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నాడు.

అయ్యో బిడ్డా.. అప్పుడే నిండు నూరేళ్లు నిండాయా!

- ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో బాలుడి మృతదేహం వద్ద తండ్రి రోదన



కుమారుడు ఈశ్వర్ మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి ముదగన కృష్ణ

రెడ్డిగూడెం, మే 24 (ఆంధ్రజ్యోతి): అయ్యో బిడ్డా.. అప్పుడే నీకు నూరేళ్లు నిండిపోయాయా.. అని ఒక్కగానొక్క కొడుకు చెరువులో పడి మృతి చెందడంతో బాలుడి శవంపై పడి ఓ తండ్రి రోదిస్తున్న తీరు చూపరుల్ని కలచివేసింది. ఈ ఘటన నాగులూరులో శనివారం జరిగింది. నాగులూరు గ్రామానికి ముదగన కృష్ణ- నాగలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు ఈశ్వర్(10) శుక్రవారం ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంటకు కూడా కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. బాలుడి కోసం గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీసులకు బాలుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం గ్రామంలోని సమీపంలోని చేపల చెరువులో బాలుడు మృతదేహం లభ్యమైంది. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి ఎస్సై బి. మోహన్‌రావు దర్యాప్తు చేస్తున్నారు.

కదలరు.. వదలరు..!

- రెవెన్యూ బదిలీల్లో రీసర్వే డీటీల పైరవీలు
- వైసీపీ హయాంలో లూప్‌లైన్‌లోకి 12 మంది తహసీల్దార్లు
- వారి స్థానంలో తమ మాటవినే డీటీలకు పోస్టింగ్
- జగనన్న ఇళ్ల స్థలాల కొనుగోలులో విచ్చలవిడి వ్యవహారాలు
- ఇప్పటికీ అవే పోస్టుల్లో కొనసాగుతున్న డీటీలు
- కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగే ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 12 మంది రెగ్యులర్ తహసీ ల్దార్లు లూప్‌లైన్ పోస్టుల్లో ఉన్నారు. వీరికి రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉంది. రూల్ పొజిషన్ గురించి కూడా తెలుసు. ఇలాంటి వారిని కిందటి వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఆ స్థానంలో రీసర్వే డిప్యూటీ తహసీ ల్దార్ల (డీటీ)లకు పోస్టింగ్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఈ విషయాలు ఎమ్మెల్యేల కు తెలియకపోవడంతో లూప్‌లైన్‌లో ఉన్నవారు అక్కడే ఉండిపో యారు. తాజాగా జరుగుతున్న బదిలీల నేపథ్యంలో తమ విష యం తెలుస్తుందన్న ఉద్దేశంతో డీటీలు కొందరు ఎమ్మెల్యేల సిఫా ర్సుల కోసం ఎగబడుతున్నారు. ఈ పరిణామాలు ఎమ్మెల్యేలను ఆశ్చర్యపరుస్తున్నాయి.

రెగ్యులర్ తహసీల్దార్ల స్థానాల్లో పాతుకుపోయిన ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు (డీటీ) బదిలీల నుంచి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రూల్ పొజిషన్ చెబుతూ మాట వినని కొంతమంది తహసీల్దార్లను వైసీపీ ప్రభుత్వ హయాంలో లూప్‌లైన్ పోస్టుల్లోకి పంపారు. వారి స్థానంలో నాటి ఎమ్మెల్యేలు చెప్పిన రీసర్వే డీటీలకు పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుత బదిలీల నుంచి తప్పించుకునేందుకు వీరంతా ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు.

వైసీపీ హయాంలో జరిగిన కథ ఇదీ..

వైసీపీ హయాంలో జగనన్న ఇళ్ల పట్టాల పేరుతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో వేలాది ఎకరాలు కొన్నారు. గరిష్టంగా ఎకరం రూ.కోటి వరకు ర్చు పెట్టారు. స్థానిక మార్కెట్ రేటు కంటే కూడా ఎక్కువ రేట్లకు పరిహారం చెల్లించారు. ఈ పరిహారం చెల్లింపు వ్యవహారంలో అప్పటి ప్రభుత్వం నిగూఢంగా వ్యవహారాలను నడిపింది. ఇలా భూములను అధిక ధరలు పెట్టి తీసుకున్నందుకు ఎమ్మెల్యేలకు ఆర్థిక వనరులను సృష్టించింది. ఇళ్ల స్థలాలకు ఎలాంటి భూములు తీసుకోవాలో కూడా ఆలోచించకుండా ఎక్కడపడితే అక్కడ తీసుకుంది. లోతట్టు ప్రాంతాల్లోని భూములు, కొండలు, గుట్టలు, చెరువులు, డొంకలు ఉన్నచోట భూములు తీసుకున్నారు. ఇలా ఇష్టానుసారంగా భూములు తీసుకోవటానికి నాటి వైసీపీ ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకు తహసీల్దార్లను ఎడాపెడా బదిలీ చేశారు. భూముల కొనుగోలు విషయంలో రూల్ పొజిషన్ చె బుతున్నారన్న కారణంతో లూప్‌లైన్లకు పంపించారు. వారి స్థానంలో డీటీలను కూర్చోబెట్టారు. వీరికి చట్టాలపై పూర్తి అవగాహన లేకపోవటం, రూల్ పొజిషన్స్ గురించి సరిగ్గా తెలియకపోవటం వల్ల భూముల కొనుగోళ్ల వ్యవహారంలో అడ్డగోలుగా వ్యవహారాలు నడిచాయి. ఇళ్ల పట్టాల పంపిణీ, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపు, ప్రభుత్వ భూములకు ఆక్రమణల పేరుతో పొసెషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం.. వంటి మోసాలకు నాటి ప్రజాప్రతినిధులు పాల్పడ్డారు. ఇలా.. అవినీతి రుచిమరిగిన రీసర్వే డీటీలు తాజా బదిలీల నేపథ్యంలో తమ స్థానాలను కోల్పోతామేమోనన్న భయంతో ఉన్నారు. బదిలీ నిలుపుదల చేయించుకునేందుకు తెగ ప్రయత్నిస్తున్నారు.

ప్రభుత్వానికి వివరించే ప్రయత్నాలు

రెవెన్యూ శాంక్షన్డ్ పోస్టుల్లో.. ఒక మండలానికి ఒక రెగ్యులర్ తహసీల్దార్, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఉంటారు. కాలక్రమంలో అవసరాల పేరుతో రీసర్వే డీటీలు, వీడీఎస్ డీటీలు, ఎలక్షన్ డీటీలు, కేఆర్ఆర్‌సీ డీటీలు వచ్చారు. వివిధ విభాగాల్లోని డీటీలంతా రెగ్యులర్ తహసీల్దార్ల పోస్టుల కోసం పాకులాడే పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రెగ్యులర్ తహసీల్దార్లను పక్కనపెట్టి రీసర్వే డీటీలకు పెద్దపీట వేశారు. ఎన్టీఆర్ జిల్లాలో ఏడుగురు తహసీల్దార్లు, కృష్ణాజిల్లాలో ఐదుగురు తహసీల్దార్లు.. మొత్తం 12 మంది తహసీల్దార్లను లూప్‌లైన్ పోస్టుల్లో పెట్టారు. ఇంకా పెద్ద సంఖ్యలో తహసీల్దార్లను కీలక స్థానాల్లో పని చేయనీయకుండా తప్పించారు. అవసరాల రీత్యా నెలల వ్యవధిలోనే బదిలీ చేశారు. కాగా, తమకు జరుగుతున్న అన్యాయాన్ని రెవెన్యూ సంఘాల ద్వారా జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి తీసుకురావటానికి రెగ్యులర్ తహసీల్దార్లు రంగం సిద్ధం చేస్తున్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	127,136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ అవయవాల పంపిణీ

గవర్నర్‌పేట, మే 24 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయిన విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ అవయవాలు అమర్చడం వల్ల మానసిక ధైర్యం లభిస్తుందని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. ఎన్‌టీఆర్ ట్రస్ట్, సుదీక్షణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంబీవీకేలో 150 మందికి కృత్రిమ చేతులు, కాళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు, కృత్రిమ అవయవాలు పంపిణీ వంటి కార్యక్రమాలు చేయడం ద్వారా స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు మరింత సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బండ్లమూడి బసవేశ్వరరావు, సుదీక్షణ్ ఫౌండేషన్ ప్రతినిధి చిగురుపాటి విమల తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డంపర్‌బిన్లు





ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న ఉన్న డంపర్ బిన్లు వాహదారులకు ప్రమాదకంగా మారాయి. 3, 4 డివిజన్లలోని ప్రధాన ప్రాంతాలైన లయోలా కళాశాల రోడ్డు, వరలక్ష్మీ నగర్ కాలనీల సమీపంలో ఐదవ నెంబరు రోడ్డులో చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన డంపర్‌బిన్లు రోడ్డుపై పెట్టడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. చెత్తను లారీలో ఎక్కించేందుకు అనువుగా ఉం టుందని వీఎంసి సిబ్బంది డంపర్లను ఇలా రోడ్డపై పెడుతున్నారు. ఇవి రోడ్డుపై రాత్రి సమయంలో వాహనాలకు అడ్డుగా వస్తున్నాయని ద్విచక్రవాహదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -భారతీనగర్, ఆంధ్రజ్యోతి

హైవేపై బారికేడ్లు తొలగించాలని సీపీఎం ఆందోళన

కృష్ణలంక, మే 24 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ వద్ద హైవేపై ప్రమాదాల నివారణ, బారికేడ్ల తొలగింపుపై సీపీఎం ఆందోళన చేసింది. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ పాల్గొని మాట్లాడుతూ కృష్ణలంక ప్రాంతంలో గత నెల రోజుల్లో రెండు ప్రమాదాలు జరిగాయన్నారు. హైవేపై వాహనాలు మితిమీరిన వేగంతో నడుస్తున్నాయని, హైవేపై బారికేడ్లు ఏర్పాటు చేశారన్నారు. చిన్న సబ్‌వే మాత్రమే నగరంలోకి వెళ్లేందుకు ఏకైక మార్గంగా ఉండటం వలన తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ ప్రాంతంలో పోలీసు బీట్ ఏర్పాటు చేయాలని, హైవేపై బ్లింకర్స్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు కొరాడ రమణ, గోపి, రూబెన్, అప్పలనాయుడు, రామకృష్ణ, అనిల్, సిద్ధు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పటమటలంకలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు

● రోజుకు సుమారు 300 మంది వాకర్స్ వినియోగించుకుంటున్న వైనం ● ఫ్లడ్‌లైట్‌లు ఏర్పాటు



బెంజిసర్కిల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడం, వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ వాకింగ్, రన్నింగ్ ఎంచుకోవడం పరిపాటయింది. వాకింగ్, జాగింగ్, రన్నింగ్ చేసేందుకు సరైన గ్రౌండ్ కావాలని 9వ డివిజన్ ప్రజలు భావించారు. స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీ ద్వారా తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. అంతటితో ఆగకుండా పటమటలంకలో దేవదాయశాఖకు చెందిన సుమారు రెండెకరాల ఖాళీ స్థలం ఉందని, దానిని శుభ్రం చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే చొరవతో స్థానికుల విరాళాలతో గ్రౌండ్‌ను శుభ్రం చేసుకొని వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

రోజుకు 300 మంది వాకర్స్

పటమటలంకలో సుమారు రెండు నెలల క్రితం ఏర్పాటు చేసిన శ్రీఅవధూత వాకింగ్ ట్రాక్‌కు రెండు పూటలా కలిపి సుమారు 300 మంది వాకర్స్ వినియోగించుకుంటున్నారు. గ్రావెల్‌తో సుమారు 300 మీటర్లు పొడవున ట్రాక్ ఏర్పాటు చేశారు. ఈ ట్రాక్‌లో ఫ్లడ్‌లైట్లు కూడా ఏర్పాటు చేశారు.

దాతల విరాళం...

వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు 9వ డివిజన్ పరిధిలోని పలువురు రూ.8లక్షల వరకు విరాళాలు అందజేశారు. ఈ ట్రాక్‌ను పటమటలంక, రామలింగేశ్వరనగర్, పటమట, బెంజసర్కిల్ ప్రాంత ప్రజలు వినియోగించు కుంటున్నారు.

ప్రజల నుంచి వచ్చిన ప్రతిపాదన మేరకే...



ప్రజల నుంచి వచ్చిన ప్రతిపాదన మేరకు పటమటలంకలో వాకింగ్ ట్రాక్‌ను అందరి సహకారంతో అభివృద్ధి చేశారు. ముఖ్యంగా ఎమ్మెల్యే గద్దె ఈట్రాక్ ఏర్పాటులో చొరవ తీసుకున్నారు. ప్రజలే విరాళాలు అందజేశారు.
- చెన్నుపాటి కాంతిశ్రీ, కార్పొరేటర్, 9వ డివిజన్

ఎమ్మెల్యే సుజనాకు లారీ ఓనర్స్ పరామర్శ



ఎమ్మెల్యే సుజనా చౌదరిని పరామర్శిస్తున్న లారీ ఓనర్స్

బెంజిసర్కిల్, మే 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనాచౌదరిని లారీ ఓనర్స్ పరామర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో సుజనాచౌదరిని కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ, మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి వజీర్, సభ్యులు, ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం గ్రీన్ టాక్స్‌ను తగ్గించినందుకు వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఏడీసీపీ ప్రసన్నకుమార్



మాట్లాడుతున్న ఏడీసీపీ ప్రసన్న కుమార్

గుణదల, మే 24 (ఆంధ్రజ్యోతి): యువత మోటారు వాహన చట్టంపట్ల అవగాహన కలిగి ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏడీసీపీ ఎ.వి.ఎల్.ప్రసన్న కుమార్ తెలిపారు. మహాత్మాగాంధీ రోడ్డులోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం మోటారు వాహన చట్టంపట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ నగరంలో డోర్ డెలివరీలకు వెళుతున్న స్విగ్గి, జొమాటో రన్నర్స్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, హెల్మెట్ విధిగా ధరించాలని చెప్పారు. వాహనాలకు నెంబర్ ప్లేట్స్ వేసేవారు ప్రభుత్వ నిబంధనలు పాటించి మోటారు వాహన చట్టం ప్రకారం వేయాలని చెప్పారు. కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వేసేవారు ఖచ్చితంగా 70శాతం విజిబులిటీ ఉండేలా మాత్రమే బ్లాక్ ఫిల్మ్ అతికించాలని చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు తనిఖీల సమయంలో వాహన యజమానులు విధిగా వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వంశీధర్, ట్రాఫిక్ సీఐలు, స్విగ్గి, జొమాటో, నెంబర్‌ప్లేట్స్ స్టిక్కరింగ్ చేసే షాపు యజమానులు, బ్లాక్‌ఫిల్మ్ వేసే షాపు యజమానులు పాల్గొన్నారు.




నగరంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కురిసిన వర్షానికి ఆటోనగర్‌లోని ఇన్‌కంట్యాక్స్ కాలనీలోని ఓ రోడ్డులో, గుణదలలోని రోడ్డులో నిలిచిన నీరు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



మృతుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

బెంజిసర్కిల్, మే 24 (ఆంధ్రజ్యోతి): బెంజి సర్కిల్ లోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలో విద్యుత్ షాక్‌తో ప్రసాద్, ఆయన భార్య, చెల్లెలు మృతి చెందడం దురదృష్టకరమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ సాయం అందే విధంగా చూస్తామని ఆయన తెలిపారు. శనివారం ఉదయం నారా చంద్రబాబు నాయుడు కాలనీలో కరెంట్ షాక్ తగిలి ముగ్గురు మృతిచెందిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే గద్దె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంట్ వైర్లు, కేబుల్ వైర్లు, బట్టల ఆరవేసే వైర్లు అన్నీ కలిసి ఉండటం వల్ల కరెంట్ వైరు ఎర్త్ అయి ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారని తెలిపారు. ప్రసాద్, ఆయన భార్య, చెల్లెలు కరెంట్ షాక్‌కు కేకలు వేయడంతో సమీపంలోని వారు వచ్చి చూసే సమయానికి వీరు మృతి చెందారని చెప్పారు. వారి ఇంట్లో ఉన్న ఫోన్ ఆధారంగా మృతుల కుటుంబసభ్యులు రాజమండ్రిలో ఉన్నారని తెలిసిందని వివరించారు. మృతుల కుటుంబసభ్యులకు సమాచారం అందజేశామని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీ, గాంధీ, ముమ్మనేని ప్రసాద్, యలమంచిలి దేవేంద్ర, భవానీ, లక్ష్మీ తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

పటమట: 13వ డివిజన్‌లో రూ.31 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు, రూ.18 లక్షలతో చేపట్టిన నీటి సరఫరా పనులకు తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో రోడ్ల నిర్మాణ పనులకు నిధులు లేవనకుండా సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణలు నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, గద్దె ప్రసాద్, కొర్రపాటి శ్రీను, పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

బెజవాడ బార్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభం

విజయవాడ లీగల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను శనివారం కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన రెడ్‌క్రాస్ సొసైటీని అభినందించారు. అనంతరం విజయకృష్ణ సూపర్‌బజార్ ఛైర్మన్, న్యాయవాది వెలగ సురేష్‌ను బార్ న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. పదో తరగతిలో 500 పైగా మార్కులు వచ్చిన న్యాయవాదుల పిల్లలకు బహుమతి ప్రదానం జరిగింది. ఈ నెల 17న బెజవాడ బార్‌లో ప్రారంభమైన సంగీత శిక్షణ విద్యార్థులకు సర్టిఫికెట్లను జిల్లా జడ్జి గోపి అందచేశారు. ఈ కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, డీసీపీ సరిత, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ వైడీ రామారావు, న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్, ఈసీ మెంబర్ వి.గురునాథం, బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే భాషా, కేవీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.


కేశినేని చిన్నికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు క్రికెట్ గ్రౌండ్‌కు వెళ్లిన ఎంపీ చిన్ని

విజయవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ గ్రౌండ్ పరిశీలించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం కర్నూలు వెళ్లారు. అక్కడ కర్నూలు ఎంపీ బస్తాపాటి నాగరాజుతో కలిసి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తన నివాసానికి వెళ్లిన ఎంపీ కేశినేని చిన్ని, బస్తాపాటి నాగరాజును రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలకగా, మంత్రి భరత్ శాలువాలతో సత్కరించారు.

ఆ సమయంలో వీఐపీలు రావొద్దు

● దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు వీఐపీలు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య రావద్దని, ఈ సమయంలో తమ షెడ్యూలును నిర్ణయించుకున్న వీఐపీలు మరో సమయానికి మార్చుకోవాలని దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 11.45 నుంచి 12.15 మధ్య శుద్ధి నిర్వహిస్తారని, తరువాత అమ్మవారికి నైవేద్య సమర్పణ జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య అమ్మవారి దర్శనాలను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. మరోవైపు దేవస్థానంలో అభివృద్ధి పనులు జరుగుతున్నందున పార్కింగ్ సమస్య నెలకొందన్నారు. నైవేద్య సమయంలో దర్శనాలను నిలిపివేయడం వల్ల పసిపిల్లలు, దివ్యాంగులు, వృద్ధులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీంతో ఈ సమయాలకు ముందుగానీ, తరువాతగానీ వీఐపీలు షెడ్యూలను నిర్ణయించుకోవాలని కోరారు. ప్రతి రోజూ ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల 4 క్యూలైన్లలోంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకోవచ్చునన్నారు. భక్తులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ దేవస్థానానికి సహకరించాలన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో హీరోలు
ఆది, అశ్విన్, సంగీత దర్శకుడు తమన్



ఇంద్రకీలాద్రి, మే 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను శనివారం టాలీవుడ్ హీరోలు ఆది, అశ్విన్ బాబు, సంగీత దర్శకుడు త మన్ దర్శించుకున్నారు. అధికారులు వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వా రికి అర్చకులు వేదాశీర్వచనం, ప్రసా దం, చిత్రపటాలు అందజేశారు.

ఎంఈవోల లాగిన్‌కు ఉపాధ్యాయుల బదిలీల దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పా ఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల దరఖాస్తులను వెరిఫై చేసేందుకు ఎంఈవోల లాగిన్‌కు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు పంపారు. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు తమ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వీసు పాయింట్లు, ఇతర అంశా ల్లో ఏవైనా తప్పులు దొర్లితే సవరించేందుకు ఎంఈవోలు ఆయా మం డలాల్లోని ఉపాధ్యాయుల సర్వీసు రిజిష్టర్ల ఆధారంగా సరిచేస్తున్నా రు. ఎంఈవో సరిచేసిన అనంతరం బదిలీల దరఖాస్తులు తిరిగి డీఈ వో లాగిన్‌లోకి వస్తాయి. కాగా సెకండరీ గ్రేడ్ టీచర్లు తమ దరఖాస్తులను 27న రాత్రి వరకు సమర్పించే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెం ట్ల బదిలీల దరఖాస్తులను 25న రాత్రి వరకు సమర్పించే అవకాశం ఉంది.


సమావేశంలో పాల్గొన్న జిల్లా, నగరశాఖ నేతలు

31న ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యాసాగర్ పదవీ స్వీకారం

గాంధీనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో రాష్ట్ర సంఘం అధ్యక్షుడిగా ఏ విద్యాసాగర్ ఈ నెల 31న పదవీ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. జిల్లా, నగరశాఖల కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల కార్యవర్గాలు విద్యాసాగర్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని తీర్మానించాయన్నారు. ఆయన ఎన్నిక లాంఛనప్రాయమేనన్నారు. నగరంలోని శేషసాయి కల్యాణమండపంలో ప్రమాణస్వీకారం జరుగుతుందన్నారు. నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, సంఘం ప్రతిష్ఠను మరింత ఇనుమడింపచేద్దామన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు వీవీ.ప్రసాద్, బి.సతీష్‌కుమార్, బీవీ.రమణ, వి.నాగార్జున, ఎం.రాజుబాబు, నగర కార్యవర్గ సభ్యులు సీవీఆర్.ప్రసాద్, పి.రాజశేఖర్, ఎస్‌కే.జనీరుద్దీన్, సీహెచ్.మధుసూదనరావు పాల్గొన్నారు.


జర్మనీలో జరిగిన మినీ మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష, పలువురు పార్టీ నేతలు

ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఘనంగా మినీ మహానాడు

వన్‌టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ టీడీపీ ఆధ్వర్యంలో మినీ మహానాడు వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన గౌతు శిరీష, గుంటూరు మిర్చియార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌతు శిరీష మా ట్లాడుతూ దేశంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఎన్టీఆర్ ఆ ద్యుడన్నారు. మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ మినీమహానాడుకు యూరప్ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ అభిమానులు తరలి రావడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సుమంత్ కొర్రపాటి, శ్రీకాంత్ కుడితిపూడి, శివ బత్తుల, ప వన్ కుర్రా, నరేష్ కోనేరు, వెంకట్ కాంద్ర, వంశీదాసరి, శివ శంకర్ లింగం పాల్గొన్నారు.

అవగాహనతోనే ఆరోగ్యం





దేశంలో సుమారు 4.2 కోట్ల మందికి థైరాయిడ్

● పురుషుల కంటే మహిళల్లోనే అధికం ● గర్భిణీ, 60 ఏళ్ల పైబడిన స్త్రీలకు ప్రమాదం

విజయవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా సుమారు 20 కోట్ల మంది థైరాయిడ్ వ్యాధులతో బాధపడుతున్నట్టు అంచనా. దేశంలో దాదాపు 4.2 కోట్ల మంది (జనాభాలో 1-10%) థైరాయిడ్ రుగ్మతలతో బాధపడుతున్నారు. వీరిలో సుమారు 60% మందికి తమకు థైరాయిడ్ వ్యాధి ఉందనే అవగాహన లేదు. పురుషుల కంటే మహిళల్లో 5 నుంచి 8 రెట్లు ఎక్కువగా ఈ వ్యాధికి గురవుతున్నారు. ప్రతి 8 మంది మహిళల్లో ఒకరు తమ జీవితకాలంలో థైరాయిడ్ సమస్యను ఎదుర్కొంటారు. 60 ఏళ్ల పైబడినవారు, గర్భిణులకు థైరాయిడ్ వ్యాధులతో ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఒత్తిడికి లోనుకాకూడదు

● డాక్టర్ రాకేష్ బొబ్బా, ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్



సకాలంలో రోగ నిర్ధారణ, జీవనశైలి మార్పుల వల్ల థైరాయిడ్ వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించవచ్చు. అధిక బరువు థైరాయిడ్ సమస్యలు పెంచే అవకాశం ఉంటుంది. కాబట్టి బరువును అదుపులో ఉంచుకోవాలి. 35 ఏళ్ల పైబడిన మహిళలు, కుటుంబంలో ఎవరికైనా థైరాయిడ్ ఉంటే తరచుగా పరీక్షలు చే యించుకోవాలి. అయోడైజ్డ్ ఉప్పు, సీఫుడ్, డెయిరీ ఉత్పత్తులు, బ్రెజిల్ నట్స్, సన్‌ఫ్లవర్ సీడ్స్, గుడ్లు, ఆకుకూరలు, గింజలు, పండ్లు, హోల్ గ్రెయిన్స్, రెడ్ మీట్, లివర్, పాలకూర, బీన్స్ వంటి పదార్థాలను నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలి. వైద్యుడి సలహా లేకుండా ఔషధాలు, సప్లిమెంట్లు తీసుకోకూడదు. అనవసరంగా రేడియేషన్ పరీక్షలు చేయించుకోకూడదు.

థైరాయిడ్ వ్యాధుల రకాలు

థైరాయిడ్ గ్రంథి తగినంత హార్మోన్లను ఉత్పత్తి చేయనప్పుడు హైపోథైరాయిడిజం ఏర్పడుతుంది. దీని లక్షణాలు అలసట, బరువు పెరగడం, నిస్పృహ. అధిక హార్మోన్లు ఉత్పత్తి అయినప్పుడు హైపర్ థైరాయిడిజం అనే సమస్యకు గురవతారు. ఈ సమస్య ఉన్నవారిలో బరువు తగ్గడం, వేగవంతమైన గుండె చప్పుడు, ఆందోళన వంటి లక్షణాలు కనిపిస్తాయి.

థైరాయిడ్ వ్యాధులకు కారణాలు

అయోడిన్ లోపం వల్ల గాయిటర్, హైపోథైరాయిడిజం సమస్యలు వస్తాయి. అదే విధంగా ఆటో ఇమ్యూన్ వ్యాధులైన గ్రేవ్స్ వ్యాధి, హాషిమోటో థైరాయిడిటిస్‌తో పాటు కుటుంబంలో ఎవరికైనా థైరాయిడ్ సమస్య ఉన్నా, జన్యుపరమైన లోపాలు, ధూమపానం, ఒత్తిడి, ఇన్ఫెక్షన్లు, ఔషధాలు ఎక్కువగా వాడినా థైరాయిడ్‌కు సంబంధించిన వ్యాధులు ఉత్పన్నమవుతాయి. ఇవి కాకుండా గర్భిణుల్లో హార్మోనల్ మార్పుల వల్ల కూడా వచ్చే అవకాశం ఉంది. నాడ్యూల్స్, థైరాయిడిటిస్, రేడియేషన్ ఎక్స్‌పోజర్‌తో కూడా థైరాయిడ్ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా మహిళలు, 60 ఏళ్ల పైబడిన వారు, గర్భిణులు, వారసత్వంతో పాటు ఆటో ఇమ్యూన్ వ్యాధులున్నవారికి (డయాబెటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్) కూడా థైరాయిడ్ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

థైరాయిడ్‌ను గుర్తించే పరీక్షలు

టీఎస్‌హెచ్, టీ3, టీ4 పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని, ఎండోక్రైనాలజిస్ట్ సలహా మేరకు మందులు వాడాలని వైద్యులు చెబుతున్నారు.

థైరాయిడ్‌ను నివారించే మార్గాలు

ధూమపానంతో పాటు అధిక అయోడిన్ సప్లిమెంట్లు, ప్రాసెస్డ్, ఫాస్ట్‌ఫుడ్‌కు కూడా వీలైనంత దూరంగా ఉంటే మంచిది. సోయా ఉత్పత్తులు పరిమితంగా తీసుకోవడమే కాక క్యాబేజీ, బ్రోకలీ, కాలీఫ్లవర్ నిత్యం తినాలని సూచిస్తున్నారు.

సంక్షోభం వల్లే చైర్‌పర్సన్ ఉప ఎన్నిక

● ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కౌన్సిలర్లలో నెలకొన్న సంక్షోభం వల్లే మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక అనివార్యమైందని, కౌన్సిలర్లను రాష్ట్రాలు దాటించి క్యాంప్ రాజకీయం వంటి దృష్టసంస్కృతికి వైసీపీ నేతలు పాల్పడ్డారని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో, టీడీపీ నేతలు, కౌన్సిలర్లతో కలిసి వైసీపీ ఇన్‌చార్జి స్వామిదాసు ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు, ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోందని గగ్గోలు పెడుతున్న స్వామిదాసు, 2021లో వైసీపీ దౌర్జన్యంగా వ్యవహరిస్తుందని రోడ్డుపైన బైఠాయించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. అభివృద్ధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, టీడీపీ కౌన్సిలర్లు, వారికి మద్దతిస్తున్న మరికొందరు కౌన్సిలర్లు పట్టణంలో స్వేచ్ఛగా సంచరిస్తుంటే, వైసీపీ కౌన్సిలర్లు మాత్రం, గన్‌మ్యాన్ పహారాలో స్వేచ్ఛ లేకుండా గడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కొందరు కౌన్సిలర్లు తమకు మద్దతు తెలుపుతుంటే, మాట్లాడాలి ఇంటికి రమ్మని రాష్ట్రాలు దాటించింది నిజం కాదా, అని ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలతో సమయం వృథా చేసుకోకుండా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటే ప్రజలు హర్షిస్తారని కొలికపూడి హితవు పలికారు. నేతలు షేక్ అబ్దుల్‌హుస్సేన్ మదాల హరిచరణ్ (కిట్టు)వాసం మునియ్య, రాజవరపు శ్రీనివాసరావు, ఆకుల దుర్గాప్రసాదు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

విశాఖ ఉక్కును పరిరక్షించాలి

● తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి ● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

గాంధీనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఎందరో ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని, విధుల నుంచి తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోని తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ నెల 20 నుంచి జేఏసీ చేస్తున్న సమ్మెకు మద్దతుగా విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు, ధర్నాలు చేయాలని, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని, విశాఖ ఉక్కు కార్మికుల సమస్యలపై సీఎం చంద్రబాబుకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తున్న మోదీకి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకరించడం శోచనీయమన్నారు. ఏఐటీయూసీ, సీఐటీయూసీ నేతలు వెంకటసుబ్బయ్య, ముజఫర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ వి.ఉమామహేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఏఐయూటీసీ రాష్ట్ర నేతలు సుధీర్‌బాబు, మరీదు ప్రసాద్‌బాబు, రైతు సంఘం నేత కేశవరావు, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

● పాత్రికేయులకు కలెక్టర్ లక్ష్మీశ సూచన

సత్యనారాయణపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): నిత్యనూతన ఆలోచనాశక్తిని అందించే యోగాను జీవనమార్గంగా పాత్రికేయులు ఎంచుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా శనివారం బీఆర్‌టీఎస్ రోడ్డు శరదా కాలేజీ జంక్షన్ వద్ద కలెక్టర్ జి.లక్ష్మీశ థీమ్ ఆధారిత యోగాభ్యసన ప్రారంభించారు. తొలుత ఆయన జర్నలిస్టులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు తమ రోజువారీ జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఒత్తిడితో పనిచేయాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో శారీరక మానసిక దృఢత్వాన్ని అందించే యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. నెల రోజుల పాటు బీఆర్‌టీఎస్ శారదా కాలేజీ జంక్షన్‌లో జరిగే కార్యక్రమాల్లో ప్రజలు పెద్దెత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కావూరి చైతన్య, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి. చంద్రశేఖర్, జిల్లా యోగాంధ్ర నోడల్ అధికారులు డా. ఎం. సుహాసిని, డా.జె. సుమన్, జిల్లా అయూష్ అధికారి డా. రామ త్లేహి , యోగా ట్రైనర్ ఎ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


జర్నలిస్టులతో కలిసి యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

యోగా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

కలెక్టరేట్: మే 21 నుంచి జూన్ 21 వరకు జరిగే యోగాంధ్ర మాసోత్సవాలోల భాగంగా జిల్లాలో దాదాపు 10 నుంచి 15 లక్షల మందికి యోగా నేర్పేందుకు జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో 150 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ప్రారంభమైంది. కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరై పర్యవేక్షించారు. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా (ఆయుష్ మంత్రిత్వ శాఖ) ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శనివారం మూడు సెషన్లు జరగ్గా, ఆదివారం రెండు సెషన్లలో శిక్షణ ఉంటుందని, కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ మాస్టర్ ట్రైనర్లు మండలస్థాయిలో శిక్షణ ఇస్తారని, అక్కడ శిక్షణ పొందిన వారు గ్రామ, వార్డు, సచివాలయ స్థాయిలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించడంతో పాటు యోగాసనాలను నేర్పిస్తారని వెల్లడించారు. జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ రామతేహ్లి, జిల్లా యోగాంధ్ర నోడల్ అధికారులు డాక్టర్ ఎం.సుహాసిని, డాక్టర్ జె.సుమన్, యోగా ట్రైనర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

కోస్తాతీరం వెంబడి 30 వరకు వర్షాలే..!

● కృష్ణాజిల్లా 23.6, ఎన్టీఆర్ జిల్లా 10.22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
● పెనమలూరులో 77.2 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం

మచిలీపట్నం/విజయవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఓ మోస్తారు నుంచి భారీ వర్షం నమోదైంది. పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము వరకు పడుతూ నే ఉంది. దీంతో రాత్రి వాతావరణం చల్లబడింది. కృష్ణాజిల్లా పెనమలూరులో అత్యధికంగా 77.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా గన్నవరంలో 6.4మిల్లీమీటర్లు, జిల్లా సగటు వర్షపాతం 23.6 మిల్లీమీటర్లుగా నమోదైంది. అలాగే ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో 50.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నందిగామలో 0.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా 10.22 సగటు వర్షపాతం నమోదైంది. తెల్లవారుజామున వర్షం కురిసినా పగటి సమయంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడగాడ్పులు వీచాయి. గుడివాడ తదితర ప్రాంతాల్లో పగటి సమయంలోనూ వర్షం కురిసింది. ఈనెల 30 వరకు కోస్తాతీరం వెంబడి ఒక మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ శనివారం హెచ్చరికలు జారీచేసింది.





జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు

జిల్లావ్యాప్తంగా పలుప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. కంకిపాడులో 69.2 మిల్లీమీటర్లు, నాగాయలంకలో 40.8, పమిడిముక్కలలో 34.2, కోడూరులో 33.6, ఉంగుటూరులో 30.0, అవనిగడ్డలో 28.6, గుడివాడలో 21.8, బంటుమిల్లిలో 21.2, చల్లపల్లిలో 20.2, నందివాడలో 18.4, గుడ్లవల్లేరులో 17.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గూడూరులో 17.2మిల్లీమీటర్లు, మచిలీపట్నంలో 16.2, మోపిదేవిలో 16.2, ఉయ్యూరులో 15.8, ఘంటసాలలో 15.8, పెదపారుపూడిలో 15.4, పామర్రులో 14.6, పెడనలో12.8, తోట్లవల్లూరులో 12.6, కృత్తివెన్నులో 12.2,మొవ్వలో 11.6, బాపులపాడులో 10.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఎన్టీఆర్ జిల్లాలో ఇలా..

ఇబ్రహీంపట్నం 50.4, జి.కొండూరు 34.2, మైలవరం 25.6 మిల్లీమీటర్ల వర్షంపాతం నమోదవ్వగా విజయవాడ రూరల్‌లో 18.6, విజయవాడ నార్త్ 17.4, విజయవాడ ఈస్ట్ 16.8, విజయవాడ సెంట్రల్ 16.2, విజయవాడ వెస్ట్ 16.2, రెడ్డిగూడెం 4.6, వీరులపాడు 2.0, వత్సవాయి 1.2, కంచకచర్ల 1.0, నందిగామ 0.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, గంపలగూడెం, తిరువూరు, ఏ కొండూరు, విస్సన్నపేట, చందర్లపాడులో ఎలాంటి వర్షం పడలేదు.

ఇంటిపన్నుల మదింపుపై సర్వే చేయండి

● ఈ నెలాఖరులోగా సర్వే పూర్తిచేయాలని హుకుం
● పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలకు డీపీవో ఆదేశాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: పంచాయతీ కార్యదర్శులకు ఇటీవల పనిభారం అధికమవుతోంది. 3, 4 పంచాయతీలకు ఒకే పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణ చేస్తుండటంతో పనిఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. పారిశుద్ధ్య చర్యలకు సంబంధించి ఉదయం 6గంటలకే వీడియో కాన్ఫరెన్స్‌లో తెలపాలని అధికారులు ఒత్తిడిపెట్టడంతో పంచాయతీ కార్యదర్శులంతా ఈ సమయానికి వివరాలు ఇవ్వలేమని చేతులెత్తేశారు. దీంతో ఈ సమయాన్ని కొన్ని రోజుల పాటు ఉదయం 7గంటలకు మార్చారు. పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసే మహిళలు తమ యూనియన్ నేతల ద్వారా సమయాన్ని పెంచాలని గొడవచేయడంతో 8.30 గంటలకు మార్పుచేశారు. ఈ సమయానికి కూడా సమాచారం చేరవేయడం కష్టంగానే ఉంటోంది.

ఇంటి పన్నుల మదింపుపై మళ్లీ సర్వే

పంచాయతీల్లోని ఖాళీస్థలాలు, ఇంటిపన్నులు విధింపు, వసూళ్లపై పెనమలూరులో డీపీవో జే అరుణ శిక్షణా శిబిరం శనివారం నిర్వహించారు. జిల్లాలోని ఒక్కో మండలం నుంచి ఈవోపీఆర్డీతో పాటు, ఒక్కో పంచాయతీ కార్యదర్శి, డేటాఎంట్రీ ఆపరేటర్‌ను ఈ శిక్షణా శిబిరానికి పిలిచారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఇంటిపన్నులకు సంబందించి సర్వే సక్రమంగా జరగలేదని, ఇంటిపన్నులు తక్కువగా నమోదు చేశారన్నారు. దీంతో అన్ని పంచాయతీల్లో ప్రతి ఇంటిని మళ్లీ సర్వే చేసి ఇంటి పన్నులను పెంచి పూర్తిస్థాయి వివరాలను స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఈ అంశాలను మండలంలోని అన్ని పంచాయతీ కార్యదర్శులకు వివరంగా చెప్పాలని ఆదేశించారు.

నెలపైనే సమయం పడుతుంది

పంచాయతీలో ఇంటింటికీ తిరిగి ఇంటిపన్నులు, ఖాళీస్థలాలకు సంబంధించి పన్నులు విధించే అంశంలో డీపీవో ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులు ఖంగుతిన్నారు. చిన్న పంచాయతీలో ఇంటిపన్నుల మదింపునకు సర్వేచేయాలంటే కనీసంగా 20 రోజులకు పైగా సమయం పడుతుందని, పెద్ద పంచాయతీల్లో అయితే 2 నెలల సమయం పడుతుందని చెబుతున్నారు. ఇన్ని రోజులపాటు చేసే పనిని ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని డీపీవో చెప్పారని, ఇదంత సులువుకాదని అంటున్నారు. గతంలో ప్రభుత్వం సూచించినట్టు ఇంటి పన్నులకు సర్వే చేసి స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో నమోదు చేశామని, అదంతా సక్రమంగానే ఉందని మండల అధికారులంతా సంతకాలు చేసి, ఆమోదం కూడా తెలిపారని వారు అంటున్నారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరిగిందని, మళ్లీ ఇంటిపన్నుల మదింపు సర్వే అంటే తమపై మరింత భారం పడినట్టేనని, ఇందుకు మరికొంత సమయం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

విషాదం

(5వ పేజీ తరువాయి)

చేర్పడానికి అతడి తల్లిదండ్రులు సన్నాహాలు చేస్తున్నారు. స్కూల్ నుంచి టీసీ తీసుకోవడానికి రిత్విక్ వెళ్లాడు. మధ్యాహ్నం నుంచి ఇంటికి సమీపాన ఉండే కనుమూరి చైతన్య, అతడి సోదరుడు గిరీశ్వర్ (12), బొడ్డు భార్గవ్, కాకర్లపూడి లోహిత్, రాయప్ప వర్మ భవానీ ఘాట్ వద్దకు వెళ్లి కృష్ణానదిలో స్నానం చేయాలనుకున్నారు. వారితో కలిసి రిత్విక్ వెళ్లాడు. చైతన్య, భార్గవ్, లోహిత్ ఒడ్డున ఉన్నారు. గిరీశ్వర్, రిత్విక్ నదిలోకి దిగారు. కొద్దిసేపు నీటిలో సరదాగా ఈత కొట్టారు. తిరిగి ఒడ్డుకు వస్తుండగా నదిలో లోతుగా ఉన్న ప్రదేశంలో గిరీశ్వర్ మునిగిపోయాడు. అతడు మునిగిపోతూ పక్కనే ఉన్న రిత్విక్‌ను పట్టుకున్నాడు. దీంతో ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. ఊపిరాడక చనిపోయారు.

పదేళ్లకే నిండిన నూరేళ్లు

చేపల చెరువు వద్ద సరదాగా గడపడానికి వెళ్లిన పదేళ్ల బాలుడికి నూరేళ్లు నిండిపోయాయి. రెడ్డిగూడెం మండలంలో జరిగిన ఘటన ఇది. నాగులూరు గ్రామానికి చెందిన ముదగన కృష్ణ కూలీ. ఆయన భార్య నాగలక్ష్మి గృహిణి. ఈ దంపతులకు ఈశ్వర్(10) ఏకైక కుమారుడు. ఇంటి వద్ద శుక్రవారం ఆడుకుంటూ బయటకు వెళ్లిన ఈశ్వర్ శనివారం ఉదయం చేపల చెరువులో మృతదేహమై తేలాడు. ఒక్కగానొక్క కుమారుడ్ని కోల్పోయి ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

28న సంగీత కళాశాలలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా శ్రీఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభు త్వ సంగీత, నృత్య కళాశాలలో ఈ నెల 28న తేదీన శ్రీ విజయ బాలాజీ కల్చరల్ ఆర్ట్ 'వామ్మో.. గుత్తొంకాయ్' హాస్యనాటిక ప్రదర్శన ఏర్పా టు చేసినట్టు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఇదే వేదికపై 'ఓ.. త్యామూర్తులారా..' సీడీని ఆవిష్కరణ ఉంటుదన్నారు. ఈ కార్యక్రమాలను తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

హంసలదీవి బీచ్ వద్దకు పర్యాటకులకు అనుమతి

కోడూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాలకు మేరకు హంసలదీవి బీచ్ వద్దకు పర్యాటకులను అనుమతిస్తున్నట్లు అటవీశాఖ అధికారి నాగమణి తెలిపారు. శనివారం పలు ప్రాంతాల నుంచి హంసలదీవి విచ్చేసిన పర్యాటకులకు స్నానాలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మెరైన్ ఎస్సై పూర్ణమాధురి తెలియజేశారు. కుటుంబసమేతంగా పర్యాటకులు సాగర తీరంలో సరదాగా గడిపి హంసలదీవి రుక్మిణి, సత్యభామ సమేతవేణుగోపాలస్వామివారిని దర్శించుకుని తిరు గు ప్రయాణమయ్యారు. మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు.

బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలి

మచిలీపట్నం టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌లో జూన్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. జనసేన కార్యాలయంలో శనివారం జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పా ల్గొనే బీచ్ ఫెస్టివల్‌లో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. రోల్డుగోల్డు, బందరు లడ్డు, బందరు హల్వా, బాదంపాలు, కలంకారీ స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. యువతను ఆకట్టుకునే విధంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారన్నారు. శాఖాహారంతో పాటు మాంసాహారం అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మహమ్మద్ సమీర్, పినిశెట్టి వేణు, కూనపరెడ్డి ప్రసాద్, జన్ను నాగరాజు, కొండా, ఉడుముల బుజ్జి, లంకే శ్రీనివాస్, తిరుమలశెట్టి రాజు తదితరులు పాల్గొన్నార



నాలుగువేల ఎకరాల్లో

ముత్తగూడెం వద్ద కాలువలో పెరిగిన గడ్డి, మొక్కలు

సాగు ప్రశ్నార్థకం!

రాజుపేట, నడింతిరువూరు, పాతతిరువూరు ప్రాంతాల్లోని ఏడు చెరువులకు సాగునీరు అందించే రాకట్టు సప్లయి చానల్(కట్టుకాలువ) పూర్తిస్థాయి అభివృద్ధికి నోచుకోకపోవడంతో, ఆయకట్టు పరిధిలోని సాగుభూముల రైతులు ఏటా ఇబ్బంది పడుతున్నారు. కట్టు కాలువలో తూటుకాడ, ముళ్ల చెట్లు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. కాలువ పరిధిలోని ఏడు చెరువులకు సాగునీరు సక్రమంగా చేరడం లేదు. గతంలోగా నీరందక కొంతమేర భూమే సాగుచేసుకోవాల్సి వస్తుందేమోనని భయం ఆయకట్టు రైతుల్లో నెలకొంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా సాగునీటి లభ్యతపై అనుమానం ఉండడంతో ఆయ కట్టు కింద ఉన్న నాలుగు వేల ఎకరాల్లో ఈ ఏడాది సాగు ప్రశ్నార్థకంగా మారుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది కొందరు టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా కట్టుకాలువలో తూడు, ముళ్లచెట్లు తొలగించి కాలువ పూడిక తీయించారు. దీంతో చెరువులకు నీరు చేరి, ఆయకట్లు పరిధిలోని రైతులకు ఇబ్బంది లేకుండా పోయింది. మళ్లీ కాలువలో తూటుకాడ, ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. కాలువను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తూటు కాడ, ముళ్లచెట్లతో పూడుకుపోయిన రాకట్టు సప్లయి చానల్

- సాగునీరందదని ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- కాలువ అభివృద్ధి చేయాలని వినతి

(తిరువూరు-ఆంధ్రజ్యోతి):

గతంలో ఏడు చెరువులకుగాను గుంటిచెరువును పోతుల చెరువు ఆయకట్టులో కలపడంతో, ఆరు చెరువుల కింద సాగు వర్షంపైనే ఆధారంగా ఉండేది. కనుగులచెరువు ఆయకట్టు 120 ఎకరాలు, మల్లమ్మచెరువు 265.18 ఎకరాలు, గుంటిచెరువు, పోతులచెరువుల 423.84 ఎకరాలు, సోంకుంట 113.91 ఎకరాలు, కొత్తచెరువు 111.40 ఎకరాలు, దేవసముద్రం చెరువు పరిధిలోని 148.23 ఎకరాల ఆయకట్టు వర్షాలపైనే ఆధారపడి సాగు జరిగేది. ఈ చెరువుల ఆయకట్టు పరిధిలో సుమారు 1242.67 ఎకరాలు మొత్తం 717 మంది రైతులకు చెందిన సాగుభూమి ఉంది. సకాలంలో వర్షాలు కురిస్తే చెరువుల కింద ఒక పంట కనాకష్టంగా పడించేవారు. ఒక ఏడాది సక్రమంగా నీరు అందకపోతే ఆ ఏడాది సాగుభూములు బీడుభూములుగా దర్శనమిచ్చేవి.

రాకట్టు చానల్ నిర్మాణంతో పెరిగిన ఆయకట్టు

తిరువూరుకు సమీపంలోని తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పెనుబల్లి



గుట్టపాడు వద్ద పడమటి వాగుపై బెడ్‌డ్యామ్(ఫైల్)

మండలం గుట్టపాడు వద్ద పడమటి వాగుపై 1965లో బెడ్‌డ్యామ్ నిర్మించారు. ఆ డ్యామ్ నుంచి పట్టణంలోని ఏడు చెరువులకు సాగునీరు అందించేలా సప్లయి చానల్ ఏర్పాటుచేశారు. ఏడుచెరువులనూ(రికార్డు ప్రకారం ఆరు చెరువులు) కలుపుతూ 8 కిలోమీటర్ల మేర రాకట్టు సప్లయి చానల్ నిర్మించారు. డ్యామ్ నుంచి కాల్వ పరిధిలోని చెరువులకు సమృద్ధిగా నీరు చేరడంతో, చెరువుల కింద పూర్తిస్థాయిలో భూముల్లో సాగు చేయడంతో 4 వేల ఎకరాలకు ఆయకట్టు పెరిగింది. ఏటా ఏడుచెరువుల్లో వేసవిలోనూ నీరు ఉండటంతో సాగుకు, పశువులకు నీటి కొరత ఉండేది కాదు. ప్రస్తుతం కాలువ సక్రమంగా లేక చెరువులకు నీరు చేరడం లేదు.

23 సంవత్సరాల క్రితం చేసిన అభివృద్ధే..

రాకట్టు సప్లయి చానల్ ను 2000 సంవత్సరంలో ప్రపంచబ్యాంక్ నిధులు రూ.88 లక్షలతో అభివృద్ధి చేశారు. చెరువు కట్టల వెడల్పు, కాల్వపై అవసరమైన చోట కల్వర్టులు నిర్మించారు. ఎనిమిది కిలోమీటర్ల మేర కాల్వను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. 2018లో రూ.3 లక్షలు వెచ్చించి మరోసారి కాల్వలో తూటుకాడ తొలగించారు. కాలువ పరిధిలోని చెరువులకు సమృద్ధిగా సాగునీరు చేరేది. కాలక్రమంలో కాలువ అభివృద్ధిని విస్మరించడంతో కాలువలో తూటుకాడ పెరిగిపోయి మూసుకుపోయింది. సాగునీటి కాలువలు వేసవిలో అభివృద్ధి చేయాల్సి ఉన్నా పదిహేనేళ్లుగా రాకట్టు సప్లయి చానల్ అభివృద్ధిపట్ల అధికారులు పాలకులు దృష్టి సారించకపోవడంతో గుట్టపాడు నుంచి తిరువూరు వరకు రాకట్టు కలవలో తూటుకాడలు, ముళ్ల చెట్లు పెరిగి కాలువ నామరూపాలు లేకుండా ఉంది.

కాలువ అభివృద్ధిపై ఎమ్మెల్యేకు వినతి

రాకట్టు కాలువ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు రాకట్టు సప్లయి చానల్ నీటిసంఘం అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరావు(వాసు) విన్నవించారు. ఎమ్మెల్యే తనవంతు సహకారం అందిస్తానన్నారు. ప్రస్తుతం నీటిసంఘంలో ఉన్న నగదుతో అత్యవసర పనులు చేయాలనే నీటి సంఘం సభ్యులు ఆలోచన చేస్తున్నారు.

1న ఉచిత మోడల్ లా-సెట్ పరీక్ష

గుంటూరు(తూర్పు), మే 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా జూన్ 1వ తేదీన రాష్ట్రస్థాయి ఉచిత మోడల్ లా-సెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కా శీనయ్య, కార్యదర్శి నక్కల నాగరాజు యాదవ్, కన్వీనర్ రవి తెలిపారు. గుంటూరులో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గుంటూరు, శ్రీకాకుళం, నెల్లూరు. తిరుపతి, అనంతపురంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పేర్లు నమోదు కోసం ఆయా జిల్లాల అభ్యర్థులు గుంటూరు- 82974 83785, నెల్లూరు- 99898 50670, తిరుపతి- 94408 10266, అనంతపురం- 94418 88834, శ్రీకాకుళం- 96407 80728 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

28 నుంచి స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం 28వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో క్యాప్, బీసీసీ, ఎన్ఎస్ఎస్ స్పోర్ట్స్, తదితర స్పెషల్ కేటగిరీకి సంబంధించిన ఈ నెల 28వ తేదీ నుంచి 31 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

ఎడ్లపోటీల్లో యనమలకుదురు జతకు ద్వితీయ స్థానం

తర్లుపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): సీతానాగులవరంలో వీరాంజనేయస్వామి జయంతి మహోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపండ్ల విభాగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జతల గిత్తలు పాల్గొన్నాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన సూరా చైత్రారెడ్డి ఎడ్లు 4250 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ బహుమతి రూ.40వేలును గెలుచుకున్నాయి. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు ఎడ్లు 4,200 అడుగుల దూరాన్ని లాగి ద్వితీయ బహుమతిగా రూ.30వేలు గెలుచుకున్నాయి. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన బీఎస్ఎస్ రెడ్డి ఎడ్లు 3960 అడుగుల దూరాన్ని లాగి తృతీయ బహుమతిని రూ.20వేలు, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం కాజీపురం గ్రామానికి చెందిన వేగనాటి ఓసూరారెడ్డి ఎంపీపీ ఎడ్లు 3750 అడుగుల దూరాన్ని లాగి నాలుగో బహుమతిగా రూ.10వేలు, కృష్ణా జిల్లా పెనమలూరు మండలం ఎనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు రెండో జత ఎడ్లు 3116 అడుగుల దూరాన్ని లాగి ఐదో బహుమతిగా రూ.8వేలు, ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం గన్నెపల్లె గ్రామానికి చెందిన డి.కాశీంవలి ఎడ్లు 3012 అడుగుల దూరాన్ని లాగి ఆరో బహుమతిగా రూ.6వేలను గెలుచుకున్నాయి. సత్తా చాటిన ఎడ్ల యజమానులకు కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

పచ్చి ఇటుక.. వర్షార్పణం!

- భారీ వర్షాలతో ఇటుకల వ్యాపారం కుదేల్
- మొన్నటి వరకు ధర లేక ఇబ్బందులు
- ఇప్పుడు వదలని వర్షాలతో అతలాకుతలం
- ఉమ్మడి కృష్ణాజిల్లాల్లో కోట్ల సంఖ్యలో తడిచిన ఇటుక
- నష్టాల బాటలో బట్టీల నిర్వాహకులు

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: ఈ ఏడాది అకాల వర్షాలు ఇటుక బట్టీల నిర్వహకులను కోలుకోలేని విధంగా దెబ్బ తీశాయి. ఇటుకల ఉత్పత్తికి అనువైన ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన అకాల వర్షాలకు బట్టీల నిర్వాహకులు అల్లాడిపోతున్నారు. కనీసం 30శాతం ఉత్పత్తి తీయలేక, తీసిన పచ్చి ఇటుకలు మొత్తం తడిచి పనికిరాక పడరాన్ని పాట్లు పడుతున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చాలా బట్టీల్లో వర్షపు నీరు చేరి తటాకాలను తలపిస్తున్నాయి. వర్షాలకు బట్టీల్లో కోట్లసంఖ్యలో తయారు చేసిన పచ్చి ఇటుకలు అకాల వర్షాలకు తడిచి ముద్దవుతున్నాయి. అకాల వర్షాలకు పచ్చి ఇటుకలపై పట్టాలు కప్పినా ఈదురు గాలులకు లేచిపోయి తడిచిపోతున్నాయి. చాలాబట్టీల్లో వర్షపు నీరు నిలవడి ఇటుకలు మొత్తం పనికి రాకుండా పోయింది. వర్షపు నీటిలో నాని నాని తయారీ ఇటుక మళ్లీ మట్టిగా మారుతుంది. దీంతో బట్టీల నిర్వాహకులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు.

వర్షాలతో అంతా కుదేల్

ప్రతి ఏడాది ఇటుక బట్టీల వ్యాపారులు కూలీలకు ముందుగానే అడ్వాన్స్‌లు ఇచ్చి ఏప్రిల్, మే మాసాల్లో ఇటుకలను తయారు చేయిస్తారు. ఒక్కో పచ్చి ఇటుక తయారీకి రూ.3-4వరకు ఖర్చవుతుంది. పచ్చి ఇటుకలను బట్టీలుగా పేర్చి కాల్చి చల్లారిన తర్వాత బయట అమ్ముతుంటారు. కానీ పచ్చి ఇటుకలను కల్లాలపైనే ఉండగా మొదలైన వర్షాలు ఇప్పటి వరకు ఆగలేదు. ఏప్రిల్, మే నెలల్లో మంచి సీజన్ సమయంలో వర్షాలు పడటంతో బట్టీల నిర్వహకుల నడ్డి విరిగి కోలుకోలేని దెబ్బతీసింది.



తడిచిన ఇటుకలను పక్కకు పేరుస్తున్న కూలీలు

ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా..

ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం నియోజకవర్గంలో రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో పెద్ద ఎత్తున ఇటుక బట్టీల వ్యాపారం నడుస్తుంది. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పరిమితంగా ఉన్నాయి. కృష్ణాజిల్లాలో గన్నవరం నియోజకవర్గంలో వీరపనేనిగూడెం, సూరంపల్లి, మాదలవారిగూడెంలో ఇటుక బట్టీలున్నాయి.

రూ.కోట్లలో పెట్టుబడి పెట్టి..

ఇటుక బట్టీల నిర్వహణకు కోట్లలో పెట్టుబడి అవసరం. మట్టి, నీరు, విద్యుత్, రవాణా సౌలభ్యం ఉన్న ఈ ప్రాంతంల్లో ఇటుక బట్టీల వ్యాపారం బాగుండటంతో వ్యాపారులు 15 ఏళ్ల క్రితం నుంచి బట్టీలకు రూ.కోట్లు పెట్టుబడులు పెట్టారు. అయితే 2014-19 అప్పటి టీడీపీ ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించడం, ఉచిత ఇసుక పథకం అమలు చేయడంతో ఇటుకల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. 2019లో వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి బట్టీల వ్యాపారానికి గ్రహణం పట్టింది. ఐదేళ్ల ఇటుకల వ్యాపారం దినదిన గండంగా సాగింది. కూటమి ప్రభుత్వం రావడం, రాజధానిలో పనులు ఊపందుకుంటున్న తరుణంలో వరుణుడి దెబ్బకు మరోమారు వ్యాపారం కుదేలయ్యింది.



కుంటముక్కలలో బట్టీల్లో పచ్చి ఇటుకలపై కప్పిన పట్టాలు

ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

వేల మంది స్థానిక కూలీలకు, ఇతర రాష్ట్రాల కూలీలకు, పలు యంత్రాలకు, ట్రాక్టర్లకు పనులు కల్పిస్తూ కుటీర పరిశ్రమగా కొనసాగుతున్న ఇటుక బట్టీల వ్యాపారులను ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యాపారులు కోరుతున్నారు. రాయితీపై రాట్పాలిన్ పట్టాలు, విద్యుత్ రాయితీ, బూడిద, మట్టి, పొట్టు, బొగ్గు, ఇతర ముడి సరుకులు తక్కువ ధరలకు అందిస్తే ప్రకృతి వైపరీత్యాల సమయంలో వచ్చే నష్టాలను అధిగమించి నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని నిర్వాహకులు కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా ట్రాఫిక్

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మచిలీపట్నం టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం కోనేరుసెంటర్‌లో ఇటీవల వాహనాలు అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యపై పలు పర్యాయాలు జిల్లా అధికారుల ముందు ప్రజలు ఉంచారు. అయినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఈ సందర్భంగా మచిలీపట్నం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వెంటనే డీఎస్పీని నియమించి పట్టణంలో ట్రాఫిక్‌ను నియంత్రణ చేయాలని కృష్ణాజిల్లా ఎస్పీ ని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. శనివారం బాలాజీ పాత్రికేయులతో మాట్లాడుతూ, కోనేరుసెంటర్ చుట్టుపక్కల, బెల్లం కొట్ల సందు, జగన్నాథపురం ప్రాంతాల్లో ఆటోలు, లారీలు, మినీ వ్యాన్లు విచ్చలవిడిగా పార్కింగ్ వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ట్రాఫిక్ పోలీసులు బచ్చుపేట ఆంజనేయస్వామి గుడివద్ద చలానాలు రాసేందుకు చూపుతున్న ఉత్సాహం ట్రాఫిక్ నియంత్రణలో చూపడం లేదన్నారు. రాధికా థియేటర్ వద్ద, మూడుస్తంబాల సెంటర్లో లారీలు, టైర్ షాపులు ఆక్రమణలతో నిండిపోయిందని, ఇటువైపు ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి చూడటం లేదన్నారు. తక్షణమే ట్రాఫిక్ నియంత్రణ చేయాలని, నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ట్రాఫిక్ పోలీసులపై ఉందని బాలాజీ అన్నారు. లారీలు, ఆటోలు, టూ వీలర్స్‌కు పార్కింగ్ ప్లేస్‌లు ఏర్పాటు చేయాలని బాలాజీ కోరారు. ఎంతో విశాలమైన మునిసిపల్ కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా ఉందని దానిని పార్కింగ్ కోసం ఉపయోగించాలని బాలాజీ సూచించారు.

అయ్యో.. మొక్కజొన్న!

ఎన్నో ఆశలతో వ్యయ ప్రయాసాలకోర్చి పండించిన మొక్కజొన్న పంట అకాల వర్షాలతో చేతికి అందని పరిస్థితి ఏర్పడిందని గుర్విందపల్లి ఎస్సీ సొసైటీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విడవని వర్షాలతో కోయకుండానే మొలకెత్తుతున్న కండెలను చూసి కన్నీరు పెడుతున్నారు. అల్పపీడనాలు, తరుముకొస్తున్న రుతుపవనాలతో మరింత కలత చెందుతున్నారు. తడిచిన, రంగు మారిన మొక్కజొన్నను మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- గుర్విందపల్లిలంకలో వందెకరాల్లో మొక్కజొన్న సాగు
- విడవని వర్షాలతో కోయకుండానే మొలకెత్తుతున్న కండెలు
- అల్పపీడనాలు, తరుముకొస్తున్న రుతుపవనాలతో ఆందోళన
- రొయ్యూరులో కరకట్టపై నానుతున్న పంట

తోట్లవల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి):

తోట్లవల్లూరు మండలం గుర్విందపల్లి లంకలో ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూముల్లోని వందెకరాల్లో మార్చిలో మొక్కజొన్న సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. గత కొన్ని రోజులుగా అకాల వర్షాలు ముంచెత్తుతుండటంతో కండెలను కోయలేని పరిస్థితి ఏర్పడింది. కృష్ణానది వరదలకు సొసైటీ భూముల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోవటంతో మళ్లీ కొత్త లైన్‌లు వేయటం ఆలస్యం అయింది. మార్చిలో వందెకరాల్లో రైతులందరూ మొక్కజొన్న సాగు చేశారు. సాగు ఆలస్యంగా చేపట్టినా వెనుకడుగు వేయకుండా పంటను పండించగలిగారు. ఈ అకాల వర్షాలతో ఒక్క ఎకరంలో కూడా పంటను కోయలేదని రైతులు చెబుతున్నారు. పొడి వాతావరణం వచ్చాక పంట కోద్దామని ఎదురు చూస్తుంటే వర్షాలు విడవకుండా కురుస్తుండటంతో అలాగే ఉండిపోయామని అంటున్నారు. దీంతో కోత కోయకుండానే కండెలపై గింజలు మొలకలు వస్తున్నాయని, తడికి గింజలు రంగుమారి బూజు పడుతున్నాయని చెబుతున్నారు. బలమైన ఈదురు గాల్పులకు మొక్కజొన్న కర్రలు చెల్లాచెదురుగా పడిపోతున్నాయని, అల్పపీడనం ఏర్పడటం,



రంగుమారి బూజుపట్టిన గింజలు

రుతు పవనాలు దగ్గరపడటంతో వర్షాలు తగ్గే అవకాశం కనిపించటం లేదంటున్నారు. ఇదేవిధంగా వర్షాలు కురిస్తే పొలంలోనే పంట పాడవటం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదీపాయల్లోకి వరద నీరు విడుదలైతే ఆ పొలాలకు వెళ్లలేని పరిస్థితి వస్తుందని, దీంతో లక్షలాది రూపాయల పంట చేతికి వచ్చే అవకాశం లేదని రైతు వెలివెల వెంకటేశ్వరరావు చెప్పారు. ఒక్కో ఎకరానికి రూ.30 వేట నుంచి రూ.40వేల వరకు ఖర్చు చేశామని, సాగు ఖర్చులు నష్టపోయే పరిస్థితి వస్తుందంటున్నారు.



గుర్విందపల్లి లంకలో భారీ వర్షాలకు కండెలు కోయటానికి వీల్లేకుండా పడిపోయిన మొక్కజొన్న తోట

మద్దతు ధర రాక అవస్థలు

రొయ్యూరు వద్ద కరకట్టపై మొక్కజొన్న పంటను కోసి ఆరబెట్టిన రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో వర్షానికి తడవటం పగలు ఆరబెట్టటం, మళ్లీ రాత్రి వర్షానికి తడవటం జరుగుతోంది. ఇలా తడిసిన మొక్కజొన్నకు మద్దతు ధర రావటం లేదని రైతులు చెబుతున్నారు. క్వింటా మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2,250 ఉంటే రూ.500 తగ్గించి వ్యాపారులు కొంటున్నారు. ఇంకా లంకల్లో పలు చోట్ల మొక్కజొన్న రైతులు అకాల వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 4,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగవగా 80 శాతం పంటను రైతులు అమ్ముకోగలిగారు. ఇంకా 20 శాతం పంట లంకల్లో మిగిలిపోయింది. అకాల వర్షాలకు మొక్కజొన్న తడిసి రంగుమరినా, మొలకలు వచ్చినా మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అధికారులతో పర్యవేక్షణ చేయించి సహాయం అందించాలని కోరుతున్నారు.









ఏపీ ప్రభుత్వంపై కనీస మర్యాద కూడా లేని

తెలుగు చిత్ర పరిశ్రమ



- రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినందుకు పవన్ కృతజ్ఞతలు
- ఇకపై వ్యక్తిగత చర్చలు ఉండవు.. సినిమా సంఘాల ప్రతినిధులు రావాల్సిందే
- థియేటర్ల బంద్‌పై ఘాటుగా స్పందించిన ఏపీ డిప్యూటీ సీఎం కార్యాలయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే - తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఏపీ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా సీఎం చంద్రబాబును తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారైనా మర్యాద పూర్వకంగా కలిశారా? అని ఆయన ప్రశ్నించారు. తెలుగు చిత్ర పరిశ్రమను, అగ్రనటులను గత ప్రభుత్వం ఏ విధంగా ఛీత్కరించుకొని ఇబ్బంది పెట్టిందో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆరిస్ట్ అసోసియేషన్ లాంటి సంఘాలు మరచిపోయినట్లున్నాయని ఆయన గుర్తు చేశారు. పరిశ్రమ ఇచ్చిన రిటన్ గిఫ్ట్‌ను తను తగిన విధంగానే స్వీకరిస్తున్నాని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ రిటర్న్ గిఫ్ట్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. జూన్ ఒకటినుంచి థియేటర్ల బంద్ లేదని ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు వెల్లడించిన కొద్ది గంటలకే పవన్‌కల్యాణ్ ఈ ప్రకటన విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆ ఇబ్బందుల్ని మరచిపోయారా?

"రూ.కోట్ల రూపాయల పెట్టుబడులతో రూపొందే చిత్రాలకు అన్ని విధాలా ప్రోత్సహం ఇవ్వడంతో పాటు సృజనాత్మకత ముడిపడిన ఈ వ్యాపారంలో ఉన్నవారి గౌరవ మర్యాదలకు భంగం వాటిళ్లకూడదని కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు కూడా స్పష్టంగా చెప్పాయి. గత ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది, కక్ష సాధింపులకు దిగేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో తహసీల్దార్లను థియేటర్లు దగ్గర నియమించి ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా..? ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చెప్పిన విధంగానే, కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు. అక్కినేని నాగార్జున కుటుంబానికి చెందిన వారి చిత్రం విడుదలైనప్పుడు ఏపీ ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించింది. వ్యవస్థ బాగుండాలి, దానిపై ఆధారపడ్డ వారు ఇబ్బందిపడకూడదు అనేది కూటమి ప్రభుత్వం విధానం. తెలుగు సినిమా రంగం వారు తమ సినిమా విడుదల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి అర్జీలు ఇచ్చి, టిక్కెట్ ధర పెంచమని కోరడం ఎందుకు..? అందరూ కలిసి వచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించమని పవన్ కల్యాణ్ సూచించారు. దిల్‌రాజు, అల్లు అరవింద్, .సురేశ్ బాబు, సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు అని కూడా తెలిపారు. అయినప్పటికి ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూనే ఉంది" ఏపీ డిప్యూటీ సీఎం కార్యాలయం పేర్కొంది.

సినిమా రంగం కోసం ప్రత్యేక పాలసీ..

ఇక నుంచి వ్యక్తిగత విజ్ఞాపనలు, చర్చలకు తావులేదు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తారు. వాటినే సంబంధిత విభాగాలకు పంపిస్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పర్యటక రంగానికి పరిశ్రమ హోదా ఇస్తూ పాలసీని ప్రకటించింది. అదే విధంగా సినిమా రంగం అభివృద్ధి కోసం ప్రత్యేక పాలసీ తీసుకురావాలని పవన్ ఆలోచన చేశారు. దీనిపై సీఎంతో చర్చించనున్నారు. అనంతరం కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీని ప్రకటిస్తారు.

థియేటర్ల ఆదాయంపై ఆరా

పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో సంబంధిత శాఖలతో సినిమా రంగం అభివృద్ధిపై ఇప్పటికే కొన్ని చర్చలు చేశారు. ఇందులో పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు ఒక గ్రూపుగా ఏర్పడి చేస్తున్న వ్యవహారాలతో పాటు ప్రేక్షకులు వెచ్చిస్తున్న మొత్తాలు, అందుకు అనుగుణంగా వారు పొందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి. తదితర అంశాలను చర్చించారు. థియేటర్లను సంబంధిత యజమానులు నడపటం లేదని, లీజుదారుల చేతిలోనే అత్యధికంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే లీజుదారుల నుంచి పన్ను సక్రమంగా వస్తుందా లేదా...? కొన్ని చిత్రాలకు టిక్కెటు ధరలు పెంచినప్పుడు ఆ మేరకు పన్ను ఆదాయం పెరిగిందా..? లేదా..? అని కూడా పన్నుల విభాగం పరిశీలన చేయాలని దిశానిర్దేశం చేశారు. రాయలసీమ జిల్లాల్లో థియేటర్ల నుంచి వచ్చే ఆదాయంపైన ఈ సందర్భంగా చర్చించారు. టికెట్ సేల్‌కి, వచ్చే పన్నుకి అంతరం ఏ మేరకు ఉందో చూడాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో మల్టీప్లెక్సులు ఎన్ని ఉన్నాయి..?

రాష్ట్రంలో మల్టీప్లెక్స స్థాయి సినిమా హాల్స్ ఎన్ని ఉన్నాయో తెలియచేయాలని ఇప్పటికే సినిమాటోగ్రఫీ శాఖ అధికారులను ప్రభుత్వం నివేదిక అడిగింది. కొన్ని పట్టణాల్లో సింగిల్ థియేటర్లను కూడా రెండు, మూడు స్క్రీన్స్‌గా విభజించి మల్టీప్లెక్స విధానంలో నడుపుతున్నారు. వాటిలో టికెట్ ధరలు, సింగిల్ థియేటర్ టికెట్ ధరలకు ఏమైనా వ్యత్యాసం ఉందా..? కౌంటర్‌లో ఏ ధరకు అమ్ముతున్నారో ఆరా తీస్తున్నారు. విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, కాకినాడ, తిరుపతి తదితర నగరాల్లో ఉన్న మల్టీప్లెక్సల నిర్వహణ వాటిలోని టికెట్ ధరలు, ఆహార పదార్థాల ధరలపై కూడా దృష్టిసారిస్తారు.

నైపుణ్యాల పెంపుతోనే పరిశ్రమగా అభివృద్ధి...

కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీ ద్వారా రాష్ట్రంలో సినిమా రూపకల్పన నుంచి వాణిజ్యం వరకూ 24 విభాగాల్లో నైపుణ్యాలు పెంపుదల, ఆధునాతన సాంకేతిక వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. పరిశ్రమహోదా కల్పించడంతో పాటు యువతలోనూ, ఇప్పటికే చిత్ర రంగంలో ఉన్న వారికి ఎప్పటికప్పుడు నైపుణ్యాల అభివృద్ధి కోసం - అవసరమైన శిబిరాలు, సెమినార్లు, సింపోజియమ్స్ లాంటివి ఆంధ్రప్రదేశ్‌లో విరివిగా నిర్వహిస్తారు. సినిమా రంగంలో స్టూడియో నుంచి సినిమా హాల్ వరకూ ఉండే విభాగాల్లో గుత్తాధిపత్యం కంటే ఎక్కువ మందికి అవకాశాలు కల్పిస్తేనే, పెట్టుబడులు పెరిగి పరిశ్రమగా వృద్ధి చెందుతుంది. ఈ దిశగానే పవన్ కల్యాణ్ ఆలోచన చేశారు. కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీ ద్వారా ఏపీలో సినిమా రంగం అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి)

సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి దుర్గేష్



సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంతి దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు మూసివేయాలన్న ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల నిర్ణయంపై ఆరా తీస్తున్నామన్నారు. సినీరంగ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య అనుకూల వాతావరణం ఉందన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధి కోసమే నూతన ఫిల్మ్ పాలసీ తెస్తున్నామన్నారు. చిత్ర పరిశ్రమకు, ఎగ్జిబిటర్లకు డిస్ట్రిబ్యూటర్లకు, ప్రొడ్యూసర్‌లకు ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకునేందుకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో విచారణ చేపడుతున్నామన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సినీపరిశ్రమకు చెందిన వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను ఆరా తీసి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారని చెప్పారు. 'హరిహర వీరమల్లు' సినిమా విడుదలకు ముందు ఈ తరహా వ్యవహారం దేనికి సంకేతమని మంత్రి ప్రశ్నించారు.

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)

ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై, చిత్ర పరిశ్రమలోని పరిస్థితులపై నిర్మాతలు బన్నీవాసు, నాగవంశీ స్పందించారు. "సినీ ఇండస్ట్రీలో రాజకీయాలు చాలా సైలెంట్‌గా.. లోతుగా ఉంటాయి. ఈ రాజకీయాల్లో పరిశ్రమ నలిగిపోతోందనే వాస్తవాన్ని ఇప్పటికైనా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు గ్రహించాలి. సినిమాల నుంచే వెళ్లి, డిప్యూటీ సీఎం అయిన వారికే మనం ఆగ్రహం తెప్పించామంటే.. మన ఐకమత్యాన్ని ప్రశ్నించుకోవాల్సిన సమయమిది"

\- బన్నీవాసు

"పెద్ద సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో.. అనవసరం లేని సమస్యలను సృష్టించారు. ఇప్పుడు అవే పెరిగి పెద్దవయ్యాయి. విచక్షణతో ఆలోచించి ఉంటే పరిస్థితి దాకా వచ్చేది కాదు.. ఇలాంటి సమస్యలూ వచ్చేవి కావు"

\- నాగవంశీ

థియేటర్ల బంద్ లేదు

- సమస్యల పరిష్కారానికి కమిటీ



'ఏదో ఒక సినిమాను టార్గెట్ చేసి, థియేటర్లను బంద్ చేస్తున్నారు అనే ప్రచారాన్ని ఖండిస్తున్నాం. జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ లేదు. ఈ విషయంపై అవసరం వస్తే ప్రభుత్వంతో సైతం చర్చిస్తాం' అని ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ స్క్రీన్‌ల బంద్ అంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ఆయన స్పష్టతనిచ్చారు. థియేటర్ల బంద్ అంశంపై కొన్ని రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. వీరంతా ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడిగా సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ 'జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ జరగడం లేదు. ఈ నెల 30న ఈసీ మీటింగ్ ఉంటుంది. ఆ రోజు మూడు విభాగాల సభ్యులతో కమిటీ వేయబోతున్నాం. తద్వారా ఈ సమస్యకు నిర్దీత సమయంలో పరిష్కారం వచ్చే అవకాశం ఉంది. చిత్ర పరిశ్రమ కష్టాలను బయట వారెవ్వరూ తీర్చరు. స్వయంగా పరిశ్రమే అందులో నుంచి బయటపడుతుంది' అని చెప్పారు.

మంచి మాస్ రోల్ చేశాను

బెల్లంకొండ సాయి శ్రీనివాస్



"నన్ను ఇష్టపడే ప్రతి ప్రేక్షకుడి కోసం 'భైరవం' చిత్రం చేశాను. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ బలమైన మాస్ పాత్రని చేశాను. మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. వంద శాతం వినోదాన్ని పంచుతుంది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన చిత్రమిది. కేకే రాధామోహన్ నిర్మించారు. ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్ మీడియాతో ముచ్చటించారు.

● 'భైరవం' చిత్రంలో పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. ఈ సినిమాలో హీరో కొలిచేది కాలభైరవుణ్ణి. అలా కథలో నుంచే 'భైరవం' టైటిల్ వచ్చింది. సరికొత్త అంశాలతో వినూత్న కథాంశంతో సాగుతుంది. గ్రామీణ నేపథ్యంలో మాస్ అంశాలతో ఓ సినిమా చేయాలనుకుంటున్న తరుణంలో 'భైరవం' కథ నా దగ్గరకు వచ్చింది. నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. పల్లె వాతావరణంలో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది. దర్శకుడు విజయ్‌తో పని చేయడం మంచి అనుభవం. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు పలు మార్పులు చేసి సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన మార్క్ బలంగా కనిపిస్తుంది. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. ముఖ్యంగా పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్. సినిమా చూశాక విజయ్ కథకు తన పరిధిలో పరిపూర్ణంగా న్యాయం చేశారనే ఫీలింగ్ కలిగింది. వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగభరితంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి.

● నారా రోహిత్, మంచు మనోజ్ పాత్రలు కథలో చాలా కీలకం. అందరికీ గుర్తుండిపోయేలా వారి పాత్రలను దర్శకుడు తీర్చిదిద్దారు. డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రల్లో వారిద్దరూ అలరిస్తారు. అదితీ శంకర్ వెరీ నైస్ పర్సన్. నటనలో తనదైన శైలీ, హావభావాలతో మెప్పిస్తుంది. అలాగే తను మంచి సింగర్, డాన్సర్ కూడా. ఈ సినిమాతో ఆమె ప్రతిభకు తగ్గ గుర్తింపు దక్కుతుంది. శ్రీచరణ్ పాకాల అద్భుతమైన సంగీతం ఇచ్చారు. పాటలకు మంచి స్పందన లభిస్తోంది. రాధామోహన్ గారు నాకు చాలా ఇష్టమైన ప్రొడ్యూసర్. హీరోగా నాకు చక్కటి సంతృప్తిని మిగిల్చే సినిమా ఇచ్చారు. ప్రస్తుతం 'హైందవ', 'టైసన్ నాయుడు', 'కిష్కింధపురి' చిత్రాలు చేస్తున్నాను.



ఫైనల్‌కు శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్

కౌలాలంపూర్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. అప్పుడెప్పుడో 2019లో ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తెలుగు షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఆరేళ్ల తర్వాత ఓ బీడబ్ల్యూఎఫ్ టూర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరాడు. ఫామ్‌లేమికి చెక్ పెడుతూ, తన జోరు కొనసాగిస్తూ కిడాంబి.. మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్‌ఫైట్‌కు దూసుకెళ్లాడు. శనివారం ఇక్కడ జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో 32 ఏళ్ల శ్రీకాంత్ 21-18, 24-22తో జపాన్‌కు చెందిన యుషి తనకను ఓడించాడు. ఆదివారం జరిగే తుదిపోరులో చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

పంజాబ్‌కు పంచ్

విజయంతో ఢిల్లీ బైబై

రాణించిన సమీర్ రిజ్వీ • ముస్తాఫిజుర్‌కు 3 వికెట్లు



సమీర్ రిజ్వీ (58 నాటౌట్)

జైపూర్: టాప్-2లో నిలిచేందుకు పోటీపడుతున్న జట్లకు వరుసగా మూడో రోజూ ప్రతికూల ఫలితమే ఎదురైంది. గుజరాత్, బెంగళూరు తరహాలోనే తాజాగా పంజాబ్ కింగ్స్‌కు పంచ్ పడింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి తప్పుకొన్న ఢిల్లీ క్యాపిటల్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అదరగొట్టింది. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్‌పై శనివారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 15 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. భారీ ఛేదనలో సమీర్ రిజ్వీ (25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 206 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 53), స్టొయినిస్ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 44 నాటౌట్), ఇన్‌గ్లిస్ (12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించారు. ముస్తాఫిజుర్‌కు 3.. విప్రజ్, కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు రాహుల్ (35), డుప్లెసి (23) తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఆ తర్వాత కరుణ్ నాయర్ (44) భారీ షాట్లతో విరుచుకుపడగా.. డెత్ ఓవర్లలో సమీర్ రిజ్వీ పంజాబ్ బౌలర్లను ఆడుకున్నాడు. అతడికి స్టబ్స్ (18 నాటౌట్) సహకరించడంతో ఢిల్లీ ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. చివరి ఓవర్‌లో 8 పరుగులే అవసరమవగా, రిజ్వీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. హర్‌ప్రీత్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సమీర్ రిజ్వీ నిలిచాడు.

స్టొయినిస్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయాస్ నిలకడతో పాటు ఆఖర్లో స్టొయినిస్ జోరుతో జట్టు 200 దాటింది. ఓపెనర్ ప్రియాన్ష్ (6) విఫలమైనా ప్రభ్‌సిమ్రన్-ఇన్‌గ్లిస్ జోడీ చెలరేగింది. ఆరో ఓవర్‌లో 6,4 బాది ఇన్‌గ్లిస్ అవుటైనా పవర్‌ప్లేలో జట్టు 60/2 స్కోరు సాధించింది. రెండో వికెట్‌కు వీరు 47 పరుగులు జత చేశారు. విప్రజ్ బౌలింగ్‌లో స్కూప్ షాట్‌కు వెళ్లి ప్రభ్‌సిమ్రన్ బౌల్డయ్యాక ఆటలో కాస్త వేగం తగ్గింది. అయితే శ్రేయాస్ అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. నేహల్ (16), శశాంక్ (11) విఫలమైనా కెప్టెన్‌కు స్టొయినిస్ సహకరించాడు. 17వ ఓవర్‌లో అతడి 6,6,4.. శ్రేయాస్ 4తో 25 పరుగులు వచ్చాయి. కానీ కుల్దీప్ ఒకే ఓవర్‌లో శ్రేయాస్, అజ్మతుల్లా (1) వికెట్లు తీశాడు. అయినా 19వ ఓవర్‌లో మరోసారి చెలరేగిన స్టొయినిస్ 6,4,4,6తో 22 రన్స్ రాబట్టాడు. ముస్తాఫిజుర్ ఆఖరి ఓవర్‌లో పది పరుగులే ఇచ్చి జాన్సెన్ (0)ను అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 6, ప్రభ్‌సిమ్రన్ (బి) విప్రజ్ 28, ఇంగ్లిస్ (స్టంప్డ్) స్టబ్స్ (బి) విప్రజ్ 32, శ్రేయాస్ (సి) మోహిత్ (బి) కుల్దీప్ 53, నేహల్ (సి) డుప్లెసి (బి) ముకేశ్ 16, శశాంక్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 11, స్టొయినిస్ (నాటౌట్) 44, అజ్మతుల్లా (సి) రిజ్వీ (బి) కుల్దీప్ 1, జాన్సెన్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 0, హర్‌ప్రీత్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 206/8, వికెట్ల పతనం:** 1-8, 2-55, 3-77, 4-118, 5-144, 6-172, 7-174, 8-197; బౌలింగ్: ముకేశ్ 4-0-49-1, ముస్తాఫిజుర్ 4-0-33-3, మోహిత్ శర్మ 4-0-47-0, విప్రజ్ 4-0-38-2, కుల్దీప్ 4-0-39-2.

ఢిల్లీ: రాహుల్ (సి) శశాంక్ (బి) జాన్సెన్ 35, డుప్లెసి (సి) ప్రియాన్ష్ (బి) హర్‌ప్రీత్ 23, కరుణ్ నాయర్ (బి) హర్‌ప్రీత్ 44, అటల్ (సి) అర్ష్‌దీప్ (బి) ప్రవీణ్ దూబే 22, సమీర్ రిజ్వీ (నాటౌట్) 58, స్టబ్స్ (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.3 ఓవర్లలో 208/4; వికెట్ల పతనం:** 1-55, 2-65, 3-93, 4-155; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-0, అజ్మతుల్లా 4-0-46-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-41-2, జాన్సెన్ 4-0-41-1, ప్రవీణ్ దూబే 2-0-20-1, స్టొయినిస్ 1.3-0-21-0.

నేటి మ్యాచ్‌లు

మ్యాచ్	సమయం	వేదిక
గుజరాత్ x చెన్నై	మ.3.30 నుంచి	వేదిక: అహ్మదాబాద్
హైదరాబాద్ x కోల్‌కతా	రా.7.30 నుంచి	వేదిక: ఢిల్లీ

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.737
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

టెస్టుల్లో కొన్నేళ్లుగా జట్టుకు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్, కోహ్లీ ఒక్కసారిగా గుడ్‌బై చెప్పడంతో.. సంధి దశలో ఉన్న టీవీ ఎండియాను నడిపించే నవతరం నాయకుడిగా శుభ్‌మన్ గిల్ సరికొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాడు. యువ సారథిగా భవిష్యత్ భారత జట్టును నిర్మించనున్నాడు. ఇంగ్లండ్ టూర్‌లో గిల్ నూతన ప్రస్థానం ఆరంభం కానుంది. ఐపీఎల్‌లో అదరగొడుతున్న సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి రెడ్‌బాల్ జట్టులో చోటు దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న కరుణ్ నాయర్‌కు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.



నవతరం నాయకుడు వచ్చాడు

శుభ్‌మన్ గిల్‌కే టెస్టు జట్టు పగ్గాలు

సుదర్శన్, అర్ష్‌దీప్‌కు పిలుపు

- వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్
- బుమ్రా ఆడేది కొన్ని మ్యాచ్‌లే
- ఫిట్‌నెస్ లేమితో షమి అవుట్



అర్ష్‌దీప్

సుదర్శన్

ముంబై: రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత జట్టు పగ్గాలు అందుకొనేది ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. ఊహాగానాలకు తగినట్టుగానే భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. వచ్చేనెల 20 నుంచి జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటించే టీమిండియాను శనివారం సెలెక్టర్లు ప్రకటించారు. డాషింగ్ బ్యాటర్, 27 ఏళ్ల రిషభ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత సంధి దశలో ఉన్న భారత జట్టుకు అంతగా అనుభవం లేని 18 మంది సభ్యుల జట్టును సెలెక్టర్లు ఎంపిక చేసి ఒకరకంగా సాహసమే చేశారు. 32 టెస్టులు ఆడిన గిల్ 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. కాగా, ఈ పర్యటన నుంచి పెద్దగా ఆశిస్తున్నదేమీ లేని నేపథ్యంలో గిల్ సాధించే అనుభవం భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని సెలెక్టర్లు చెబుతున్నారు. 'ఏడాది క్రితమే గిల్‌పై దృష్టిసారించాం. భవిష్యత్‌లో భారత జట్టును నడిపించగల సామర్థ్యం అతడిలో ఉందని భావించాం' అని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. కాగా, సుదీర్ఘ సిరీస్‌కు ఫిట్‌గా ఉండడన్న కారణంతో సీనియర్ పేసర్ మహ్మద్ షమిని జట్టు నుంచి తప్పించారు. అయితే, వైద్యుల సూచనల మేరకు షమిని పరిగణనలోకి తీసుకోలేదని అగార్కర్ తెలిపాడు. అతడి స్థానంలో ఐపీఎల్‌లో అదరగొడుతున్న అర్ష్‌దీప్ సింగ్‌ను తొలిసారి టెస్టులకు ఎంపిక చేసినట్టు చెప్పాడు. 'ఐపీఎల్ సందర్భంగా గతవారం గాయానికి గురైన షమి ఇటీవలే ఎంఆర్ఐ స్కాన్ తీయించుకొన్నాడు. అయితే, సిరీస్‌కు అతను ఫిట్‌గా ఉండడని వైద్యులు తేల్చారు' అని అగార్కర్ తెలిపాడు. మొత్తంగా టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ (2025-27) కోసం భారత జట్టు నిర్మాణం ఇంగ్లండ్ సిరీస్‌తో ఆరంభమవుతుంది. గిల్ భారత టెస్టు జట్టుకు 37వ కెప్టెన్.

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్, జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్.



నాయర్.. 8 ఏళ్ల తర్వాత

రోహిత్, కోహ్లీ స్థానాల్లో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ జట్టులోకొచ్చారు. ఈ ఐపీఎల్‌లో పరుగుల వరదపారిస్తున్న గుజరాత్ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు తొలిసారి పిలుపు అందగా.. ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ రీఎంట్రీ ఇచ్చాడు. ఈ ఐపీఎల్‌లో సుదర్శన్ 638 రన్స్ చేసి టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. ఇక, నాయర్ చివరిసారిగా 2017లో టెస్టు ఆడాడు. సెహ్వాగ్ తర్వాత టీమిండియాలో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డులకెక్కిన కరుణ్.. ఆ తర్వాత అంతగా ఆకట్టుకోలేకపోయాడు. కానీ, దేశవాళీలో మెరుగైన ప్రదర్శనతో సెలెక్టర్ల తలుపులు తడుతూనే ఉన్నాడు. అయితే కోహ్లీ రాజీనామాతో నాయర్‌కు అదృష్టం కలిసొచ్చింది. పేసర్ హర్షిత్ రాణా, బ్యాటర్లు శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌లకు జట్టులో చోటు దక్కలేదు. అయితే, సర్ఫరాజ్‌కంటే అనుభవజ్ఞుడైన నాయర్‌కు సెలెక్టర్లు ఓటేశారు. ఆస్ట్రేలియా టూర్‌లో ఆడిన దేవ్‌దత్ పడిక్కల్ ఫిట్‌నెస్ సమస్యలతో చోటు కోల్పోయాడు.



5

పిన్న వయసులో భారత టెస్టు జట్టు సారథిగా ఎంపికైన ఐదో ఆటగాడు గిల్ (25 ఏళ్ల 258 రోజులు). మన్సూర్ అలీఖాన్ పటౌడి (21 ఏళ్లు), సచిన్ (23 ఏళ్లు), కపిల్ దేవ్ (24 ఏళ్లు), రవిశాస్త్రి (25 ఏళ్ల 229 రోజులు).. గిల్ కంటే ముందున్నారు.



బుమ్రాకు ఎందుకు వద్దంటే..?

కెప్టెన్సీ కోసం గిల్‌తోపాటు బుమ్రా పేరు గట్టిగానే వినిపించింది. అయితే, ఫిట్‌నెస్ ఇబ్బందుల కారణంగానే బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించలేదు. అసలు సిరీస్‌లోని ఐదు టెస్ట్‌లకు బుమ్రా అందుబాటులో ఉండడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. బుమ్రాపై పని ఒత్తిడి భారం పడకుండా చూడాలని ఫిజియో, వైద్యులు సూచించారు. ఈ క్రమంలో బుమ్రా రెండు, మూడు టెస్టులకే అందుబాటులో ఉండే అవకాశాలున్నాయని అగార్కర్ పేర్కొన్నాడు. రిజర్వు ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను ఎంపిక చేశారు. అయితే, బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ సామర్థ్యంపై సందేహాలుండడంతో.. శార్దూల్ ఠాకూర్‌కు కూడా జట్టులో చోటిచ్చారు. శార్దూల్ చివరిగా 2023లో టెస్టు ఆడాడు. గత ఇంగ్లండ్ పర్యటనలో ఓవల్ టెస్ట్‌లో శార్దూల్ వరుసగా అర్ధ శతకాలు బాదడంతో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఇక 'శుభ్' ఆరంభం

టెస్టుల్లో రోహిత్ వారసుడిగా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌కు టెస్టు పగ్గాలు అప్పగించారు. భారత క్రికెట్‌కు వెన్నెముకగా నిలిచిన విరాట్, రోహిత్ దూరమైన వేళ ఈ సంధి దశను అధిగమించేందుకు బీసీసీఐ ఈ యువ ఆటగాడిపై భరోసా ఉంచడం విశేషమే. అరంగేట్రం చేసిన ఐదేళ్లకే కెప్టెన్‌గా అందలం దక్కడంతో గిల్ కెరీర్ గ్రాఫ్‌ను నెటిజన్లు కొనియాడుతున్నారు. 2018 అండర్-19 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌పై సెంచరీతో గిల్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. అప్పటి కోచ్ ద్రవిడ్ పట్టుబట్టి మరీ గిల్‌ను జట్టులోకి తీసుకున్నాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ టూర్‌లో ఇండియా 'ఎ' తరఫున రాణించాడు. అలాగే వెస్టిండీస్ 'ఎ'తో జరిగిన టెస్టులో డబుల్ సెంచరీతో వెనుదిరిగి చూడలేదు. చక్కటి టెక్నిక్, టెంపర్‌మెంట్ కలిగిన బ్యాటింగ్ కారణంగా 2019లోనే వన్డే జట్టులోకొచ్చాడు. అయితే గిల్ సక్సెస్ వెనుక అతడి తండ్రి లఖ్విందర్ కృషి ఎనలేనిది. కొడుకు ధ్యాసంతా క్రికెట్‌పైనే ఉండేందుకు తమ గ్రామం నుంచి మొహాలీకి మకాం మార్చాడు. కొన్నేళ్లపాటు బంధువుల వివాహాలకు కూడా హాజరుకాలేదట. అప్పటి త్యాగాలకు ప్రస్తుతం ఘనమైన ప్రతిఫలమే దక్కింది. పాతికేళ్ల వయస్సులోనే సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టును నడిపించే స్థాయికి ఎదిగాడు. మరోవైపు ఈ ప్రయాణం సవాళ్లతో కూడుకున్నదే అయినా.. భారత టెస్టు జట్టు గిల్ ఆధ్వర్యంలో శుభ్ ఆరంభంగా కొనసాగాలని ఆశిద్దాం.



ఆ ఇద్దరి లోటు పూడ్చలేనిది: అగార్కర్

జట్టులో రోహిత్, కోహ్లీ లేని లోటును పూడ్చడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. కానీ, రాబోయే ఇంగ్లండ్ టూర్‌లో వినూత్నంగా ఆటగాళ్లు ఆ బాధ్యతలు అందుకొంటారని ఆశిస్తున్నట్టు చెప్పాడు. ఈ నెల 7న రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించగా.. 12న కోహ్లీ టెస్టుల నుంచి వైదొలుగుతున్నట్టు బాంబ్ పేల్చాడు. అయితే, చాంపియన్స్ ట్రోఫీ తర్వాత గత నెలలోనే తాను టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలనుకొంటు న్నట్టు కోహ్లీ తనకు చెప్పాడని అగార్కర్ తెలిపాడు.

'25' వేటలో జొకో!

సోనీ లివ్‌లో మ. 2.30 నుంచి

- నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్
- ఫేవరెట్లుగా అల్కారజ్, సిన్నర్



పారిస్: క్లేకోర్ట్ రారాజు రఫెల్ నడాల్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి ఫ్రెంచ్ ఓపెన్‌లో యువ హవా నడవనుంది. డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కరజ్, జానిక్ సిన్నర్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందనే అంచనాలున్నాయి. ఆదివారం నుంచి జరిగే టోర్నీలో సిన్నర్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఇక, రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. రోలాండ్ గారోస్‌లోనే ఆ ఫీట్ పూర్తిచేయాలనుకొంటున్నాడు. అయితే, ఆరోసీడ్ జొకోవిచ్, సిన్నర్ ఒకే పార్శ్వంలో ఉండడంతో సెమీస్‌లో ఇద్దరూ తలపడే చాన్సుంది. తొలి రౌండ్‌లో మెకెంజీతో జొకో, ఆర్థర్ (ఫ్రాన్స్)తో సిన్నర్ తలపడనున్నారు. క్వాలిఫయర్ జిప్పరీ (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నాడు. మూడో సీడ్ జ్వెరెవ్, టేలర్ ఫ్రిట్జ్, రూడ్ కూడా టైటిల్ సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సబలెంక ఫేవరెట్ కాగా... మూడుసార్లు డిఫెండింగ్ చాంప్ స్వియాటెక్, గతేడాది రన్నరప్ పౌలిని, రెండో సీడ్ కోకో గాఫ్ టైటిల్ రేసులో ఉన్నారు.

షూటర్ ముఖేష్‌కు కాంస్యం

జూనియర్ వరల్డ్‌కప్

సుహ్ల్ (జర్మనీ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో గుంటూరు యువ షూటర్ నేలవల్లి ముఖేష్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. శనివారం ఇక్కడ జరిగిన 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఫైనల్లో ముఖేష్ 22 పాయింట్లతో తృతీయ స్థానం సొంతం చేసుకున్నాడు. థామస్ క్లిమెంట్ (ఫ్రాన్స్) స్వర్ణం, విక్టర్ లుకాజ్ (పోలెండ్) రజతం దక్కించుకున్నారు. ఇక, మరో భారత షూటర్ నరేన్ ప్రణవ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో కాంస్యం సాధించాడు.

బిజినెస్ ప్లస్

ఖరీదైన బహుమతులు వచ్చాయా...



ఐటీ రిటర్నుల్లో వెల్లడించాల్సిందే..

భారతీయ సమాజంలో బహుమతులు (గిఫ్ట్) ఒక భాగం. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగల సమయంలో బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మన సంప్రదాయం కూడా. ఇవి నగనట్రా, ఆస్తులు లేదా ఇతర విలువైన వస్తువుల రూపంలో ఉంటాయి. ఈ బహుమతులు తీసుకోవటం సంతోషం కలిగించినా.. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న బహుమతుల విలువ రూ.50,000 మించితే వాటిపై పన్ను పోటు తప్పదు. ఐటీ రిటర్నులు సమర్పించేటప్పుడు విలువతో సంబంధం లేకుండా ఈ బహుమతుల వివరాలు వెల్లడించడం మంచిది. లేకపోతే భవిష్యత్‌లో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

1958లోనే బహుమతులపై పన్ను కోసం ప్రభుత్వం గిఫ్ట్ ట్యాక్స్ యాక్ట్ తీసుకొచ్చింది. 1998లో ఈ చట్టాన్ని రద్దు చేశారు. అయితే 2004లో మళ్లీ బహుమతులను ఆదాయ పన్ను (ఐటీ) చట్ట సవరణ ద్వారా పన్నుల పరిధిలోకి తీసుకొచ్చారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం నిర్ణీత విలువ దాటిన బహుమతులు 'ఇతర ఆదాయం' కింది పరిగణించి వాటిని అందుకున్న వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేస్తారు.

వీరికి మినహాయింపు: ఐటీ చట్టంలో పేర్కొన్న దగ్గరి బంధువులు, కుటుంబసభ్యుల నుంచి అందే బహుమతులకు విలువతో సంబంధం లేకుండా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఇతరుల నుంచి వస్తే: ఎవరైనా ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో బంధువులు కాని వ్యక్తుల నుంచి రూ.50,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు అందితే వారిపై పన్ను పోటు తప్పదు. దీన్ని ఇతర ఆదాయంగా పరిగణించి పన్ను విధిస్తారు.

ఎవరు బంధువులు: ఐటీ చట్టం ప్రకారం తల్లిదండ్రులు, తోబుట్టువులు, జీవిత భాగస్వాములు, వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు, పిల్లలు, తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు, మనవళ్లు, మనవరాళ్లు దగ్గరి బంధువుల పరిధిలోకి వస్తారు. వీరి నుంచి మనకి, మన నుంచి వీరికి అందే బహుమతులపై ఎలాంటి పన్ను వర్తించదు.

పన్ను పోటు లేని బహుమతులు

- పెళ్లిళ్ల సమయంలో వధూవరులకు వచ్చే గిఫ్ట్‌లు
- ఐటీ చట్టం పేర్కొన్న దగ్గరి బంధువుల నుంచి అందే బహుమతులు
- వారసత్వంగా లేదా వీలునామా ద్వారా సంక్రమించే గిఫ్ట్‌లు
- ప్రభుత్వం వద్ద నమోదైన మతపరమైన, దాతృత్వ ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి అందే గిఫ్ట్‌లు
- యూనివర్సిటీలు, విద్యా సంస్థల నుంచి అందే ఉపకార వేతనాలు, గ్రాంట్లు, ఆర్థిక సాయం
- మున్సిపల్, స్థానిక ప్రభుత్వ సంస్థల నుంచి అందే బహుమతులు
- కేవలం ఒక వ్యక్తి ప్రయోజనం కోసం ఏర్పాటైన ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- యాజమాన్య హక్కుల బదిలీ లేకుండా అందే బహుమతులు
- కార్లు, ఫోన్లు, టీవీలు, ఫర్నీచర్, వాచీల వంటి బహుమతుల విలువ రూ.50,000 మించినా పన్ను పోటు ఉండదు.

రిటర్నుల్లో ఎలా వెల్లడించాలి?

ఒక ఆర్థిక సంవత్సరంలో అందే బహుమతుల విలువ రూ.50,000 మించితే తప్పకుండా ఆ విషయాన్ని 'ఇతర ఆదాయం' సెక్షన్‌లో వెల్లడించాలి. ఒకవేళ వాటి విలువ రూ.50,000 కంటే తక్కువగా ఉన్నా 'ఎగ్జెంప్ట్ ఇన్‌కం' సెక్షన్‌లో వెల్లడించడం మంచిది. దీనివల్ల మన ఆదాయ వెల్లడిలో పారదర్శకత పెరిగి ఐటీ శాఖ మన రిటర్నులు స్క్రూటినీ చేసే అవకాశాలు తగ్గుతాయి.

క్రెడిట్ కార్డుతో నగదు తీసుకుంటున్నారా..



తొలి రోజు నుంచే వడ్డీ

జాగ్రత్తలు తీసుకోకపోతే గుదిబండగా మారే ప్రమాదం

ఎప్పుడు ఎవరికి ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు. ఆ సమయంలో చేతిలో డబ్బులు ఉంటాయనే గ్యారెంటీ లేదు. అప్పుడు బంధుమిత్రుల నుంచి లేదా బ్యాంకు నుంచి అప్పు చేయక తప్పదు. ఇవేవీ సాధ్యం కాకపోతే క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేయడం ఒక్కటే మార్గం. అయితే ఇది అంత క్షేమం కాదు. ఇందుకు అధిక వడ్డీతో పాటు చార్జీల రూపం లోనూ భారీగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు ద్వారా అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌లో ఉన్న సమస్యలు ఏమిటో తెలుసుకుందాం...

చార్జీలు

క్రెడిట్ కార్డు అంటేనే ఫీజులు, వడ్డీలు. ఇక ఈ కార్డులతో విత్‌డ్రా చేసే అడ్వాన్స్ నగదుపై వడ్డీ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రతి నగదు విత్‌డ్రాయల్స్‌పై కనీసం రూ.250 నుంచి రూ.500 చొప్పున ఫీజు చెల్లించాలి. విత్‌డ్రా చేసే నగదును బట్టి ప్రతి లావాదేవీ విలువలో ఇది 2.5 శాతం నుంచి 3 శాతం వరకు ఉంటుంది. క్రెడిట్ కార్డు కంపెనీలు జారీ చేసే బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లో ఈ చార్జీల వివరాలు ఉంటాయి.

వడ్డీ రేటు

క్రెడిట్ కార్డుల ద్వారా విత్‌డ్రా చేసే నగదు అడ్వాన్స్‌పై బ్యాంకులు నెలవారీ పద్ధతిలో వడ్డీ రేటు వసూలు చేస్తాయి. సాధారణంగా ఈ వడ్డీ రేటు 2.5 నుంచి 3 శాతం మధ్య ఉంటుంది.

లేటు చెల్లింపులు వద్దు

ఈ చెల్లింపులను ఒకేసారి వీలైనంత త్వరగా చెల్లించడం మంచిది. చేతిలో డబ్బులు లేవని కొద్దికొద్దిగా ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లిస్తే ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది. సాధారణంగా ఇది మిగిలిన బకాయి మొత్తంలో 15 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. ఆలస్యంగా చేసే అడ్వాన్స్ నగదు చెల్లింపులు ఆర్థిక భారంతో పాటు క్రెడిట్ స్కోరునూ దెబ్బతీస్తాయి.

క్రెడిట్ కార్డుపై కొనే వస్తువుల బకాయిలు చెల్లించేందుకు కొంత ఇంటరెస్ట్ ఫ్రీ గడువు ఉంటుంది. అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌కు ఇలాంటి సౌలభ్యం ఉండదు. నగదు విత్‌డ్రా చేసిన రోజు నుంచి చెల్లించే రోజు వరకు వడ్డీ భారం తప్పదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌ను ఎంత త్వరగా చెల్లిస్తే అంత మంచిది.

పరిమితులు

క్రెడిట్ కార్డు చేతిలో ఉన్నంత మాత్రాన ఎంత పడితే అంత అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్ కుదరవు. మీ క్రెడిట్ కార్డు క్రెడిట్ లిమిట్‌లో ఒక పరిమితికి లోబడి మాత్రమే ఈ నగదు ఉపసంహరణ సాధ్యం. ఒకవేళ దీన్ని ఉపయోగించుకున్నా ఆ మొత్తాన్ని నిర్ణీత గడువులోగా ఒకేసారి చెల్లించాలి. లేకపోతే అది గుదిబండగా మారే ప్రమాదం ఉంది.



ఎల్ఐసీ గిన్నిస్ వరల్డ్ రికార్డు

ఒక్క రోజులో 5,88,107 పాలసీల విక్రయం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఒక్క రోజులో ఇన్ని పాలసీలు అమ్మిన బీమా కంపెనీ ఇదే. ఈ జనవరి 20న సంస్థకు చెందిన 4,52,839 ఏజెంట్లు ఈ పాలసీలను విక్రయించినట్లు ఎల్ఐసీ వెల్లడించింది. "ఇది మా ఏజెంట్ల అవిశ్రాంత అంకితభావం, నైపుణ్యం, నైతికతకు బలమైన ధ్రువీకరణ. మా కస్టమర్లు, వారి కుటుంబాలకు బీమా ద్వారా ఆర్థిక రక్షణ కల్పించాలన్న మా లక్ష్యం పట్ల నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది" అని ఎల్ఐసీ పేర్కొంది. 'మ్యాడ్ మిలియన్ డే' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ జనవరి 20న ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీనైనా విక్రయించాలని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి కోరారు. దాంతో ఏజెంట్లందరూ కలిసి రికార్డు స్థాయిలో పాలసీలను విక్రయించారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



నగరం	ధర	నగరం	ధర
హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	510
వరంగల్	502	గోదావరి	485
చిత్తూరు	603	విశాఖపట్నం	513

డజను గుడ్లు రూ. 72

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,080 ▲	89,900 ▲	1,10,900 ▼
విజయవాడ	99,700 ▲	93,500 ▲	99,700 ▼
విశాఖపట్నం	98,080 ▼	89,900 ▲	1,10,900 ▲
రాజమండ్రి	98,070 ▲	89,900 ▲	1,03,000 ▲
ప్రొద్దుటూరు	96,200 ▼	88,500 ▼	99,200 ▼
ముంబై	95,471	87,451	96,909

రాష్ట్రానికి మరో 2 లక్షల 'పీఎం కుసుమ్' కనెక్షన్లు

- సోలార్ పార్కుల ఏర్పాటుకు త్వరలో ప్రత్యేక విధానం
- సీఎం చంద్రబాబుకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి హామీ

అమరావతి, మే 24(ఆంధ్రజ్యోతి): 'పీఎం కుసుమ్' పథకం కింద రాష్ట్రానికి అదనంగా 2లక్షల కనెక్షన్లు ఇస్తామని కేంద్ర పునరుద్పాదక విద్యుత్ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి హామీ ఇచ్చారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు శనివారం ఆయనతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న లక్ష కనెక్షన్లకు అదనంగా మరో 2లక్షల మేర ఫీడర్ వారీ సౌర విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వడానికి కేంద్ర మంత్రి సంసిద్ధత వ్యక్తం చేశారు. వాస్తవానికి పీఎం కుసుమ్ కింద రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల కనెక్షన్లను ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. అయితే తక్షణమే 2లక్షలు ఇస్తామని కేంద్రం పేర్కొంది. కాగా, రాష్ట్రంలో మూడు సోలార్ పార్కులు ఏర్పాటు చేసేందుకు అనుమతిని ఇవ్వాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. రాయలసీమలో సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాలు, బ్యాటరీ స్టోరేజీ సౌర విద్యుత్తు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నందున రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ కారిడార్ గ్రిడ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని సీఎం కోరారు. దీనిపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

మృతదేహాల కోసం ఛత్తీస్‌గఢ్ పోలీసులను అడగండి

- మావోయిస్టుల కుటుంబ సభ్యులకు హైకోర్టు సూచన

అమరావతి, మే 24(ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, అగ్రనేత సజ్జా వెంకట నాగేశ్వరరావు మృతదేహాలను అప్పగించాలని ఛత్తీస్‌గఢ్ పోలీసులను కోరాలని వారి కుటుంబ సభ్యులకు హైకోర్టు ధర్మాసనం సూచించింది. ఛత్తీస్‌గఢ్ పోలీసులను ఆశ్రయించే వ్యవహారాన్ని పిటిషనర్లకే వదిలేసింది. వ్యాజ్యాలను పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావుతో కూడిన ధర్మాసనం శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. తమ వారి మృతదేహాలను అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కేశవరావు, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు శుక్రవారం పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై శనివారం ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. ఛత్తీస్‌గఢ్ అడ్వొకేట్ జనరల్(ఏజీ) ప్రఫుల్ భరత్ స్పందిస్తూ.. ఎన్‌కౌంటర్‌లో మొత్తం 27 మంది చనిపోగా, కేశవరావు, నాగేశ్వరరావులతో పాటు 21 మందికి పోస్టుమార్టం ముగిసిందని, మరో ఆరుగురికి శనివారం సాయంత్రంలోగా పూర్తిచేస్తామని చెప్పారు. ఆ తరువాత కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించడమే మిగిలి ఉంటుందన్నారు. రాష్ట్ర ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ఛత్తీస్‌గఢ్ హైకోర్టును ఆశ్రయించి ఉండాల్సిందన్నారు. కేంద్ర హోంశాఖ తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్(డీఎస్‌జీ) పసల పొన్నారావు వాదనలు వినిపిస్తూ.. అంతిమ సంస్కారాల సందర్భంగా ర్యాలీలు నిర్వహిస్తే లా అండ్ ఆర్డర్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందనే కారణంతో మృతదేహాలను అప్పగించడానికి నిరాకరించి ఉండవచ్చు అని తెలిపారు. అందరి వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులను ఆశ్రయించే వ్యవహారాన్ని పిటిషనర్లకే వదిలేసింది.

మరో ఎన్‌కౌంటర్ అంటూ వదంతులు

విశాఖపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కొయ్యూరు, జీకే వీధి మండలాల సరిహద్దు మఠం భీమవరం అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య శనివారం రాత్రి ఎదురుకాల్పులు జరిగినట్టు వదంతులు వినిపించాయి. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఏవోబీలో ప్రత్యేక పోలీసు బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ నేపథ్యంలో ఎదురు కాల్పులు జరిగినట్టు ప్రచారం జరిగింది. అయితే దీనిని పోలీసులు ధ్రువీకరించలేదు.

హనుమంతురెడ్డిపై నివేదిక ఇవ్వండి

- డిస్టిలరీలకు బెదిరింపులపై ఎస్పీని ఆదేశించిన కడప కలెక్టర్

కడప, మే 24(ఆంధ్రజ్యోతి): మామూళ్ల కోసం మద్యం డిస్టిలరీలను బెదిరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న హనుమంతురెడ్డి గన్ లైసెన్స్‌పై విచారణ చేయాల్సిందిగా ఎస్పీ అశోక్‌కుమార్‌ను కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. జగన్ హయాంలో మద్యం కుంభకోణంపై సిట్ ముమ్మరంగా దర్యాప్తు చేస్తోంది. వైఎస్ అవినాశ్‌రెడ్డి కుటుంబానికి సన్నిహితుడుగా ఉన్న హనుమంతురెడ్డికి వైసీపీ హయాంలో గన్ లైసెన్స్ వచ్చింది.

అమృత్ 2.0 ప్రాజెక్టులకు రూ.375.29 కోట్లు

అమరావతి, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అమృత్ 2.0 పథకం అమలు కోసం రూ. 375.29 కోట్లు విడుదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద మరో రూ. 21.71 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను అమృత్ 2.0 కింద చేపట్టిన నీటి సరఫరా, సేవేజ్ మేనేజ్‌మెంట్, వాటర్ బాడీ రిజువరేషన్ ప్రాజెక్టులకు ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం అంగీకరిస్తూ ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు పరిపాలనా అనుమతిని మంజూరు చేసింది. ఈ మేరకు చేస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.కన్నబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐడీకి అచ్యుతాపురం సైబర్ క్రైమ్ కేసు?

అనకాపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో నాలుగు రోజుల క్రితం వెలుగుచూసిన సైబర్ క్రైమ్‌కు సంబంధించిన కేసును సీఐడీకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హాకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలోని భోగాపురం వద్ద గల పవన్ రెసిడెన్సీపై దాడులు నిర్వహించారు. పదుల సంఖ్యలో యువతీ, యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో అస్సాం, నాగాలాండ్, మేఘాలయ, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో యువతీయువకులను రిక్రూట్ చేసుకుని, ఇక్కడకు తీసుకొచ్చి శిక్షణ ఇచ్చి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్టు ప్రాథమికంగా తేల్చారు. గత రెండేళ్ల నుంచి ఈ వ్యవహారం సాగుతున్నట్టు పోలీసులు నిర్ధారించారు. అమెరికాతో పాటు మరికొన్ని దేశాల్లో అమెజాన్ కస్టమర్లను లక్ష్యంగా చేసుకుని నెలకు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ దోచుకున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ఫైనల్‌గా ఏ 'ప్యాలెస్'కు!?

(మొదటి పేజీ తరువాయి)

చాలా కష్టపడాల్సి వచ్చింది. ఢిల్లీ, జార్ఖండ్, తమిళనాడులో జరిగిన లిక్కర్ స్కామ్‌లతో పోల్చితే దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణం జగన్ రెడ్డి పాలనలో ఏపీలో జరిగింది. దీంతో ఈడీ కూడా రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. పొరుగు రాష్ట్రాలు, దేశాలకు సంబంధించిన సమాచారాన్ని ఈడీ సేకరించింది. 'సిట్' అధికారుల వినతి మేరకు... వారితో ఈ సమాచారం పంచుకుంది. దీంతో... విజయవాడ నుంచి ప్రత్యేక బృందాలు హైదరాబాద్, ముంబై, బెంగళూరుకు వెళ్లి కొన్ని రోజులుగా ఆరా తీస్తున్నాయి.

పలు రాష్ట్రాల్లో 'పెట్టుబడులు'.. మద్యం ముడుపులను హైదరాబాద్‌లో హవాలా, ముంబైలో బులియన్ ద్వారా 'అంతిమ లబ్ధిదారు' చెప్పిన చోటుకు చేరినట్లు సిట్ అధికారులు గుర్తించారు. రాజ్ కసిరెడ్డి(ఏ1) గ్యాంగ్ వసూలు చేసిన డబ్బులో సుమారు వెయ్యి కోట్లు హైదరాబాద్‌లోని స్థిరాస్తి వ్యాపారస్తుల ద్వారా బెంగళూరులో పెట్టుబడులుగా మారినట్లు ఆధారాలు లభించాయి. సజ్జాపుర, చిక్క తిరుపతి, హెచ్ఎస్ఆర్ లేఔట్ ప్రాంతాల్లో 2022 నుంచి 2024 మధ్య పదులకొద్దీ ఎకరాలు కొనుగోలు చేశారని... వాటి 'అసలు' యజమాని ఎవరనేది కూడా 'సిట్' గుర్తించిందని తెలిసింది. ఆ ఆస్తులు, వాటి విక్రేతలు, మధ్యవర్తులను సైతం గుర్తించి... వారితోనూ కూపీ లాగుతోంది. మరోవైపు ముంబైలో బులియన్ వ్యాపారుల నుంచి బంగారం కొనుగోలు చేసినట్లు లభించిన జీఎస్టీ బిల్లులపై ఆరా తీయగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. వందల కోట్ల రూపాయలతో క్వింటాళ్లలో కొనుగోలు చేసిన బంగారం ఎటు వెళ్లిందనే అంశంపై దృష్టి సారించగా... ఎక్కువ శాతం బిల్లులు కేవలం జీఎస్టీ చెల్లించి తీసుకున్నట్లు తేలింది. అక్రమ మార్గంలో దోచుకున్న డబ్బును సక్రమమని చూపించుకోవడానికి వేసిన ఎత్తుగడ ఇది. బంగారం వ్యాపారుల నుంచి పలు వివరాలు సేకరించిన సిట్ అధికారులు కేవలం జీఎస్టీ చెల్లించి బిల్లులు తీసుకున్న వ్యక్తులు ఆ డబ్బు ఎక్కడికి చేర్చారనే అడ్రస్ కూడా రాబట్టినట్లు తెలుస్తోంది. ఆ చిరునామా వెతికే క్రమంలో మరింత ముందుకు వెళితే.... అదంతా ఏ 'ప్యాలెస్'కు చేరిందో తెలిసిపోతుంది.



పీటీసీలోకి వెళుతున్న ఎన్ఐఏ అధికారులు

ఇతర రాష్ట్రాల్లోనూ పేలుళ్లకు కుట్ర!

- సిరాజ్, సమీర్‌లపై రెండో రోజు విచారణ

విజయనగరం/క్రైం, మే 24(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సానుభూతిపరులు సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌ల విచారణ రెండో రోజు శనివారం కొనసాగింది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న పలు అభియోగాలపై ఎన్ఐఏ, ఏటీఎస్ అధికారులు స్థానిక పోలీసులతో కలిసి దర్యాప్తును వేగవంతం చేశారు. మహారాష్ట్ర, తమిళనాడుకు చెందిన ఏటీఎస్ అధికారులూ విజయనగరంలోని పోలీస్ శిక్షణ కళాశాలకు చేరుకున్నారు. సిరాజ్, సమీర్‌ల ద్వారా విజయనగరం, పలు ఇతర రాష్ట్రాల్లో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు, ఐసిస్ లేదా ఇతర ఉగ్ర సంస్థలు వీరిని ప్రేరేపించినట్లు విచారణలో నిర్ధారణకు వచ్చారని సమాచారం. ప్రధానంగా ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. సిరాజ్ కుటుంబం, అతని స్నేహితుల గురించి ఆరా తీశారు. సిరాజ్ ల్యాప్‌టాప్‌లో ఉన్న వివిధ అంశాలపైనా కూపీ లాగారు.

- సిరాజ్ గత నవంబరు 22న ముంబైకి వెళ్లినప్పుడు 10మందితో కలిసి హక్ ఇండియాలో లైవ్ సెషన్‌కు హాజరైనట్లు విచారణలో తెలిసింది. అక్కడ ఎవరెవరిని కలిశాడు? అక్కడి నుంచి ప్లాన్, పేలుడు సామగ్రి తీసుకువచ్చాడా? అనే దానిపైనా అధికారులు కూపీ లాగుతున్నారు. అదే విధంగా ఈ ఏడాది జనవరి 26 ఢిల్లీకి ఏ పని మీద వెళ్లాడు? అక్కడ ఎవరిని కలిశాడు? అని కూడా ప్రశ్నించారని తెలిసింది.
- బిహార్‌కు చెందిన అబూతాలెం అలియాస్ అబూ ముసబ్ సూచనలతో సిరాజ్, సమీర్‌లు సిగ్నల్ యాప్ ద్వారా జిహాదీ కార్యక్రమాలను తెలుసుకునేవారు. ఇందుకు సంబంధించిన పోస్టులు పెడుతూ ఇతరుల ద్వారా మరిన్ని విషయాలను తెలుసుకుని అటువైపు ఆకర్షితులైనట్లు విచారణలో అంగీకరించినట్లు తెలిసింది.
- గోషామహల్ ఎమ్మెల్యేపై ద్వేషం ఉండేదని, అతను పెట్టిన వీడియోలకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టినట్లు సిరాజ్ తెలిపినట్లు సమాచారం. ఈ పోస్టులను చూసిన విశాఖలోని ఓ ప్రభుత్వ ఉద్యోగి తనను మెచ్చుకున్నట్లు విచారణలో చెప్పినట్లు తెలిసింది. సిరాజ్, సమీర్ ఆరోగ్య పరిస్థితిపై అధికారులు శ్రద్ధ తీసుకుంటున్నారు. వైద్యులు తనిఖీ చేసిన తర్వాత మాత్రమే వారికి ఆహారం అందిస్తున్నారు.

ముందే 'రుతు'రాగం

కేరళను తాకిన నైరుతి

- 16 ఏళ్ల తర్వాత 8 రోజులు ముందుగా దేశంలోకి వచ్చిన రుతుపవనాలు
- 2,3 రోజుల్లో ఏపీ, తెలంగాణకు

విశాఖపట్నం/అమరావతి, మే 24(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది రైతన్నలకు చల్లని కబురు. వేసవి ఎండలు, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఉపశమనం. ఈ ఏడాది 8 రోజుల ముందే నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయి. 16 ఏళ్ల తర్వాత సాధారణ తేదీ (జూన్ 1) కంటే వారం ముందుగా వచ్చాయి. దేశానికి అత్యధిక వర్షపాతాన్ని ఇచ్చే నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకినట్టు భారత వాతావరణ శాఖ ప్రకటించింది. మరో రెండు, మూడు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణకు వచ్చే అవకాశాలున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో కొద్ది రోజుల్లోనే దేశమంతా విస్తరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 27న కేరళకు వస్తాయని వాతావరణ శాఖ ఇటీవల ప్రకటించింది. ఐఎండీ అంచనాకు భిన్నంగా మూడు రోజుల ముందే కేరళను తాకాయి. కేరళలో పూర్తిగా, తమిళనాడులో 90 శాతం అంటే చెన్నై వరకు, కర్ణాటక, ఈశాన్యంలో మిజోరాంలో పలు ప్రాంతాలకు విస్తరించాయి. అలాగే అరేబియా సముద్రంలో అనేక ప్రాంతాలకు, మాల్దీవులు, కొమరిన్‌లో మిగిలిన భాగాలకు, బంగాళాఖాతంలో అనేక ప్రాంతాలను తాకాయి. కొంకణ్‌కు ఆనుకుని తూర్పు మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం శనివారానికి వాయుగుండంగా బలపడడంతో నైరుతి రుతుపవనాలు ముందుగా దేశ భూభాగంలో ప్రవేశించాయి. గడచిన రెండు రోజుల నుంచి కేరళలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడం, అరేబియా సముద్రం మీదుగా పడమర గాలులు బలంగా వీయడం, సముద్ర మట్టానికి 4.5 కి.మీ. ఎత్తులో సుమారు 50 కి.మీ. వేగంతో వీస్తుండడంతో కేరళను ముందుగానే రుతుపవనాలు తాకాయని వాతావరణ శాఖ ప్రకటించింది. రానున్న రెండు, మూడు రోజుల్లో కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాలు, తమిళనాడులోని మిగిలిన భాగం, అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో మరిన్ని ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్, సిక్కిం వరకు రుతుపవనాలు విస్తరించనున్నాయని తెలిపింది. ఈ నెల 27వ తేదీన పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నందున ఏపీలోకి రుతుపవనాలు ప్రవేశించనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఈ ఏడాది ఎక్కువ వర్షపాతం

జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు నెలలను నైరుతి రుతుపవనాల సీజన్‌గా పరిగణిస్తారు. ఏడాదిలో నమోదయ్యే వర్షపాతంలో 70 శాతం ఈ సీజన్‌లో కురుస్తుంది. దేశంలో 52 శాతం భూముల్లో పంటలను వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్నారు. వర్షాధార భూముల నుంచి ఏటా 40 శాతం పంట దిగుబడి వస్తోంది. ఈ ఏడాది నైరుతి సీజన్‌లో 87 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. అయితే సీజన్ దీర్ఘకాల సగటులో 105శాతం నమోదు అవుతుందని ఐఎండీ ప్రకటించింది. ఈశాన్య భారత్‌లో అనేక ప్రాంతాలు, దక్షిణాదిలో తమిళనాడు, ఉత్తర భారత్‌లో జమ్ము కశ్మీర్, లద్దాఖ్ మినహా దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. కోర్ మాన్‌సూన్ జోన్ అంటే మధ్య భారత్, దానికి ఆనుకుని దక్షిణ, తూర్పుభారత్‌లో పలు రాష్ట్రాల్లో ఎక్కువ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం ఉన్న తటస్థ పరిస్థితులు నైరుతి రుతుపవనాల సీజన్ చివరి వరకు కొనసాగుతాయని, అందువల్ల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదవుతుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.



గుంటూరులో శనివారం కురిసిన భారీ వర్షంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

గత 16 ఏళ్లలో కేరళను రుతుపవనాలు తాకిన తేదీలు

2009	మే23
2010	మే31
2011	మే29
2012	జూన్5
2013	జూన్1
2014	జూన్6
2015	జూన్5
2016	జూన్8
2017	మే30
2018	మే29
2019	జూన్8
2020	జూన్1
2021	జూన్3
2022	మే29
2023	జూన్8
2024	మే30

ముందస్తు వేసవితోనే..

ఐఎండీ రిటైర్డ్ డీజీ కేజీ రమేశ్



దేశంలో ఈ ఏడాది ఫిబ్రవరి తొలివారం నుంచే ఎండలు పెరగడంతో వాతావరణం వేడెక్కిందని, దీంతో ఏప్రిల్ నుంచే వానలు ప్రారంభమయ్యాయని, ఈ నేపథ్యంలో ఎనిమిది రోజులు ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కేజీ రమేశ్ విశ్లేషించారు. 27వ తేదీన బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని, దీంతో 27 లేదా 28వ తేదీన ఏపీలోని అనేక ప్రాంతాలను రుతుపవనాలు తాకుతాయని రమేశ్ అంచనా వేశారు.

నేడు, రేపు వర్షాలు

అరేబియా సముద్రంలోని వాయుగుండం ప్రభావంతో ఆదివారం రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరుగా, సోమవారం విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆదివారం అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. సోమవారం అల్లూరి, శ్రీకాకుళం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విస్తృతంగా మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. శనివారం సాయంత్రం వరకు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో 45.2 మిల్లీ మీటర్లు, అరకబద్రలో 43 మిల్లీ మీటర్ల వాన పడింది. తిరుపతి జిల్లా గంగుడుపల్లిలో 39.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడులో రాబోయే 5 రోజులు అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. శనివారం ఢిల్లీతో పాటు జమ్ము, కశ్మీర్, పంజాబ్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. ఈ నెల 29వ తేదీ వరకు కేరళ, కోస్టల్ కర్ణాటకలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.

'తుంగభద్ర'లో 80 టీఎంసీలకు మించొద్దు

డ్యాంలో అంతకు మించితే దిగువకు వదిలేయాలి

- క్రస్ట్ గేట్ల పరిస్థితితో ముందు జాగ్రత్తలు పాటించాలి
- సీడబ్ల్యూసీ అధికారులు, కన్నయ్య నాయుడు సూచన
- కొత్త క్రస్ట్ గేట్ల ఏర్పాటు ఈ ఏడాది లేనట్లే..!



బళ్లారి, మే 24(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం ఆయకట్టు రైతులకు ఇదో చేదు వార్త! కొత్త క్రస్ట్ గేట్ల ఏర్పాటు ఈ ఏడాది సాధ్యమయ్యే పరిస్థితి లేదు. దీంతో డ్యాంలో నీటి నిల్వలను 80 టీఎంసీలకు మించకుండా చూడాలని సీడబ్ల్యూసీ, క్రస్ట్ గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో డ్యాంలో నీటి నిల్వ 80 టీఎంసీలకు చేరగానే పై నుంచి వచ్చే వరద నీటిని నదిలోకి మళ్లించాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. డ్యాం క్రస్ట్ గేట్ల పరిస్థితి బాగా లేనందున ఈ నిర్ణయం తీసుకున్నారు. గత ఏడాది ఆగస్టు 10న 19వ క్రస్ట్‌గేటు నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. అప్పుడు డ్యాంలో 100 టీఎంసీల నీరు నిల్వ ఉన్నా, వరద కూడా ఎక్కువగా ఉండేది. డ్యాం భద్రత దృష్ట్యా మిగిలిన 32 క్రస్ట్ గేట్లు తెరిచి లక్ష క్యూసెక్కుల నీటిని నదిలోకి వదిలారు. ఆ తర్వాత 19వ క్రస్ట్‌గేట్ స్థానంలో స్టాప్‌లాగ్ ఏర్పాటు చేశారు. ఆపై వర్షాలు బాగా కురవడంతో డ్యాంలో నీటి నిల్వలు మళ్లీ 100 టీఎంసీలకు చేరాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తలేదు. ఆ తర్వాత నిపుణులు పరిశీలించి, అన్ని క్రస్ట్‌గేట్లను మార్చాలని సూచించారు. వాటి ఏర్పాటు ఈ ఏడాది సాధ్యం కానందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

ఆయకట్టుకు ఇబ్బందులు

టీబీ డ్యాం గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు. జలాశయం కింద ఆంధ్ర, కర్ణాటక పరిధిలో 7,28,761 హెక్టార్ల ఆయకట్టు ఉంది. ఆర్‌బీ హెచ్చెల్సీ కింద కర్ణాటక పరిధిలో 1,99,920 హెక్టార్లు, ఏపీ పరిధిలో 84,992 హెక్టార్లు, ఆర్‌బీ ఎల్లెల్సీ కింద ఏపీ పరిధిలో 1,35,443 హెక్టార్లు, కర్ణాటక పరిధిలో 92,678 హెక్టార్ల ఆయకట్టు ఉంది. ఆయకట్టుకు సాగునీటితోపాటు డ్యాం నీటితో విద్యుదుత్పత్తి జరుగుతుంది. ఈ ఏడాది గరిష్ఠ స్థాయిలో నీటినినిల్వ చేయకూడదని నిర్ణయించినందున సాగుకు ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తున్నారు. నీటి నిల్వలను 80 టీఎంసీలకు పరిమితం చేస్తే 25 టీఎంసీల కొరత ఏర్పడుతుంది. పూడిక కారణంగా మరో 5టీఎంసీల నిల్వ తగ్గిపోయింది. రుతుపవనాల ముందస్తు రాకతో ఇప్పటికే డ్యాంకు వరద మొదలైంది. మరో వారం పది రోజుల్లో తుంగ నది నుంచి వరద పెరగొచ్చని ఉందని డ్యాం వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతలు వద్దు

- పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి బోర్డుకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించడానికి వీలుగా ఏపీ ప్రతిపాదించిన ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకోవాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీని తెలంగాణ కోరింది. తెలంగాణలో ఏ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నా ఏపీ అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నదని, ఈ ఎత్తిపోతలతో గోదావరి డెల్టా సిస్టమ్ అవసరాలపై ప్రభావం పడుతుందని పేర్కొంది. ఈ మేరకు పీపీఏ, గోదావరి నది యాజమాన్య బోర్డు ఛైర్మన్‌కు తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్ కుమార్ శనివారం లేఖ రాశారు. పోలవరం పూర్తిస్థాయి నీటిమట్టం 45.72మీటర్లుగా ఉండగా.. 35 మీటర్ల నుంచి నీటిని తరలించడానికి వీలుగా ఎత్తిపోతలను ప్రతిపాదించారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇక, పోలవరం ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతినిస్తూ 2009లో 95వ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీకి వ్యతిరేకంగా ఈ ప్రతిపాదన ఉందని తెలిపారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఏ ప్రాజెక్టు చేపట్టాలన్నా డీపీఆర్‌ను గోదావరి బోర్డు మదింపు చేయాలని, ఏమాత్రం జాప్యం చేయకుండా ఈ ప్రాజెక్టును నిలువరించాలని కోరారు.

డిసెంబరు నాటికి డయాఫ్రమ్‌వాల్ పూర్తయ్యేనా?

- కురుస్తున్న భారీ వర్షాలతో అధికారులు బెంబేలు

అమరావతి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రమ్‌వాల్ పనులు పూర్తి చేయాలన్న రాష్ట్ర జల వనరుల శాఖ ఆశలపై వరుణుడు నీళ్లు కుమ్మరిస్తున్నాడు. ఈ ఏడాది జనవరి 18న డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులను బావర్ కంపెనీ మొదలపెట్టింది. లక్ష్యాన్ని అందుకునేందుకువీలుగా మూడు కట్టర్లను ఉపయోగించి పనులు చేపడుతోంది. మే నెలంతా వర్షాలు కురుస్తుండటంతో పనుల వేగం తగ్గుతోందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది అంతానికి వాల్ పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని అందుకోలేని పరిస్థితి నెలకొంది. జూన్, జూలై, ఆగస్టుల్లో గోదావరికి వరద ఉధృతి తీవ్ర స్థాయిలో ఉంటుంది. ఎగువ నుంచి సగటున 14 లక్షల క్యూసెక్కుల నుంచి 18లక్షల క్యూసెక్కుల వరకు వరద ఉంటుంది. ఇంత భారీ వరద ప్రవాహం ఉన్నప్పుడు నిర్మాణ పనులు సాధ్యం కావన్న అభిప్రాయం వ్యక్తవుతోంది. నిర్మాణ లక్ష్యంలో 4నెలలు వర్షాలు, వరదల కారణంగా కోల్పోతే డయాఫ్రమ్‌వాల్‌తోపాటు, ఒకవైపు నుంచి సమాంతరంగా సాగుతున్న ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణ పనులూ కుంటుపడే అవకాశం ఉంటుందని జల వనరుల శాఖ ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌కు సంబంధించి గ్యాప్-1 పనుల డిజైన్లకు కేంద్ర జల సంఘం ఇప్పటికే సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఆ పనులు కూడా చేపడుతున్నారు. గ్యాప్-2 డిజైన్లపైనా చర్చలప్రక్రియ షురూ అయింది. ఈ డిజైన్లనూ కేంద్ర జల సంఘం ఆమోదిస్తే గ్యాప్-3 ప్రాంతంలోనూ పనులు ప్రారంభించాలని భావిస్తోంది. స్థిరమైన లక్ష్యాలను వేసుకుని, యంత్ర సామగ్రిని సిద్ధం చేసుకుని పనులు చేస్తున్నా, వర్షాలతో జల వనరుల శాఖలో ఆందోళన మొదలైంది. రాష్ట్రంలో కురుస్తున్న వానలకు తోడు..ఎగువ నుంచి భారీగా వరద ఎగదన్నుకొస్తే ఈ ఏడాది అంతానికి లక్ష్యాలను చేరుకోవడం కష్టమేనని జల వనరుల శాఖ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

టెండర్లు లేకుండానే బియ్యం రవాణా!

- పాఠశాలలు, వసతిగృహాలకు సరఫరా
- వైసీపీ నాటి విధానాన్నే కొనసాగిస్తున్న పౌరసరఫరాల శాఖ
- ప్రభుత్వానికి ఏడాదికి రూ.21 కోట్ల నష్టం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

బియ్యం రవాణాకు టెండర్లు పిలవకుండానే పౌర సరఫరాల కార్పొరేషన్ ఏజన్సీలను ఖరారు చేసింది. వైసీపీ హయాంలో అనుసరించిన విధానాన్నే ఇప్పుడూ కొనసాగిస్తోంది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు పెద్దమొత్తంలో గండి పడుతోంది. గోదావరి జిల్లాలతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా ఐదు ఏజన్సీలకు బాధ్యతలు అప్పగించింది. ప్రధానంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ హాస్టళ్లకు నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది. వీటిని ప్రత్యేకంగా ప్యాకింగ్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రతి జిల్లాలోనూ ప్యాకింగ్ యూనిట్‌లు పెట్టారు. కొన్నిచోట్ల ప్యాకింగ్ అవ్వడం లేదు. పొరుగున ఉన్న జిల్లాలో ప్యాకింగ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు, హాస్టళ్లకు సరఫరా చేస్తారు. ప్యాకింగ్ యూనిట్ల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు రవాణా, ప్యాకింగ్ చేయడానికి టెండర్లు పిలవకుండానే ఏజన్సీలను ఖరారు చేశారు. పీడీఎస్ బియ్యం రవాణాకు సవాలక్ష నిబంధనలు అమలు చేస్తున్న పౌర సరఫరాల కార్పొరేషన్ ఇక్కడ మాత్రం.. ప్యాకింగ్, రవాణా కూడా వ్యాపార ఏజన్సీలకే అప్పగించింది. దీనికి అధిక మొత్తంలో ధరను నిర్ణయించింది. గోదావరి జిల్లాలతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా పది వేల టన్నుల బియ్యాన్ని పాఠశాలలు, హాస్టళ్లకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. పౌర సరఫరాల కార్పొరేషన్ ఈ బాధ్యతను నిర్వహిస్తోంది. ప్యాకింగ్ యూనిట్‌ల వద్ద ఉన్న గోదాములకు సన్న బియ్యాన్ని స్టేజ్-1 కాంట్రాక్టర్లు రవాణా చేస్తున్నారు. అవి 50 కిలోల బ్యాగుల్లో ఉండగా.. వాటిని 25 కిలోలుగా మార్చి ప్యాకింగ్ చేయడంతోపాటు, ఎంఎల్ఎస్ పాయింట్‌లకు తరలించే బాధ్యతను ఏజన్సీలకు అప్పగించారు.

క్వింటాల్‌కు సగటు ధర రూ.300

జిల్లాల్లో రవాణాకు దూరాన్ని బట్టి క్వింటాల్‌కు కనిష్ఠంగా రూ.196.89నుంచి గరిష్ఠంగా రూ. 378.36 చెల్లిస్తున్నారు. అంటే సగటున రూ.300 ఇస్తున్నారు. అదే టెండర్లు పిలిస్తే రూ.150కే కాంట్రాక్టర్లు వచ్చే అవకాశం ఉంది. పీడీఎస్ బియ్యం రవాణాకు స్టేజ్-1 కాంట్రాక్టర్లను నియమించేందుకు చర్చలు జరిపిన కార్పొరేషన్.. పాఠశాలలు, హాస్టళ్లకు పంపిణీ చేసే నాణ్యమైన బియ్యం విషయంలో జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. మచిలీపట్నం నుంచి పశ్చిమ గోదావరికి రవాణా చేస్తారు. మిగిలిన జిల్లాల్లో స్థానికంగానే ప్యాకింగ్ యూనిట్‌లు ఉన్నాయి. పెద్దగా రవాణా వ్యయం అవ్వదు. ప్యాకింగ్‌కు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.40 అవుతుంది. మిగిలిన మొత్తాన్ని రవాణాకే వెచ్చిస్తున్నారు. దీనివల్ల ప్రతి నెలా పౌరసరఫరాల కార్పొరేషన్‌కు రూ.1.75 కోట్లు నష్టం వాటిల్లుతుందని అంచనా.

జగన్ బెదిరింపులకు బెదరం: మంత్రి సవిత



పెనుకొండ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): 'అమెరికాలో ఉన్నా, బాత్రూమ్‌లో ఉన్నా ఈడ్చుకొచ్చి కొడతాం అని జగన్ అంటున్నారు. ఆయన బెదిరింపులకు రాష్ట్రంలో భయపడేవారు ఎవరూ లేరు' అని మంత్రి సవిత అన్నారు. పుట్టపర్తిలో జరిగే శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ మినీ మహానాడులో పాల్గొనేందుకు వెళుతూ.. పెనుకొండలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఎవరు ఎవరిపై దాడులు చేశారో, ఎవరు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారో రాష్ట్ర ప్రజలకు ఇప్పటికే తెలుసు. ల్యాండ్, మైన్స్, వైన్.. దేన్నీ వదలకుండా దోచుకున్నారు.' అని మంత్రి సవిత మండిపడ్డారు.

జగన్‌కు జైలు ఖాయం: ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, మే 24(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు ఢిల్లీ వచ్చిన ప్రతిసారీ రాష్ట్రానికి ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం నుంచి సహకారం కోసం కృషి చేస్తున్నారు. గత సీఎం వైఎస్ జగన్ మాత్రం ఐదేళ్ల పాటు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి ఒక్క రోజు కూడా రాలేదు' అని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. శనివారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'ఢిల్లీ పర్యటన ద్వారా ఏపీకి కలిగే ప్రయోజనాల వివరాలను మీడియా ద్వారా సీఎం చంద్రబాబు ప్రజలకు వివరిస్తుంటే... రాష్ట్రానికి నిధులు తేలేక, మీడియాకు జగన్ ముఖం చాటేసేవారు. జగన్ పాలనలో అవినీతి, అక్రమాలు అడ్డుఅదుపు లేకుండా సాగాయి. జీవితకాలంలో చేయలేనన్ని తప్పులను జగన్ కేవలం 5 ఏళ్లలోనే చేశారు. అధికారులు కూడా అవినీతి కేసుల్లో జైళ్లకు వెళ్లే దుస్థితి ఏర్పడింది. జగన్ చేసిన అవినీతి, అక్రమాలకు జైలు శిక్ష ఖాయం.' అని స్పష్టం చేశారు.

లిక్కర్ స్కామ్ కేసు ఈడీకి ఇవ్వాలి:సీఎం రమేశ్

న్యూఢిల్లీ, మే 24(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీలో జరిగిన మద్యం కుంభకోణంలోనే కాదు... ఇతర అవినీతి కుంభకోణాల్లోనూ మాజీ సీఎం వైఎస్ జగన్ జైలుకు వెళ్లడం ఖాయం' అని రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. శనివారం ఆయన తన అధికారిక నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'మద్యం కుంభకోణం దర్యాప్తులో సిట్ చాలా విషయాల్లో విచారణను వదిలేసింది. నన్ను పిలిస్తే సిట్‌కు చాలా విషయాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నా. లిక్కర్ స్కాం దర్యాప్తునకు సిట్ సరిపోదు. ఈడీ, సీబీఐతో దర్యాప్తు చేయించాలి. ఢిల్లీ లిక్కర్ స్కాం రూ.200-300 కోట్లు అయితే ఏపీ లిక్కర్ స్కాంలో రూ.వేల కోట్ల దందా జరిగింది. సిట్ దర్యాప్తులో ఇంకా చాల విషయాలు బయటకు రావాల్సిన అవసరం ఉంది. లిక్కర్ స్కామే కాకుండా జగన్ పాలనలో జరిగిన మైనింగ్, ఇసుక, భూదందాలనూ కూటమి ప్రభుత్వం వదలదు. మద్యం కుంభకోణానికి సంబంధించిన సాంకేతిక ఆధారాలు ఉన్నాయి. ఎవరూ తప్పించుకోలేరు. విదేశాలకు పారిపోయిన మద్యం కుంభకోణం నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు ఇచ్చి మరీ అరెస్టు చేస్తాం. మద్యం కుంభకోణంలో జగన్ పాత్రకు సంబంధించిన ఆధారాలు దర్యాప్తు సంస్థలు సేకరిస్తున్నాయి. విచారణ ఎదుర్కొనేందుకు జగన్ సిద్ధంగా ఉండాలి. అమరావతి అభివృద్ధితో తనకు రాజకీయంగా పుట్టగతులు ఉండవని తెలుసుకున్న జగన్... అక్కసుతో రాజధానిపై విషం కక్కుతున్నారు. జగన్ తన కోసం రూ.540 కోట్లు పెట్టి విశాఖపట్నంలో రుషికొండపై ప్యాలెస్ కట్టుకున్నారు. తాడేపల్లి, బెంగళూరు, హైదరాబాద్‌లో ప్యాలెస్‌లను కట్టుకున్నారు. ఏపీ ప్రజలకు మాత్రం రాజధాని వద్దా? అమరావతి రాజధాని నిర్మాణానికే కాకుండా జగన్ చాలా అడ్డంకులు సృష్టిస్తున్నారు. అమరావతి రాజధానికి ప్రపంచ స్థాయి గుర్తింపు వస్తుంది. జగన్ హయాంలో ఏపీలో జరిగిన లిక్కర్ స్కాం కంటే అతిపెద్ద భారీ కుంభకోణం విద్యుత్ స్కాం జరిగింది. సెకీ ఒప్పందం విషయంలో జగన్ అబద్ధాలు చెబుతున్నారు. వైఎస్ జగన్‌కు దేశభక్తి లేదు, కేవలం డబ్బు భక్తి మాత్రమే ఉంది. ఆపరేషన్ సిందూర్ గురించి జగన్ కనీసం ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదు?' అని సీఎం రమేశ్ ప్రశ్నించారు.



గృహ ప్రవేశానికి సిద్ధమైన ఇల్లు

నేడు కుప్పంలో బాబు గృహప్రవేశం

రోజంతా కొత్త ఇంటికే పరిమితం కానున్న సీఎం.. ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్న భువనేశ్వరి

కుప్పం, మే 24(ఆంధ్రజ్యోతి): మూడున్నర దశాబ్దాలుగా చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదరిస్తున్నారు. వారికి మరింత చేరువయ్యేందుకు వీలుగా ఆయన అక్కడ ఇంటి నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం గ్రామ పరిధిలోని రెండు ఎకరాల స్థలంలో నిర్మించుకున్న గృహ ప్రవేశానికి ఆదివారం ముహూర్తంగా నిర్ణయించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వారం రోజుల నుంచి ముమ్మరంగా సాగుతున్నాయి. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆదివారం మధ్యాహ్నానికే కుప్పం చేరుకుని నూతనగృహం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మంత్రి లోకేశ్, బ్రాహ్మణి దంపతులు, కుమారుడు దేవాన్ష్‌తో కలసి కుప్పం చేరుకున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత సీఎం చంద్రబాబు కుప్పం చేరుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ శ్రేణులకు ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లాయి.పార్టీనాయకులు సొంత కార్యంగా భావించి స్వయంగా వెళ్లి చంద్రబాబు తరపున ప్రజలను ఆహ్వానించారు. ఆదివారంఉదయం టిఫిన్‌తోపాటు మధ్యాహ్నం సుమారు 30వేల మందికి విందు భోజనాలు సిద్ధం చేస్తున్నారు. గృహ ప్రవేశం పూర్తిగా ప్రైవేటు కార్యక్రమం కావడంతో ఇతరత్రా ఎటువంటి కార్యక్రమాల్లో చంద్రబాబు కానీ, ఆయన ఇతర కుటుంబ సభ్యులు కానీ పాల్గొనే అవకాశం లేదని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆదివారం మొత్తం కుటుంబసభ్యులతో కలసి సొంత ఇంటిలోనే చంద్రబాబు బస చేస్తారని ఈవర్గాలు వెల్లడించాయి.



నూతన గృహం వద్ద టీడీపీ నాయకులను పలకరిస్తున్న నారా భువనేశ్వరి

భారీగా పసుపు పండగ

తొలి 2 రోజులు 30 వేల మందికి ఆతిథ్యం

ప్రతిష్ఠాత్మకంగా కడప మహానాడు .. బస నుంచి భోజనాల వరకూ పకడ్బందీగా సాగుతున్న ఏర్పాట్లు

- మూడోరోజు 5లక్షల మందికి భోజనాలు
- బహిరంగ సభ కోసం 8వేల బస్సులు సిద్ధం
- నేటి సాయంత్రానికి పనులు దాదాపు పూర్తి
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రుల కమిటీ
- భద్రతా ఏర్పాట్లపై డీజీపీ హరీశ్‌కుమార్ సమీక్ష

అమరావతి/కడప, మే 24(ఆంధ్రజ్యోతి): కడప గడపలో తొలిసారిగా నిర్వహించనున్న మహానాడును తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో మహానాడుకు హాజరయ్యే పార్టీ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస నుంచి భోజనాల వరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన అనంతరం జరుగుతున్న వేడుక కావడంతో దీన్ని ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ ముఖ్య నేతలు నెల రోజులుగా శ్రమిస్తున్నారు. ఈ మహానాడుకు రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. సాధారణంగా కడప జిల్లాను వైఎస్ కుటుంబానికి పెట్టని కోటగా భావిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని జిల్లాలను టీడీపీ శాసించినా కడపలో మాత్రం వైఎస్ కుటుంబమే పైచేయి సాధించేది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కంచుకోటను టీడీపీ బద్దలు కొట్టింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 అసెంబ్లీ స్థానాలు ఉండగా, ఏడు చోట్ల టీడీపీ జెండా ఎగిరింది. ఇది ఆ పార్టీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహాన్ని నింపింది. అదే ఊపులో ఈసారి మహానాడును కడపలో నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయించారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత కడపలో మహానాడు నిర్వహించడం ఇదే మొదటిసారి. ఇది ఓ ప్రత్యేకత కాగా, చంద్రబాబు 75 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో జరుగుతున్న మహానాడు కావడం మరో ప్రత్యేకత. టీడీపీ 40 వసంతాలు పూర్తి చేసుకున్న సమయంలో ఒంగోలులో మహానాడును 2022లో కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించారు. వైసీపీ పాలన అంతానికి ఒంగోలు మహానాడు నాంది పలికింది. ఇప్పుడు కడప మహానాడు ఆ జిల్లాలో వైఎస్ కంచుకోటను బద్దలు కొడుతుందని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి.



కడపలోని మహానాడు ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, డీఐజీ కోయ ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీశ్, ఎమ్మెల్యే పులివర్తి నాని

భారీగా ఏర్పాట్లు..

మహానాడు తొలి రెండురోజులు సుమారు 23వేల మంది ప్రతినిధులు వస్తారని అంచనా వేస్తున్నారు. వీరందరికీ ప్రస్తుత కడప జిల్లావ్యాప్తంగా బస ఏర్పాట్లు చేశారు. సుమారు 30వేల మందికి బస సిద్ధం చేశామని టీడీపీ నాయకులు తెలిపారు. వీరందరికీ భోజనాలకు మహానాడు ప్రాంగణం వద్దే ఏర్పాట్లు చేశారు. తొలి రెండు రోజులు 30వేల మందికి, మూడో రోజు సుమారు 5లక్షల మందికి భోజనం అందించనున్నారు. బహిరంగ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు నేతలు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు, అభిమానులు తరలివస్తుండటంతో వారందరికీ అవసరమైన రవాణా కోసం సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి కడప, చిత్తూరు, అనంతపురం, నెల్లూరునుంచి వచ్చేవారికి 3వేలబస్సులు, రాష్ట్రం నలుమూలనుంచి వచ్చేవారికి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు కలిపి 5వేల వరకూ అందుబాటులో ఉంచుతున్నారు.

ముమ్మరంగా పనులు

మహానాడు పనులు ఆదివారం సాయంత్రానికి దాదాపు పూర్తవుతాయి. ఏర్పాట్లను మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దనరెడ్డి, నిమ్మల రామానాయుడు, సంధ్యారాణి, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు అమర్‌నాథరెడ్డి, పులివర్తి నాని, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రవిచంద్రయాదవ్ శనివారం పరిశీలించారు. బహిరంగ సభకు వచ్చే వారి కోసం కర్నూలు- కడప- చిత్తూరు జాతీయ రహదారి, పులివెందుల రోడ్డులో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అన్నమయ్య జిల్లా నుంచి వచ్చే కార్యకర్తలకు గువ్వలచెరువు వద్ద భోజన సదుపాయం ఏర్పాట్లపై పరిశీలించారు. జన సమీకరణపై చర్చించారు. మహానాడు సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సూచించారు. వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలు, ఫుడ్ కోర్టు, ప్రధాన వేదిక వద్ద చేపట్టాల్సిన భద్రతపై పోలీసులకు సూచనలు చేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ డీజీ మధుసూదనరెడ్డి, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, అనంతపురం డీఐజీ షిమోషి, కడప, కర్నూలు, అన్నమయ్య, నంద్యాల జిల్లాల ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని డీజీపీ సూచించారు.

కరోనా విజృంభించే అవకాశం: వైసీపీ

- సభ వాయిదాకు చర్యలు తీసుకోండి: కడప జేసీకి వినతి

కడప ఎర్రముక్కపల్లె, మే 24(ఆంధ్రజ్యోతి): దేశంలో కరోనా కేసులు నమోదవుతున్న తరుణంలో మహానాడు ద్వారా కొవిడ్ మరింత విజృంభించే అవకాశం ఉందని వైసీపీ కడప జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మేయర్ సురేశ్‌బాబు పేర్కొన్నారు. కరోనా ప్రబలకముందే అప్రమత్తం కావాలన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే కడప నగరంలో ఒక కేసు నమోదయిందని చెప్పారు. ఇది కొత్త వేరియంట్ అంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మహానాడును వాయిదా వేసుకోవడం మంచిదని హితవు పలికారు. లేదంటే ఇక్కడే పెద్దఎత్తున కరోనా విజృంభించే పరిస్థితి ఉందన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.



హస్తినకు వెళ్లిన పవన్

- నేడు ఎన్డీయే భేటీకి హాజరు
- ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశం
- సిందూర్, కులగణనపై తీర్మానాలు

న్యూఢిల్లీ, మే 24(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం రాత్రి ఢిల్లీకి వెళ్లారు. ఆదివారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగే ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశం అశోకా హోటల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ జరగనుంది. ఎన్డీయే సమావేశానికి 20 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 18 మంది ఉప ముఖ్యమంత్రులు హాజరు కానున్నారు. ఇందులో కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటారు. ఈ భేటీలో రెండు తీర్మానాలను ఆమోదించనున్నారు. ఆపరేషన్ 'సిందూర్'ను విజయవంతంగా నిర్వహించిన భారత రక్షణ దళాలు, ప్రధానిని అభినందించడం, త్వరలో చేపట్టే జనగణనలో కులగణన నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ఎన్డీయే సీఎంలు అభినందనలు తెలిపే తీర్మానాలను ఆమోదించనున్నారు. ఈ భేటీకి సీఎం చంద్రబాబు హాజరు కాలేకపోతున్నారు. ముందే నిర్ణయించిన షెడ్యూల్ ఉండటంతో నీతి ఆయోగ్ సమావేశం తరువాత ఢిల్లీ నుంచి ఏపీకి తిరిగి వచ్చారు.

వికసిత భారతాన.. స్వర్ణాంధ్ర సాధన



నీతీ ఆయోగ్ సమావేశంలో ప్రధాన మంత్రి మోదీతో సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్

(మొదటి పేజీ తరువాయి)

రెండు, మూడో శ్రేణి నగరాల అభివృద్ధి వంటి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ప్రస్తావించారు. డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ ఏఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికీ ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ సృష్టిస్తున్నామని చంద్రబాబు వివరించారు. టాటా ఇన్నొవేషన్ హబ్, ఏఐ ఆధారిత పాలన ద్వారా ఏపీ స్టార్టప్‌లకు, ఉద్యోగ సృష్టికి మార్గదర్శకంగా మారిందని తెలిపారు. సర్క్యులర్ ఎకానమీ, అభివృద్ధి వికేంద్రీకరణ, మిషన్ కర్మయోగి వంటి కార్యక్రమాల ద్వారా సమగ్రాభివృద్ధిని ఆంధ్రప్రదేశ్ సాధిస్తోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ గత పదేళ్లలో పదో స్థానం నుంచి నాలుగో స్థానానికి చేరుకుందని, త్వరలోనే మూడో స్థానానికి వెళ్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ ఇండియా, జీఎస్టీ, స్టార్టప్ ఇండియా, పీఎం గతిశక్తి, జల్‌జీవన్ మిషన్ వంటి జాతీయ సంస్కరణలు అభివృద్ధికి దోహదం చేశాయని వివరించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్ధిని ఏపీ ప్రభుత్వం డిజిటల్‌గా ట్రాక్ చేస్తోందన్నారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఆంత్రప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని తెలిపారు. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్- వన్ పార్క్‌ను ప్రవేశపెడుతున్నామని చంద్రబాబు వివరించారు.

'ఆపరేషన్ సిందూర్' మోదీ ఘనతే..

పహల్గాం ఉగ్రదాడిలో మరణించినవారికి నీతీ ఆయోగ్ సమావేశంలో సీఎం చంద్రబాబు నివాళులు అర్పించారు. మోదీ ధీరత్వం, అద్భుత నాయకత్వంతోనే 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని కొనియాడారు. యుద్ధ వాతావరణం నెలకొన్న సంక్షోభ సమయంలో ప్రధాని మోదీ ధైర్యంగా నాయకత్వం వహించారని సీఎం ప్రశంసించారు.

బాబు బ్లూ ప్రింట్‌పై పీఎం ప్రశంసలు

నీతీ ఆయోగ్ సమావేశంలో ఏపీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను బ్లూ ప్రింట్ (ప్రణాళిక) ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న సంస్కరణలను అధ్యయనం చేయాలని సూచించారు. చంద్రబాబు రూపొందించిన ప్రణాళిక ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంటుందని మోదీ కొనియాడారు.

ఇవే మూడు మంత్రదండాలు

- జీడీపీ, జనాభా నిర్వహణ, టెక్నాలజీపై దృష్టి
- వాటి సాధనకు మూడు సబ్‌గ్రూప్‌లు
- రాష్ట్రాలు, కేంద్రం, నీతీ ఆయోగ్‌తో ఏర్పాటు
- సమావేశంలో ప్రతిపాదించిన చంద్రబాబు

న్యూఢిల్లీ, మే 24 (ఆంధ్రజ్యోతి) : 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని వేగవంతంగా సాధించేందుకు జీడీపీ, జనాభా నిర్వహణ, టెక్నాలజీపై దృష్టి సారించాలని సీఎం చంద్రబాబు అన్నారు. దీనికోసం మూడు సబ్ గ్రూప్‌లను రాష్ట్రాలతో ఏర్పాటు చేయాలని నీతీ ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. కేంద్రప్రభుత్వం, నీతీ ఆయోగ్, రాష్ట్రప్రభుత్వాలు ఈ సబ్‌గ్రూప్‌లలో కలిసి పని చేయాలని ఆయన సూచించారు. మొదటి సబ్‌గ్రూప్ జీడీపీ అభివృద్ధిని పెంచేందుకు, రెండవ సబ్‌గ్రూప్ జనాభా నిర్వహణకు, మూడో సబ్‌గ్రూప్ టెక్నాలజీ ఆధారిత పరిపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

మొదటి సబ్‌గ్రూప్ : పెట్టుబడులు, ఉత్పత్తి, ఎగుమతులు, పెంపొందించేందుకు, ఉపాధి కల్పన అవకశాలు కల్పించేందుకు పీపీపీ ప్రాజెక్టులకు కేంద్రం వయబులిటీ గ్యాప్ నిధులను సమకూర్చేందుకు పని చేయాలి.

రెండో సబ్‌గ్రూప్: వృద్ధాప్యం, తక్కువ సంతాన సాఫల్యం వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు దేశం సిద్ధమయ్యేందుకు తోడ్పాడాలి. దేశంలోని జనాభాను సదావకాశంగా భావించాలి.

మూడో సబ్‌గ్రూప్ : ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, డ్రోన్లు, రియల్‌టైమ్ డిజిటల్ ప్లాట్‌ఫాంలు, పౌరుల కేంద్రీకృత పాలనపై దృష్టి సారించాలి.

సంబంధం లేని వ్యక్తులను కేసుల్లో ఇరికిస్తున్నారు



- ఉపాధి కూలీలకు డబ్బులివ్వడం లేదు
- జూన్ 4న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు: బొత్స

విజయనగరం, మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం లేకపోగా... సంబంధం లేని వ్యక్తులను కేసుల్లో ఇరికించి ఇబ్బంది పెడుతున్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఈ విషయమై మాజీ సీఎం జగన్ అడిగిన ప్రశ్నలకు కూటమి నుంచి ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారని అన్నారు. విజయనగరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ఎక్కడ చూసినా అరాచకమే కనిపిస్తోందన్నారు. సూపర్ సిక్స్ గురించి గత ఎన్నికలకు ముందు కూటమి నాయకులు వాడవాడలా ప్రచారం చేశారని, ఈ ఏడాది కాలంలో సూపర్ సిక్స్ ఫ్లాప్ అయ్యిందని విమర్శించారు. తల్లికి వందనం ఎప్పుడిస్తారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని ప్రకటించినా ఇంతవరకూ విధివిధానాలు ఖరారు కాలేదని పేర్కొన్నారు. జూన్ 4తో కూటమి ప్రభుత్వానికి ఏడాది కావస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలపై అదే రోజును 'ప్రజా వంచన దినం'గా భావించి రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు, నిరసనలు చేపడతామని బొత్స తెలిపారు.

నాడు రంగా... నేడు వంశీ

- టీడీపీ పతనానికి వారి మరణాలే కారణం
- వంశీ మరణమే టీడీపీని బలి తీసుకుంటుంది: మాజీ మంత్రి పేర్ని



విజయవాడ, మే 24(ఆంధ్రజ్యోతి): "ఒక్కో పతనానికి ఒక్కో కారణం ఉంటుంది. నాడు వంగవీటి మోహనరంగా హత్య ఎన్టీఆర్ పతనానికి కారణమైంది. ఇప్పుడు వంశీ మరణమే టీడీపీని బలి తీసుకుంటుంది' అని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యానించారు. పోలీసు కస్టడీలో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను అస్వస్థత కారణంగా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయనను పరామర్శించడానికి వచ్చిన నాని ఆసుపత్రి ఆవరణలో మీడియాతో మాట్లాడారు. 'ప్రభుత్వం చేస్తున్న కుట్రల వల్ల వంశీకి ఏదైనా జరిగితే అతని మరణమే ప్రభుత్వాన్ని బలి తీసుకుంటుంది. ఊపిరాడడం లేదని, ఊపిరితిత్తుల్లో సమస్య ఉందనీ వంశీ కోర్టుకు చెప్పుకున్నాడు. కోర్టు ఆదేశాల మేరకు రోజూ రాత్రిపూట సీపీఆర్ విఎషన్ పెట్టుకుంటున్నారు. దొంగ పట్టాల పంపిణీ చేశారంటూ వంశీపై కేసు నమోదు చేశారు. అది చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు జరిగింది. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో చంద్రబాబు, లోకేశూ ముద్దాయిలే. వారినీ విచారించాలి. తీవ్రమైన అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న మాజీ ఎమ్మెల్యేను పరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకురావడం హేయమైన చర్య. ప్రిస్క్రిప్షన్ రాయాల్సిన వైద్యులు పెన్నుల్లో ఇంక్ అయిపోందని చెబుతున్నారు' అని పేర్ని అన్నారు. వంశీని పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఉన్నారు.

పేర్ని అనుమానాలు.. వైద్యుల ఆగ్రహం

'ఈ ఆసుపత్రికి ఓ సూపరింటెండెంట్ ఉన్నాడు. ఆయన మత్తు డాక్టరు. ఆసుపత్రిలో అందరినీ మత్తులో పెట్టాడు. దిక్కుమాలిన ఉద్యోగం కోసం చంద్రబాబు, లోకేశ్‌కు చెంచాగిరి చేస్తున్నాడు. మాజీ ఎమ్మెల్యే ఊపిరితిత్తులు ఆడక, గాలి పీల్చుకోలేక ఇబ్బంది పడుతుంటే 'ఏమీ లేదు... నీరసంగా ఉన్నారు. దారిలో ఓఆర్ఎస్ కొనుక్కొని తాగండి' అని చెప్పాడు. రాజధాని నడిబొడ్డున ఉన్న ఆసుపత్రిలో ఓఆర్ఎస్ కూడా లేదు. ఆ వెధవ ఓఆర్ఎస్ తెప్పించాలి కదా? పరీక్షలు, మందులు ఎవరూ రాయద్దని ఆర్డర్ వేశాడు.' అంటూ పేర్ని ఆరోపించారు.

కాగా, పేర్ని వ్యాఖ్యలను ప్రభుత్వ వైద్యుల సంఘం తీవ్రంగా ఖండించింది. నాని తన మాటలను వెనక్కి తీసుకోకుంటే జీడీఏ నుంచి యాక్షన్ ఉంటుందని హెచ్చరించింది. రాజకీయ దురుద్దేశంతో చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి పేర్ని, ప్రభుత్వ వైద్యులకు క్షమాపణ చెప్పాలని మంత్రి సత్యకుమార్ డిమాండ్ చేశారు.

సముచిత ప్రాధాన్యమిస్తే సరే! కాదంటే కొత్త పార్టీ

- తండ్రితో తేల్చుకోవాలనుకుంటున్న కవిత
- లేఖ లీకేజీపై ఆగ్రహంగా కేసీఆర్ తనయ
- ఎవరో తేలేవరకు పార్టీకి పూర్తిగా దూరం

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితిలో తగిన ప్రాధాన్యం దక్కకుంటే తన దారి తాను చూసుకోవాలనే యోచనలో కేసీఆర్ తనయ కవిత ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై అధిష్ఠానం స్పందన కోసం ఆమె ఎదురు చూస్తున్నారు. కేసీఆర్ నుంచి పిలుపు వస్తే అన్ని విషయాలు కులంకుషంగా చర్చించాలనుకుంటున్నారు. ప్రధానంగా రెండు అంశాలపై ఆమె పట్టుబడుతున్నట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. పార్టీలో తిరిగి తనకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరుతున్నారు. అలాగే, కేసీఆర్ చుట్టూ ఉన్న కోటరీ, తాను ప్రస్తావించిన దయ్యాల సంగతి కూడా తేల్చాల్సిందేనని గట్టిగా పట్టుబడుతున్నారు. పార్టీ అధినేత సానుకూలంగా స్పందించకుంటే కఠినమైన నిర్ణయం తీసుకునే యోచనలో కవిత ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అవసరమైతే పార్టీ నుంచి బయటకు వెళ్లేందుకు కూడా ఆమె సిద్ధమైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కవిత కొత్త పార్టీ దిశగా అడుగులు వేసే అవకాశం లేకపోలేదని అంటున్నాయి. రెండు వారాల కిందటే కవిత కీలక నిర్ణయం తీసుకుంటుందని భావించారు. ఎందుకో కార్యరూపం దాల్చలేదు. తాను రాసిన లేఖపై కేసీఆర్ స్పందిస్తారని, తాను ప్రస్తావించిన అంశాలపై చర్చిస్తారని ఆమె భావించారని, కానీ అవేమీ జరగలేదని, మరి కొంత సమయం కవిత ఎదురు చూశారని, ఈలోగా ఆమె రాసిన లేఖ బయట పడిందని తెలిపాయి.



పార్టీ పేర్లు ఇవే

తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే కొత్త పార్టీ పెట్టడం ఖాయమని కవిత సన్నిహితవర్గాలు వెల్లడించాయి. ఒకటి రెండు పేర్లు చర్చకు వచ్చినట్లు సమాచారం. తన మానస పుత్రిక తెలంగాణ జాగృతి సంస్థ పేరునే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశాలు లేకపోలేదని సన్నిహితులు చెబుతున్నారు. తెలంగాణ బహుజన రాష్ట్ర సమితి(టీబీఆర్ఎస్) పేరును కూడా ఆమెతో సన్నిహితంగా ఉండే కొందరు బీసీ నేతలు తెరపైకి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. కాగా, ముఖ్యంగా తన లేఖ లీకేజీపై కవిత తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. తాను చెబుతున్న దయ్యాలే వాటిని కావాలని బయటకు విడుదలచేసి ఉండాలని ఆమె భావిస్తున్నారు. తన లేఖ లీకేజీ వీరులెవరో తెలిసేదాకా పార్టీ కార్యాలయానికి కానీ, కేసీఆర్ వద్దకు కానీ వెళ్లకూడదని మరో ఆలోచన కూడా కవితకు ఉన్నట్లు సన్నిహితులు చెబుతున్నారు.

అంతర్గతంగానే మాట్లాడాలి!

- పార్టీలో ఎంత పెద్దవాళ్లయినా ఇదే సూత్రం: కేటీఆర్

హైదరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): పార్టీలో అంతర్గతంగా మాట్లాడాల్సిన విషయాలు, అంశాలను అంతర్గతంగానే మాట్లాడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా, ఏ హోదాలో ఉన్నా అలాగే చేయాలని చెప్పారు. ఈ సూత్రం పార్టీలోని అందరికీ వర్తిస్తుందన్నారు. కేసీఆర్ చుట్టూ దయ్యాలు చేరాయని చెల్లెలు కవిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో శనివారం విలేకరుల సమావేశంలో కేటీఆర్ ఆమె వ్యాఖ్యలపై స్పందించారు. నేషనల్ హెరాల్డ్ వ్యవహారంపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లెలి వ్యాఖ్యలపై ముక్తసరిగా స్పందించారు. తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని, ఎవరైనా తమ సూచనలు, సలహాలను ఏ విధంగానైనా తమకు ఇవ్వొచ్చని చెప్పారు. పార్టీ అధ్యక్షుడిని నేరుగా కలవొచ్చని, పార్టీ వేదికలు కూడా ఉన్నాయన్నారు. కవిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, కేసీఆర్ దేవుడైతే దయ్యం ఎవరంటూ విలేకరులు ప్రశ్నించగా, తెలంగాణకు పట్టిన దయ్యం రేవంత్, రాష్ట్రానికి పట్టిన శని కాంగ్రెస్ అని కేటీఆర్ బదులిచ్చారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పేరును చేర్చడం తెలంగాణకు అవమానకరమన్నారు.

బాలికను కిడ్నాప్ చేసి 3 రోజులు అత్యాచారం

- వేర్వేరు నగరాల్లోని లాడ్జీలకు తిప్పి అఘాయిత్యం
- రామలింగ మఠాధిపతి హఠయోగి లోకేశ్వరస్వామీజీ అరెస్టు



బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): బాలికను కిడ్నాప్ చేసి మూడు రోజుల పాటు లాడ్జీలకు తిప్పి అత్యాచారానికి పాల్పడిన కేసులో బెళగావి జిల్లా రాయబాగ తాలూకా మేకళి గ్రామంలోని రామలింగ మఠాధిపతి హఠయోగి లోకేశ్వరస్వామీజీని పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై పోక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేసినట్టు బెళగావి జిల్లా ఎస్పీ డాక్టర్ భీమాశంకర్ గుళేద చెప్పారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పీయూ ప్రథమ సంవత్సరం విద్యార్థిని(17) అనారోగ్యం నేపథ్యంలో రామలింగ మఠాన్ని ఆశ్రయించింది. ఆ మఠాధిపతి హఠయోగి లోకేశ్వరస్వామిజీపై ఆమెకు నమ్మకం, భక్తిభావం ఏర్పడ్డాయి. ఈ నెల 13న తన మేనమామ ఊరికి వెళ్లిన బాలిక కాలి నడకన తిరిగి స్వగ్రామానికి వస్తుండగా అటుగా కారులో వచ్చిన స్వామీజీ డ్రాప్ చేస్తానంటూ కారులో ఎక్కించుకున్నాడు. కారు తమ గ్రామం మీదుగానే వెళ్తుందని తెలిసి బాలిక కారులో ఎక్కింది. అయితే, కారును ఆ గ్రామంలో ఆపకుండా స్వామీజీ బాలికను బెదిరించి రాయచూరుకు తీసుకువెళ్లాడు. అక్కడి ఓ లాడ్జిలో రెండు రోజులపాటు ఉంచి అత్యాచారం చేశాడు. అనంతరం ఈ నెల 15న బాగల్కోటెకు తీసుకెళ్లి, అక్కడి ఓ లాడ్జిలో ఉంచి అత్యాచారం చేశాడు. ఇంటికి వెళతానని బాలిక ఏడవడంతో ఈ నెల 16న మహాలింగపుర బస్టాండ్‌లో వదిలేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అనంతరం బాలిక ఇంటికి చేరుకొని జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పింది. ఈ నెల 21న బాగల్కోటె మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసును మూడలిగె పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో స్వామీజీని గురువారం అరెస్టు చేసి, శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు.

భార్య సీమంతంలో భర్తకు గుండెపోటు.. మృతి



బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): భార్యకు సీమంతం చేస్తుండగా భర్త గుండెపోటుతో మృతి చెందిన విషాద ఘటన దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ తాలూకా విట్ల సమీపంలోని మిత్తనడ్క గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సతీష్(33) భార్య ఏడు నెలల గర్భిణి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో సీమంతం నిర్వహించారు. ఆ సమయంలో సతీష్ గుండెపోటుతో కుప్పకూలారు. వెంటనే మంగళూరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా సతీష్ మృతిచెందాడు.

ఫోన్ సౌండ్ తగ్గించమన్నందుకు భార్యపై యాసిడ్

- బెంగళూరులో దారుణం.. ఆలస్యంగా వెలుగులోకి..

బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): 'నిద్రపోవాలి.. ఫోన్ సౌండ్ తగ్గించు' అని చెప్పిన భార్యపై బాత్‌రూమ్ క్లీన్ చేసే యాసిడ్‌ను చల్లాడు భర్త. బెంగళూరు నగరంలోని చిక్కబాణవార ఎన్‌హెచ్‌ఎం లే అవుట్‌లో ఈ నెల 19న జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యూటీషియన్‌గా పనిచేసే భార్యను ఆ రాత్రి 9 గంటలకు మద్యం కోసం భర్త డబ్బులు అడిగాడు. ఇవ్వనన్నా.. తీవ్రంగా వేధించి డబ్బులు తీసుకుని వెళ్లి మద్యం తాగి వచ్చాడు. ఆ తర్వాత మొబైల్ ఫోన్‌లో సౌండ్ ఎక్కువగా పెట్టుకుని పాటలు వినడం ప్రారంభించాడు. తాను నిద్రపోవాలని, సౌండ్ తగ్గించాలని భార్య కోరడంతో ఆగ్రహించిన భర్త.. బాత్‌రూమ్ క్లీన్ చేసే యాసిడ్‌ను తెచ్చి ఆమెపై చల్లి పరారయ్యాడు. గాయపడ్డ ఆమెను స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని చిక్కబాణవార పోలీసులు శనివారం తెలిపారు.



నిందితుడి ఇంటిని ఎక్స్‌కవేటర్‌తో నేలమట్టం చేయిస్తున్న గ్రామస్థులు

కంబాలదిన్నె ఘటనపై గ్రామస్థుల కన్నెర్ర

- బాలికపై హత్యాచారానికి పాల్పడ్డ నిందితుడి ఇల్లు నేలమట్టం

జమ్మలమడుగు, మే 24 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా మైలవరం మండలం ఎ.కంబాలదిన్నెలో శుక్రవారం మూడేళ్ల బాలికపై అత్యాచారం చేసి, ఆపై దారుణంగా చంపేసిన నిందితుడు రహమతుల్లా ఇంటిని స్థానికులు శనివారం నేలమట్టం చేశారు. నిందితుడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. జులాయిగా తిరిగే రహమతుల్లా గ్రామానికి చెడ్డపేరు తెస్తున్నాడని ఆగ్రహించిన గ్రామస్థులు.. శనివారం ఉదయం అతడి ఇంటిని ఎక్సకవేటర్‌తో నేలమట్టం చేశారు. ఆ ఇంట్లో అతడితోపాటు ఉండే ఓ మహిళ శుక్రవారం రాత్రే ఎటో వెళ్లిపోయింది. రహమతుల్లా రోజూ మద్యం తాగి తనను చిత్రహింసలు పెట్టేవాడని పొరుగింట్లో ఉండే 80 ఏళ్ల వృద్ధురాలు కూడా ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు. మరోవైపు, హత్యాచారానికి గురైన చిన్నారి బంధువులు, కుటుంబ సభ్యులు శనివారం జమ్మలమడుగులో రోడ్డుపై బైఠాయించారు. దీంతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శనివారం అక్కడికి చేరుకుని బాధిత కటుంబంతో మాట్లాడారు. బాలిక హత్యాచారం ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. తక్షణ సాయం కింద రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. చిన్నారి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేస్తామని చెప్పారు.

మృత్యు శకటం!

బ్రేక్ ఫెయిలై ఆగి ఉన్న కారుపైకి దూసుకొచ్చిన లారీ

- నలుగురు దుర్మరణం.. ఆలయ మండల పూజకు వస్తుండగా దారుణం
- మృతుల్లో టెకీ దంపతులు, అక్కాతమ్ముడు
- బద్వేలు ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

సీకేదిన్నె, మే 24 (ఆంధ్రజ్యోతి): సొంతూరిలో ఆలయ మండల పూజలో పాల్గొనడంతోపాటు, కుమార్తె పుట్టుతల తీయించేందుకు సంతోషంగా కారులో బయలుదేరినవారిపైకి మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. ఆగి ఉన్న కారుపైకి లారీ పూర్తిగా ఎక్కేయడంతో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కడప జిల్లా బద్వేలు మండలంలో శనివారం ఉదయం ఈ ఘోరం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బద్వేలు మండలం చింతపుత్తాయపల్లెకు చెందిన బసినేని శ్రీకాంత్‌రెడ్డికి (32), శిరీష (30) దంపతులకు మూడేళ్ల కూతురు రిషికారెడ్డి ఉంది. శ్రీకాంత్‌రెడ్డి దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరి సమీప బంధువులు శశికళది బి.కోడూరు మండలం గంగిరెడ్డిపల్లె కాగా, స్వర్ణలతది మేకవారిపల్లె. వీరు కూడా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. శని, ఆదివారాలు సెలవులు కావడం తమ ఊరిలో రామాలయ మండలపూజ, అలాగే తమ కుమార్తెకు పుట్టెంటుకలు తీయించాలనే ఉద్దేశంతో శనివారం తెల్లవారుజామున శ్రీకాంత్‌రెడ్డి, శిరీష, వీరి కుమార్తె రిషికారెడ్డి, శశికళ, ఆమె పిల్లలు పి.సాయిహర్షిణి(11), రిషికేశ్‌రెడ్డి(9), కోటగం స్వర్ణలత కలిసి ఒకే కారులో చింతపుత్తాయపల్లెకు బయలుదేరారు. గువ్వలచెరువు ఘాట్ దిగుతుండగా 4వ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న భారీ వాహనానికి దారిచ్చేందుకు కారును రోడ్డు పక్కన ఆపారు. ఇంతలో వెనుక నుంచి తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు టెంకాయల లోడుతో వస్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి కారుపైకి దూసుకుపోయింది. కారు నుజ్జునుజ్జయి శిరీష, శ్రీకాంత్‌తోపాటు, అక్కాతమ్ముడు సాయిహర్షితారెడ్డి, రిషికేశ్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు.



మృత్యుంజయురాలు శ్రీకాంత్‌రెడ్డి, శిరీషల కుమార్తె రిషికారెడ్డి

రెండు గంటలు కారులోనే..

ఉదయం 9.50 గంటలకు ప్రమాదం జరగ్గా, రెండు గంటలపాటు బాధితులంతా కారులోనే ఇరుక్కుపోయారు. సీకే దిన్నె పోలీసులు లారీని తొలగించడానికి ఎక్సకవేటర్, క్రేన్ తెప్పించారు. కారులో ఇరుక్కుపోయిన చిన్నారి రిషికారెడ్డి, స్వర్ణలత, శశికళను అతి కష్టంమీద రక్షించి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. శ్రీకాంత్‌రెడ్డి, శిరీష, సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డి మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.



కారుపైకి దూసుకొచ్చిన లారీ

పల్నాడులో టీడీపీ నేతల దారుణ హత్య



జెవిశెట్టి వెంకటేశ్వర్లు మృతదేహం



జెవిశెట్టి కోటేశ్వరరావు మృతదేహం

- బైక్‌పై వస్తుండగా అన్నదమ్ములపై దాడి
- స్కార్పియోతో ఢీకొట్టి చంపిన ప్రత్యర్థులు
- వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టెన్షన్

గుంటూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వస్తున్నవారిని స్కార్పియోతో గుద్ది దారుణంగా హత్యచేశారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన ఇద్దరు అన్నదమ్ముల కాళ్లు విరిగిపోయాయి. అక్కడికక్కడే వారు మృత్యువాతపడ్డారు. కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి మారిన ప్రత్యర్థులు రాజకీయ ఆధిపత్యంలో భాగంగా ఇంత ఘాతుకానికి ఒడిగట్టారు. పల్నాడులోని వెల్దుర్తి మండలం గుండ్లపాడులో శనివారం ఈ ఘటన కలవరం రేపింది. వైసీపీ హయాంలో ఆ పార్టీ గూండాలు హత్యచేసిన టీడీపీ నేత చంద్రయ్యది కూడా ఇదే గ్రామం.గుండ్లపాడు గ్రామంలో చంద్రయ్య, జెవిశెట్టి వెంకటేశ్వర్లు(మొద్దయ్య) (60), తమ్ముడు కోటేశ్వరరావు(56) టీడీపీలో కీలక నేతలు. చంద్రయ్య హత్యకు గురైనప్పటినుంచి ఈ అన్నదమ్ములే పార్టీ వ్యవహారాలను గ్రామంలో చక్కబెడుతున్నారు. అయితే గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న వెంకట్రామయ్య వర్గం, ఆ తరువాత టీడీపీలో చేరింది. గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కోసం వెంకటరామయ్య ఎంతోకాలంగా ప్రయత్నిస్తున్నారు. అయితే వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులకు గ్రామంలో మంచి పట్టు ఉంది. దీంతో వారిద్దరు ఉన్నంతవరకు గ్రామంలో తన ఆధిపత్యం నడవదని వెంకట్రామయ్య భావించారు. రెండు రోజుల క్రితం పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు గ్రామంలో పల్లెనిద్రకు వచ్చారు. ఎస్పీ వెళుతూ.. గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా పెద్దమనిషిగా ఉన్న జెవిశెట్టి వెంకటేశ్వర్లును సంప్రదించాలని సూచించారు. ఎస్పీ ప్రకటన కూడా వెంకట్రామయ్యకు కంటకింపుగా మారింది. అలాగే, వెంకట్రామయ్య వర్గానికి చెందిన శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి రెండు కాళ్లు కొంతమంది వ్యక్తులు విరగ్గొట్టారు. ఈ ఘటనలో దాడి చేసినవారికి వెంకటేశ్వరరావు మద్దతుగా నిలవడం కూడా వెంకట్రామయ్యకు రుచించలేదు. దీంతో వారిరువురిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. వారిద్దరి పెదనాన్న కుమారుడు జెవిశెట్టి శ్రీనివాసరావు(బొబ్బిలి) అనే వ్యక్తితో కలిసి వెంకట్రామయ్య పక్కా ప్లాన్ రచించారు. వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుతోపాటు వెంకటేశ్వర్లు అల్లుడు తోట ఆంజనేయులు, మరో 12 మంది తెలంగాణలోని సూర్యాపేట జిల్లా నక్కలగూడెం గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లారు. వేడుక ముగించుకుని ద్విచక్ర వాహనాలపై శనివారం గ్రామానికి బయలుదేరారు. మిగిలిన వారంతా మాచర్లలో ఆగి టీ తాగుతుండగా వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై గుండ్లపాడుకు బయలుదేరారు. గ్రామానికి వెళ్లే మార్గంలో అప్పటికే వారి ప్రత్యర్థులు తోట వెంకటరామయ్య, జెవిశెట్టి శ్రీనివాసరావు, మరో ఇరువురు ముందే రెక్కీ నిర్వహించి దాడికి సిద్ధంగా ఉన్నారు. స్కార్పియో వాహనంలో గుండ్లపాడు నుంచి మాచర్లకు వచ్చేమార్గంలో అన్నదమ్ముల ద్విచక్ర వాహనానికి ఎదురుగా వచ్చారు. భోజనవీడు- మండాది గ్రామాలకు మధ్యలో అతివేగంగా స్కార్పియోతో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో అన్నదమ్ములు రోడ్డు పక్కన ఉన్న నాలుగడుగుల కట్ట మీద నుంచి ఎగిరి 10 అడుగుల దూరంలో పడిపోయారు. వారి ఇరువురి కాళ్లు విరిగిపోయాయి. తీవ్రంగా రక్తస్రావమై వారిరువురి ప్రాణాలు పోయాయా లేదంటే కదల్లేని స్థితిలో ఉన్నవారిని హత్య చేశారా అన్నదానిపై స్పష్టత రాలేదు. అయితే వారి ఒంటిపై వేరే గాయాలు లేవని పోలీసులు అంటున్నారు. సమీపంలో ఎక్కడా కూడా మారణాయుధాలు పోలీసులకు లభించలేదు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంతోపాటు స్కార్పియో ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటన జరిగిన పది నిమిషాల్లోనే వెంకటేశ్వర్లు అల్లుడు తోట ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై వెనుకనే వచ్చారు. ఆ సమయానికి వెంకట్రామయ్య, శ్రీనివాసరావు డ్రైవర్‌తో పాటు మరొకరు స్కార్పియోను అక్కడే వదిలేసి రచ్చమల్లపాడు వెళ్లే డొంకలోకి పారిపోతుండటాన్ని ఆంజనేయులు చూశారు. పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

భూముల విక్రయం పేరుతో జోగి మోసం

- ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపి 2021లో విక్రయానికి సిద్ధపడ్డ మాజీ మంత్రి
- 90 లక్షలు వసూలు చేశాక ముఖం చాటు
- కృత్తివెన్ను పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



మచిలీపట్నం, మే 24(ఆంధ్రజ్యోతి): భూముల విక్రయం పేరుతో మాజీ మంత్రి, పెడన మాజీ ఎమ్మెల్యే జోగి రమేశ్ చేసిన మోసం బయటపడింది. వైసీపీ అధికారంలో ఉండగా ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపి రూ. 90 లక్షల కాజేసిన వైనం వెలుగులోకి వచ్చిం ది. దీనికి సంబంధించి కృష్ణాజిల్లా కృత్తివెన్ను పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామంలో ఎకరం రూ. 3 లక్షల చొప్పున 30 ఎకరాలు రైతులు అమ్మడానికి సిద్ధంగా ఉన్నారని పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన తమ్ము వీరవెంకటప్రసాద్, ఆయన కుమారుడు కల్యాణ్‌కుమార్‌లను 2021లో జోగి రమేశ్, ఆయన అనుచరులు నమ్మించారు. ఏ ఇబ్బంది వచ్చినా తాము చూసుకుంటామని భరోసా ఇచ్చారు. విడతల వారీగా రూ. 90 లక్షలు చెల్లించిన తర్వాత ఆ భూమిని చూపకుండా, రిజిస్ట్రేషన్ చేయించకుండా రమేశ్ తప్పించుకు తిరిగారు. దీనిపై అనుమానం వచ్చి విచారణ చేస్తే అది ప్రభుత్వ భూమి అని తెలుసుకున్నారు. తమ డబ్బు తిరిగి ఇవ్వాలని కోరినా మాజీ మంత్రి పట్టించుకోవడంలేదు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు.

బెజవాడ, విశాఖల్లో బాంబు బెదిరింపు కలకలం



బెజవాడ బీసెంట్ రోడ్డులో తనిఖీలు చేస్తున్న బాంబు స్క్వాడ్

- బీసెంట్ రోడ్డు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు
- పోలీసు కంట్రోల్ రూంకే ఫోన్‌చేసిన ఆగంతకుడు
- విశాఖలో ఎల్‌టీటీకి బెదిరింపు

విజయవాడ, విశాఖపట్నం మే 24 (ఆంధ్రజ్యోతి): బెజవాడను శనివారం బాంబు బెదిరింపు కాల్ కలవర పెట్టింది. అలాగే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు పెట్టినట్లు ఫేక్ కాల్ రావడంతో విశాఖ రైల్వేస్టేషన్‌లోనూ కలకలం రేగింది. చివరికి ఎక్కడా ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శనివారం ఉదయం విజయవాడ బీసెంట్ రోడ్డు, రైల్వే స్టేషన్‌లలో బాంబులు అమర్చినట్లు ఓ ఆగంతకుడు పోలీసు కంట్రోల్ రూముకే ఫోన్ చేశాడు. హిందీలో మాట్లాడిన ఆగంతకుడు.. ముందుగా బీసెంట్ రోడ్డు పేరు చెప్పాడు. తర్వాత స్టేషన్.. అని మాత్రమే చెప్పి ఫోన్ కట్ చేశాడు. అప్రమత్తమైన కంట్రోల్ రూం సిబ్బంది ఉన్నతాధికారులకు తెలియజేశారు. వారు స్థానిక పోలీసులతోపాటు సిటీ సెక్యూరిటీ వింగ్, ఏఆర్, బాంబు డిటెక్టివ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. ఆగంతకుడు స్టేషన్.. అని చెప్పడంతో పోలీసులు రైల్వేస్టేషన్‌లో సోదాలు నిర్వహించారు. అణువణువూ జల్లెడ పట్టారు. రాఘవయ్య పార్కు నుంచి ఏలూరు రోడ్డు వరకు ఉన్న బీసెంట్ రోడ్డు మొత్తాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎక్కడా బాంబు ఛాయలు గానీ, దాని మూలాలు గానీ కనిపించలేదు.



విశాఖ రైల్వే ప్లాట్‌ఫామ్‌పై బాంబ్, డాగ్ స్క్వాడ్ల తనిఖీ

విశాఖ స్టేషన్‌లో తనిఖీలు..

ముంబై నుంచి విశాఖపట్నం వస్తున్న రైలు(18520)లో బాంబు ఉందని బెదిరింపు కాల్ రావడంతో శనివారం విశాఖ రైల్వే స్టేషన్లో కలకలం రేగింది. ఆ రైలులో బాంబు ఉందని రైల్వే అధికారులకు అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ రావడంతో జీఆర్‌పీ, టాస్క్ ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు అప్రమత్తమై తనిఖీలు చేయగా ఏమీ లేదని తేలింది.

వంశీకి అస్వస్థత

- విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం
- అనంతరం నూజివీడు కోర్టులో హాజరు
- అక్కడా వైద్య పరీక్షలు చేయించిన జడ్జి
- ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందన్న వైద్యులు
- మళ్లీ విజయవాడ జైలుకు తరలింపు

విజయవాడ/నూజివీడు, మే 24(ఆంధ్రజ్యోతి): నకిలీ ఇళ్ల పట్టాల కేసులో విచారణ ఎదుర్కొంటున్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అస్వస్థతకు లోనయ్యారు. కస్టడీలో భాగంగా పోలీసులు వంశీని కంకిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో వాంతులు చేసుకోవడంతో పీహెచ్‌సీకి తరలించారు. శనివారం ఉదయం వరకు వైద్యం అందజేశారు. తర్వాత స్టేషన్‌కు తరలించారు. పోలీసులు విచారణకు సిద్ధమవుతుండగా, మళ్లీ వాంతులయ్యే సూచనలు ఉన్నాయని వంశీ చెప్పారు. దీంతో ఆయన్ను పోలీసులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, నీరసంగా ఉండడం వల్ల వాంతులు అయినట్టు తెలిపారు. దీంతో పోలీసులు రెండో రోజు వంశీని విచారించకుండానే కోర్టులో హాజరుపరిచారు.



మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చిన పోలీసులు

బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఇళ్లపట్టాల కేసులో వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణను నూజివీడు కోర్టు ఈనెల 26 కు వాయిదా వేసింది. వంశీని కస్టడీకి తీసుకున్న హనుమాన్ జంక్షన్ పోలీసులు నూజివీడు కోర్టులో హాజరు పరిచిన సందర్భంగా ఫ్లూయిడ్స్ ఎక్కించేందుకు ఆయన చేతికి ఉన్న కాన్యులాను జడ్జి గమనించారు. నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్యులను పిలిపించి వంశీ ఆరోగ్యంపై వివరణ కోరారు. ఆయనకు నీరసం తప్ప మిగతా ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు చెప్పారు. కాన్యులాను తొలగించి ప్లాస్టర్ వేశారు. అనంతరం పోలీసులు వంశీని విజయవాడ జైలుకి తరలించారు.

రెండు రోజుల పోలీస్ కస్టడీకి పీఎస్ఆర్, మధు

- గ్రూప్-1 కేసులో విజయవాడ కోర్టు ఉత్తర్వులు
- నేటి నుంచి పోలీసు విచారణ ప్రారంభం
- పీఎస్ఆర్‌కు అస్వస్థత.. బీపీలో హెచ్చుతగ్గులు

పీఎస్సార్ ఆంజనేయులును విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చిన పోలీసులు



విజయవాడ, మే 24(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూపు-1 కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, పమిడికాల్వ మధుసూదన్‌లను రెండు రోజులు పోలీసు కస్టడీకి ఇస్తూ కోర్టు శనివారం ఉత్తర్వులిచ్చింది. ఈ ఇద్దరు విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టడానికి వారం పాటు కస్టడీకి ఇవ్వాలని సూర్యారావుపేట పోలీసులు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ వేశారు. రెండు రోజుల క్రితం దీనిపై వాదనలు ముగిశాయి. రెగ్యులర్ కోర్టుకు సెలవులు కావడంతో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి అప్పారావు తీర్పు చెప్పారు. ఆదివారం ఉదయం 6 గంటలకు జైలు నుంచి పీఎస్ఆర్, మధుసూదన్‌లను కస్టడీకి తీసుకుని సోమవారం సాయంత్రం ఐదు గంటలకు తిరిగి జిల్లా జైలుకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. జైలు నుంచి తీసుకెళ్లేటప్పుడు తిరిగి అప్పగించేటప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, జైల్లో ఉన్న పీఎస్ఆర్ శనివారం అస్వస్థతకు లోనయ్యారు. బీపీలో హెచ్చుతగ్గులు ఉండడంతో జైలు అధికారులు ఆయన్ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించిన అనంతరం తిరిగి జైలుకు తీసుకెళ్లారు. కాదంబరి జెత్వాని కేసులో కోర్టు పోలీసు కస్టడీకి ఇచ్చినప్పుడు కూడా ఆయన బీపీలో హెచ్చుతగ్గులతో ఇబ్బంది పడ్డారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.